అనుదినం... జనస్వరం
# నవతెలంగాణ
మంగళవారం 13 -3 -2018
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 74 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | W O W | 12 + 16 పేజీలు వెల : 5.00W



# రసాభాస

### సమస్యలు పక్కకు.. తొలిరోజు సభ తీరు..
### పై చేయి కోసం అధికార, ప్రతిపక్షాల పాకులాట
### ఇక జనం సమస్యలు గాలికేనా..?



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

షరా మామూలే.. అధికార, ప్రధాన ప్రతిపక్షాలు ఆనవాయితీగా సభలో తమ ఆధిపత్యం, పై చేయి కోసం పాకులాడాయి. దీంతో ప్రజా సమస్యలపై చర్చకు వేదిక కావాల్సిన శాసనసభ రణరంగంగా మారింది. ఫలితంగా జనానికి సంబంధించిన అంశాలు పక్కకుపోయి.. నాయకుల సవాళ్లు, ప్రతి సవాళ్లూ ముందుకొచ్చాయి. పేపర్లు చిరిగాయి, మైకులు విరిగాయి. ఇదే సమయంలో గవర్నర్ ప్రసంగంలోని అంశాలకు మించి శాసన మండలి చైర్మెన్ స్వామిగౌడ్ కన్నుకు గాయమైందనే విషయం సర్వత్రా చర్చనీయాంశమైంది. సభలో కొనసాగిన ఈ రాద్ధాంతంలో తప్పు మీదంటే మీదేనంటూ టీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు పరస్పర ఆరోపణాస్త్రాలు సంధించుకున్నారు. కాంగ్రెస్ సభ్యులు మద్యం తాగి సభకు వచ్చారంటూ మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి ఎద్దేవా చేయగా.. స్వామిగౌడ్ కంటికి గాయమైందని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో మార్చి 27 వరకు అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరుగుతాయా? జరిగినా బడ్జెట్ లోని అంశాలు.. ప్రజా సమస్యలు ప్రస్తావన కొస్తాయా..? అనే సందేహాలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. బడ్జెట్ సమావేశాల తొలిరోజైన సోమవారం శాసన సభ ప్రారంభమే.. ఉద్రిక్త వాతావరణాన్ని ...9లో



## అన్నింటా అభివృద్ధి

- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

9లో





ముంబయిలో మహాముట్టడిలో పాల్గొన్న రైతులు


# మహాగర్జన

## లాంగ్‌మార్చ్‌తో దిగొచ్చిన మహా సర్కార్

### రైతుల డిమాండ్లకు ఫడ్నవీస్ ప్రభుత్వం అంగీకారం
### ఆరు రోజులు.. 200 కిలోమీటర్లు పాదయాత్ర
### కాళ్లకు బొబ్బలెక్కినా వెనక్కి తగ్గని కర్షకులు
### ఫలించిన అలుపెరుగని పోరాటం
### ఆందోళన విరమించిన రైతులు

**ముంబయి :** రైతుల సంక్షేమం పట్ల ఎనలేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది. వేలాది మంది రైతులు ముంబయికి చేరు కోవడంతో ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ఆగమేఘాల మీద దిద్దుబాటు చర్యలను ప్రారం భించారు. రైతుల డిమాండ్లను పరిష్కరిస్తామని అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈనెల 6న నాసిక్‌లోని సీబీఎస్ చౌక్ వద్ద పాదయాత్ర ప్రారంభమైంది. పాదయాత్రలో థానె, పాల్గఢ్ జిల్లాల రైతులు సైతం పాల్గొన్నారు. పూర్తి రుణమాఫీ, కరెంటు బిల్లుల రద్దు, స్వామి నాథన్ కమిషన్ సిఫార్సు అమలు, నదుల అనుసంధాన ప్రక్రియను ప్రక్షాళన చేసి గిరిజన గ్రామాలు మునిగిపోకుండా చూడటం, అటవీ హక్కుల చట్టం-2006 అమలు సహా 20 డిమాండ్లను రైతులు.. ప్రభుత్వం ముందుంచారు. ఆరు రోజుల పాటు సాగిన లాంగ్ మార్చ్ సోమవారం ఉదయం ముంబయిలోని ఆజాద్ మైదాన్‌కు చేరుకున్నది. అసెంబ్లీ ముట్టడికి అనుమతి లేదని పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. అయినాగానీ సంకల్పం వీడని ...9లో

ఆత్మహత్యలు కాదు.ఆగ్రహించటమే ఏకైక మార్గమని అన్నదాత గుర్తించాడు. పోరుబాటనే ఎంచుకున్నాడు. ఆడ, మగా, ముసలీ ముతకా అన్న తేడాలేదు..కాళ్లు పగిలినా.. రక్తం కారినా.. రైతుల పట్టుదల మాత్రం సడలలేదు. నెత్తిన ఎర్రటి ఎండ చుర్రుమంటున్నా.. ఆరు రోజులపాటు..200 కిలోమీటర్లు ఏకధాటిన కాలినడకన కొనసాగించారు. పాలకుల నిర్ణయాలతో దిక్కుతోచని స్థితి నుంచి తాడోపేడో తేల్చుకుందామని రైతులు కదం తొక్కారు. కడుపుమండిన అన్నదాత ఆగ్రహంతో ముంబయినగరానికి చేరుకున్నారు.దీంతో మహానగరంలో ఎటు చూసినా రైతులే కనిపించారు. మొక్కవోని ధైర్యంతో కదిలిన శ్రామిక జీవులను స్థానిక జనం అక్కున చేర్చుకున్నారు. ఆదరించారు. ఆకలి తీర్చేందుకు చేతనైన సాయం చేశారు. దాహం తీర్చారు. అనుమతిలేదన్న పాలకుల ఛీంకారాలు..రైతన్న గుండె ధైర్యం ముందు తలవంచాయి. రైతులు పాలకుల మెడలు వంచారు. విజయం సాధించారు. బీజేపీ పాలకులు తోకముడిచారు. శాసనసభ ముట్టడికి రైతులు సమాయత్తమవుతుండగానే.. మహారాష్ట్ర పాలకులు దిగిరాకతప్పలేదు. రైతుల కోర్కెలు అంగీకరిస్తూ.. అసెంబ్లీలో ఆ రాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ప్రకటించారు.



## నాటి స్వాతంత్ర్య పోరాటంలా...

- కార్పొరేట్లకో న్యాయం... అన్నదాతలకు మరో న్యాయమా?
- రైతు డిమాండ్లు నెరవేర్చకపోతే పునాదులు కూలుతాయ్: ఏచూరి

వివరాలు 9లో

# వాస్తవాలకు దూరం

### గవర్నర్ ప్రసంగంపై సున్నం రాజయ్య



అసెంబ్లీకి ద్విచక్ర వాహనంపై వస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు దూరంగా ఉందని సీపీఐ(ఎం) శాసనసభ్యులు సున్నం రాజయ్య విమర్శించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో గవర్నర్ ప్రసంగంపై ఆయన మాట్లాడుతూ మసిపూసి మారెడుకాయ చేసినట్టుగా ఉందన్నారు. అభివృద్ధి ప్రణాళిక గురించి ఎక్కడా లేదని చెప్పారు. వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధి చేయకుండా రాష్ట్రాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధి 12 శాతం నుంచి 8 శాతానికి పడిపోయిందని అన్నారు. సామాజిక వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి ప్రస్తావన లేదన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పోడు హక్కు దారుల భూముల ...9లో



## ఇంటర్ విద్యార్థి దారుణ హత్య

- వేట కొడవళ్లతో అతికిరాతంగా నరికిన దుండగులు
- నిందితుల్లో ఒకరిని వెంబడించి పట్టుకున్న ట్రాఫిక్ హోంగార్డ్
- పాత కక్షలే కారణముండొచ్చనే అనుమానం

9లో



అధికార పార్టీకి చెందిన నాయకుడు ఈ రైతు. ట్యాంకర్‌లో నీళ్లు తెచ్చి పొలానికి నీళ్లు పెడుతున్నాడు. మరి సాధారణ రైతు పరిస్థితి..! జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజారాంపల్లిలో రైతు గాజుల మల్లేశం

నవతెలంగాణ-వెల్గటూర్

## 15న ఎడ్‌సెట్

- 18నుంచి దరఖాస్తుల స్వీకరణ షురూ
- సమర్పణకు తుదిగడువు ఏప్రిల్ 20
- మే 31, జూన్1న ఆన్‌లైన్‌లో రాతపరీక్ష : షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యా మండలి

వివరాలు 9లో

# అడ్వాన్సు కడితేనే ఆరోగ్యశ్రీ

- కొన్ని ప్రయివేటు దవాఖానల తీరు
- నాసిరకం సేవలతో రోగులకు రిక్తహస్తం
- సర్కారు నుంచి సొమ్ము వసూలు చేస్తూ అరకొర వసతులు
- పేద రోగులకు అందని ద్రాక్షగా పథకం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

'హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌కు కిడ్నీలో రాళ్లు రావడంతో సరూర్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లాడు. చాలా నొప్పిగా ఉందని బాధితుడు చెప్పడంతో అత్యవసర చికిత్స చేయాలని, అందుకు అడ్వాన్సుగా రూ.10 వేలు చెల్లించాలని అక్కడి డాక్టర్లు చెప్పారు. అయితే. తనకు ఆరోగ్య శ్రీ కార్డు ఉందని ఉచితంగా చికిత్స చేయాల్సిందిగా కోరాడు. కార్డు ఉన్నా ఆరోగ్య శ్రీ ట్రస్టు



నుండి అప్రూవల్ రావాలంటే ఒకరోజు సమయం పడుతుందని.. అందువల్ల అడ్వాన్సు చెల్లిస్తే అప్రూవల్ వచ్చాక తిరిగి ఇచ్చేస్తామని చెప్పారు. అత్యవసరం కావడంతో చేసేదిలేక బాధితుడు చెప్పిన మొత్తం చెల్లించాడు. కానీ, డిశ్చార్జ్ అయినా ఆ డబ్బులు ఆస్పత్రి యాజమాన్యం తిరిగి ఇవ్వలేదు. వ్యాధీ నయమవలేదు.'

'ఖమ్మం జిల్లాకు చెందిన మంగీలాల్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి లుకేమియా (బ్లడ్‌క్యాన్సర్)తో బాధపడుతున్నాడు. తనకు ఆరోగ్య శ్రీ కార్డు ఉందన్న భరోసాతో కొన్నాళ్ల క్రితం నగరంలో రెండు ప్రయివేటు ఆస్పత్రులను సంప్రదించాడు. కార్డు ఉన్నా..చికిత్స చేయాలంటే రూ.30 నుంచి 40 లక్షలు ఖర్చవుతాయని అక్కడి డాక్టర్లు చెప్పడంతో నివ్వెరపోయాడు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో బాధితుడు ఎంఎన్‌జేలో చికిత్సపొంది బతుకుజీవుడా అంటూ బయటపడ్డాడు. లేకుంటే పరిస్థితి మరోలా ఉండేదేమో.'

ఇలాంటి దుస్థితి వీరిద్దరిదే కాదు. రాష్ట్రంలో ఎంతో మంది పేద రోగులకు ఎదురవుతున్న సమస్య. ఆరోగ్య శ్రీ కార్డు ఉందన్న కొండంత భరోసాతో వైద్యం కోసం పేద రోగులు మల్టీస్పెషాలిటీ, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళితే జేబులు గుల్లవుతున్నాయి. ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి చికిత్సకు అనుమతి రావడం ఆలస్యమైతే పేదల నుంచి ముందస్తుగానే అడ్వాన్సుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. తమకు గిట్టుబాటయ్యే వ్యాధులకు మాత్రమే ...9లో

ఖమ్మంలో...





# కనీస వేతనం కోసం పోరుబాట

- రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల ఆందోళన

వివరాలు 9లో

**ఎర్రసముద్రాన్ని తలపించిన మహారాష్ట్ర పాదయాత్రలు పాల్గొన్న కొందరు అన్నదాతల ఆవేదన వారి మాటల్లో...**

### జీవితం మొత్తం కూలీ బతుకే

**రాదాభాయి.. దిండోరి, నాసిక్ జిల్లా**



నా వయస్సు 65 యేండ్లు. నా జీవితం మొత్తం ఇతరుల పొలాల్లోనే పని చేయవలసి వచ్చింది. ఖాళీగా ఉన్న అటవీ భూమిలో ఒక ఎకరం భూమిని బతుకుదెరువుకోసం ఇప్పించాలని రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఆ భూమితో నా వారసులకైనా మంచి భవిష్యత్ దొరుకుతుందని ఆశ. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

### నీళ్లు లేక కూలికి వెళ్తున్నాం

**హిరమన్ వాగ్మేర్(46).. చికడి. నాసిక్ జిల్లా**



నాకు అయిదెకరాల భూమి ఉంది. వర్షాలు పడితేనే పంటలు పండుతాయి. బోరు, బావి తవ్వే స్థోమత లేదు. వర్షాలు కురువక, నీటి సదుపాయం లేక నిత్యం రూ. 100కు కూలికి వెళ్తున్నాం.

ప్రభుత్వం మా భూములకు పట్టాలు ఇప్పిస్తే బ్యాంకు వద్ద రుణాలు తీసుకుని నీటి సదుపాయం కల్పించుకుంటాం.

### రుణ మాఫీ కాలేదు

**రాజేబావు రాథోడ్(42).. సుర్‌పింప్రీ గ్రామం, ప్రభాని జిల్లా**



నాకున్న మూడెకరాల భూమిని 2012లో బ్యాంకులో తనాఖా పెట్టి రూ. 1.80 లక్షలు అప్పు తీసుకున్నా. బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ హామీని చూసి ఓట్లేసాం. కానీ ఆ ఆనందం ఆవిరవ్వడానికి ఎంతోకాలం పట్టలేదు. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో నా పేరున్నా బ్యాంకు వారి వద్దకు వెళ్తే కొత్త రుణాన్ని ఇవ్వడం లేదు. ప్రభుత్వం రుణాన్ని మాఫీ చేయలేదు. మూడేండ్లుగా కరువుతో పంటల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

### నిండా మునిగాం

**రామ్‌రాజే (40) మన్వత్, పర్‌బానీ జిల్లా**



ఈ యేడు మూడెకరాల్లో పత్తి పంట వేశాం. గులాబీ పురుగు సోకి పంటంతా నాశనమైంది. ఎకరానికి 12 క్వింటాళ్లు రావలసిన దిగుబడి రెండు క్వింటాళ్లు కూడా రాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించినా ఇంతవరకూ అందలేదు.

### అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

**- కృష్ణ(34) తల్వాడా, థానే జిల్లా**



నాకు ఎనిమిదెకరాల భూమి ఉంటే ప్రభుత్వాధికారులు కేవలం నాలుగెకరాలు మాత్రమే రికార్డుల్లో ఎక్కించారు. మా గ్రామంలో చాలా మంది పరిస్థితి ఇదే విధంగా ఉంది. ప్రభుత్వం వెంటనే అటవీ హక్కుల చట్టం- 2006ను సమర్థవంతంగా అమలు చేసి మా భూములు మా పేర రిజిష్టర్ చేయాలి.

### భూమికి భద్రత కరువయ్యింది

**అంబదాస్(55) కొల్వే, నాసిక్**



నాకున్న ఐదెకరాల్లో టమాటో, సోయాబిన్, ఆలు, తదితర పంటలు పండిస్తున్నాను. అదే నా కుటుంబానికి జీవనాధారం. కానీ ఇటీవల ప్రభుత్వం మా భూములను లాక్కుంటోంది. రక్షించాల్సిన ప్రభుత్వమే ఇలా చేస్తే.. నా కుటుంబం భవిష్యత్ అర్థం కావడం లేదు.

### కరెంటు, నీళ్లూ లేవు.. సాగు ఎలా..?

**మందా పవార్(45) పండానా, నాసిక్**



మాకు పదెకారల భూమి ఉంది. అయినా కరెంటు, నీళ్ల సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పెట్టుబడి తెచ్చి పంట పండిద్దామన్నా చేతిలో చిల్లిగవ్వ లేదు. కుటుంబ పోషణ కోసం వ్యవసాయ కూలీలుగా మారాం. ప్రజా రవాణా వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తోన్న సరుకులు సైతం సరిగ్గా రావడం లేదు.

## గుజరాత్ ప్రభుత్వానికి చివరి అవకాశం

### బిల్కిస్ బానో కేసులో పోలీసు అధికారుల పై చర్యలకు సుప్రీం ఆదేశం

**అహ్మదాబాద్:** గోద్రా అల్లర్ల సమయంలో గర్భిణీ బిల్కిస్ బానో పై జరిగిన సామూహిక లైంగిక దాడి కేసులో గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం చివరి అవకాశాన్ని ఇచ్చింది. ఈ కేసుతో ప్రమేయం ఉన్న పోలీసు అధికారుల పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం పై స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని సుప్రీం కోర్టు సోమవారం ఆదేశించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం.. సరైన సమాధానం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వానికి ఆరువారాల గడువు ఇచ్చింది. 2002 మార్చి3న గోద్రా అల్లర్ల సమయంలో గర్భిణీ బిల్కిస్ బానో పై దుండగులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో బాధితురాలి కుటుంబసభ్యులు 14మంది హత్యగావించబడ్డారు. చివరి సారిగా జనవరి నెలలో ఈ కేసును విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. దోషులుగా ఉన్న పోలీసు అధికారుల పై తీసుకున్న చర్యల పై నివేదికను సమర్పించాలని ఆదేశించింది. అలాగే, బాధితురాలి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినందుకు తగిన పరిహారం చెల్లించాలన్న ఓ అభ్యర్థన పై గుజరాత్ ప్రభుత్వ స్పందనను సుప్రీం కోరింది. ఈ కేసుతో ప్రమేయం ఉన్న 11మందిని జీవితఖైదీలుగా, ఏడుగురిని నిర్దోషులుగా ప్రకటిస్తూ ప్రత్యేక న్యాయస్థానం తీసుకున్న నిర్ణయాన్ని బాంబే హైకోర్టు సమర్థించిన విషయం తెలిసిందే.

### ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడి ఘటనలో

## నలుగురు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల అరెస్టు

**తిరువనంతపురం:** కేరళలో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌ఎఫ్‌ఐ) నాయకులపై కత్తులతో దాడి ఘటనలో నలుగురు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఇదే ఘటనలో మరో పది మందిని అరెస్టు చేసే అవకాశం ఉన్నదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. రాష్ట్రంలోని కన్నూర్ జిల్లాలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తున్న నలుగురు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను ఆదివారం తెల్లవారు జామున కొందరు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు అడ్డగించారు.




**వేలాదిగా రైతులు తరలి వచ్చినా..**

# సామాన్యులకు సమస్య కాకుండా..

**ముంబయి :** మహారాష్ట్రలో రైతుల పాదయాత్రలో వేలాది మంది పాల్గొన్నారు. ఆరు రోజుల పాటు 200 కిలోమీటర్ల దూరం యాత్ర సాగింది. కానీ, రైతుల ఆందోళన కారణంగా ఏ ఒక్క వ్యక్తి కూడా ఇబ్బంది పడలేదంటే వారి క్రమశిక్షణ ఏపాటిదో అర్థమవుతున్నది. రోజువారీ విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులకు ఆటంకం కల్గకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నది ఏఐకేఎస్. ప్రధాన రహదారులపై వెళ్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్న ఉద్దేశంతో ఎక్కువ శాతం వీధుల గుండానే పాదయాత్ర సాగించింది. మెయిన్ రోడ్లపైకి వచ్చినప్పుడల్లా వాహనదారులకు ఇక్కట్లు తలెత్తకుండా జాగ్రత్త తీసుకున్నారు. పదుల మంది ఆందోళన చేస్తేనే ట్రాఫిక్ భారీగా నిలిచిపోయే అవకాశమున్న తరుణంలో 50 వేల మంది రైతులు రోడ్డెక్కితే ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకపోవడం పట్ల ఒక్క మహారాష్ట్రనే కాదు.. యావత్తు భారతదేశ ప్రజలను ఆలోచనలో పడేసింది.

### విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకున్న గొప్ప మనస్సు



పాదయాత్ర చేపట్టిన రైతుల్లో ఎక్కువ మంది పెద్దగా చదువుకొని ఉండకపోవచ్చు.. కానీ, తాము చేస్తున్న ఆందోళనలో విద్యార్థులకూ ఇబ్బందులు తలెత్తకూడదని ఆలోచించారంటే వారిని ప్రతి ఒక్కరూ అభినందించి తీరాల్సిందే. మహారాష్ట్రలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ముంబయిలో పగలు యాత్ర చేపడితే..పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడతారేమోనని రాత్రి వేళ నడక సాగించారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రంతా నడిచి సోమవారం తెల్లవారుజామున ముంబయిలోని ఆజాద్ మైదాన్‌కు చేరుకున్నారు. అనంతరం లాంగ్ మార్చ్ కొనసాగిస్తే కొన్ని గంటల్లో అసెంబ్లీకి చేరుకునే వారు. కానీ, విద్యార్థుల భవిష్యత్‌ను పాదయాత్ర నిర్వాహకులు, రైతులు ఆలోచించారు. ఉదయం 11 తర్వాత ర్యాలీ తీస్తే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందీ ఉండదని భావించారు.



### యువకులు, మహిళలు, వృద్ధులన్న తేడా లేదు

పాదయాత్ర అంటేనే ఎక్కువ ప్రయాసతో కూడుకున్నది. అది రెండు




మూడు కిలోమీటర్లు కాదు.. 180 కిలోమీటర్లు.. యాత్రలో యువ రైతులే కాదు.. మహిళలు, వృద్ధ రైతులూ పాల్గొన్నారు. దీన్ని బట్టి రాష్ట్రంలో అన్నదాతల దయనీయ పరిస్థితులు అర్థమవుతున్నాయి. ఎక్కడా వెనుకడుగు వేయకుండా అందరితో పాటు వీరు యాత్ర కొనసాగించారు. పంట చేలల్లో గడపాల్సిన మమ్మల్ని ఫడ్నవీస్ సర్కారు రోడ్లపైకి తెచ్చిందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఎర్రపూల వనాన్ని తలపించిన ఆజాద్ మైదాన్

వేలాదిమంది రైతులతో ముంబయిలోని ఆజాద్ మైదానం ఎర్రపూల వనాన్ని తలపించింది. కార్పొరేట్ మీడియా సంస్థలు రైతుల పాతయాత్ర పట్ల ఉద్దేశపూర్వకంగానే కొంత నిర్లక్ష్యంతో వ్యవహరించగా, నగర ప్రజల నుంచి లభించిన గట్టి మద్దతు, సానుభూతి రాజకీయ పరిశీలకుల్ని సైతం ఆశ్చర్యపరిచింది. రైతుల పాదయాత్రలో కొన్నివేలమంది మాత్రమే పాల్గొంటున్నారంటూ మొదట తప్పుడు ప్రచారం సాగించినవారు కూడా ఆ తర్వాత నాలుక్కరుచుకున్నారు. 50 వేలమందికిపైగా పాదయాత్రలో పాల్గొన్నారంటూ లెక్కలు సరిదిద్దుకున్నారు.



### బొబ్బలెక్కి.. రక్తమోడుతున్నా..

ఎండలో నడిచి నడిచి వాచిపోయిన కాళ్లు.. సరిపోయి.. సరిపోని చెప్పులు(స్లిప్పర్లు).. బొబ్బలెక్కి రక్తమోడుతున్న పాదాలు.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో జీవితంలో పడుతున్న కష్టాల కంటే రైతులకు ఈ గాయాలు చిన్నగానే కనిపించాయి. అసెంబ్లీని దిగ్బంధించి తమ ఆవేదనను తెలియజేయాలన్న సంకల్పమే వారిని ముంబయి వరకూ నడిపించింది. 200 కిలోమీటర్ల దూరం సాగిన పాదయాత్రలో రైతులు పడ్డ ఇబ్బందులు వర్ణణాతీతం. కుటుంబం, పిల్లలను విడిచి బయటి కొచ్చిన వారికి.. కడుపు నిండా తిండి లేదు.. కంటి నిండా కునుకు లేదు. అక్కడో ఇక్కడో స్థానికులు అందించిన ఆహారం, నీళ్లతో సరిపెట్టుకుంటూ యాత్ర సాగించారు కర్షకులు.

### బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతుల బతుకు దుర్భరం

దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే రైతులు ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్నదాతల ఆత్మహత్యలూ ఈ రాష్ట్రాల్లోనే ఎక్కువ. రెండేండ్లుగా దేశంలో అన్నదాతల ఆందోళనలు ఉధృతమయ్యాయి. మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌ఘఢ్, రాజస్థాన్‌లలో రైతుల ఉద్యమాలు జరిగాయి. గుజరాత్, మధ్యప్రదేశ్‌లో రైతులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు తూటాల వర్షం కురిపించి పలువురిని పొట్టన బెట్టుకున్నారు. ఇప్పుడు మహారాష్ట్రలోనూ బీజేపీనే అధికారంలో ఉన్నది. దీన్ని బట్టి రైతుల సంక్షేమంపై బీజేపీకి ఏపాటి శ్రద్ధ ఉన్నదో అర్థమవుతున్నది. ఇటీవల దేశంలో జరిగిన రైతు ఉద్యమాల్లో లాంగ్ మార్చ్ అతి పెద్ద పోరాటం అనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

### అన్నం పెట్టే రైతే అలసి వస్తే..సేద తీర్చిన ముంబయి ప్రజలు

ముంబయి: ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) చేపట్టిన కిసాన్ లాంగ్ మార్చ్(మహా పాదయాత్ర)కి ముంబయి నగర ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభించింది. 180 కి.మీ. సుదీర్ఘ పాదయాత్ర అనంతరం ముంబయి చేరుకున్న



రైతులకు పలు వర్గాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. మండుటెండల్లో నడుస్తూ ఆదివారం ముంబయికి చేరుకున్న రైతులకు మంచి నీటి ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, పలు రకాల ఆహార పదార్థాలతో డబ్బావాలాలుసహా పలు వర్గాల ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. రైతుల ఆకలిదప్పులు తీర్చి ముంబయి ప్రజలు తమ హృదయపూర్వక మమకారాన్ని చాటుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు కూడా రైతులకు ఆహార పొట్లాలు, మంచినీళ్ల బాటిళ్లు అందించారు. నగరంలోకి ప్రవేశించిన రైతులకు మహిళలు, చిన్నారులు తమకు తోచిన సాయం చేసి అన్నదాతల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

### రెండు దశాబ్దాల్లో 4 లక్షలమంది రైతుల ఉసురుతీసిన పాలకుల విధానాలు

1991 నుంచి మొదలైన ఉదార ఆర్థిక విధానాలతో కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా రైతుల పట్ల నిర్లక్ష్యంగానే నిర్ణయాలు తీసుకున్నాయన్నది తెలిసిందే. రెండు దశాబ్దాల కాలంలో సుమారు నాలుగు లక్షలకుపైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆత్మహత్యలు ఎక్కువగా మహారాష్ట్రలోనే జరగడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే అక్కడి రైతులు వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టారు.

'మనం తినే ప్రతి ఆహారపు ముద్ద వెనకా రైతులు చిందించిన స్వేదం ఉంది. పాలకవర్గాల ఉదాసీనత వల్ల 4 లక్షలమంది రైతులు తమ జీవితాల్ని చాలించారు. పాలకుల చేతులు రైతుల రక్తంతో తడిచాయి. తమ హక్కుల సాధన కోసం ఉద్యమ బాట పట్టిన రైతులకు సంపూర్ణ సంఘీభావాన్ని అందిద్దాం'

– ఆల్ ఇండియా కిసాన్ సభ

# కార్పొరేట్ సేవల్లో చాలా ముందున్న బీజేపీ

**మహారాష్ట్రలో నాసిక్ నుంచి ముంబై వరకూ వేలాది రైతుల లాంగ్‌మార్చ్ నేపథ్యంలో.. దేశంలో రైతాంగం పరిస్థితులు, వ్యవసాయ సంక్షోభం తీరుతెన్నులపై సీనియర్ పాత్రికేయుడు పి.సాయినాథ్‌ను బీబీసీ ఇంటర్వ్యూ చేసింది. వ్యవసాయ రంగంపై పలు ప్రశ్నలకు సాయినాథ్ సమాధానాలివీ...**



**మహారాష్ట్రలో వేలాది మంది రైతులు తమ డిమాండ్ల సాధన కోసం నాసిక్ నుంచి ముంబై వరకూ సుదీర్ఘ పాదయాత్ర చేపట్టారు. ఈ ఆందోళన గురించి మీరేమంటారు?**

ఈ సుదీర్ఘ పాదయాత్ర చేపట్టిన రైతులను చూడండి. ఆ రైతులు ఎంత కష్టపడుతున్నారో చూడండి. అటవీ భూమి హక్కుల కోసం పోరాడుతున్న ఆదివాసీలకు ఇది ఎంత కష్టమో చూడండి. అరవై డెబ్బై ఏండ్ల వయసులోని నిరుపేద మహిళలు ఇంతటి ఎండలో నాసిక్ నుంచి ముంబై వరకూ నడవటం ఎంత కష్టమో ఆలోచించండి.

మొదట వాళ్లు 20,000 మంది ఉన్నారు. ఈ రోజు 50,000 మంది దాటిపోయారు.

ప్రభుత్వం వారి గోడు వినాలని నేనంటాను. గ్రామీణ సంక్షోభం గురించి వారు మనకు చెప్తున్నారు. మనం వారి గొంతు వినాలి.

**వీరి ప్రధాన డిమాండ్లలో రుణ మాఫీ ఒకటి. రుణ మాఫీ పథకం రైతులకు నిజంగా ప్రయోజనం కలిగించలేదని మీరు భావిస్తున్నారా?**

రుణ మాఫీ పథకాన్ని ఎన్నడూ సరిగ్గా పనిచేసేలా మహారాష్ట్ర ప్రభుత్వం రూపొందించలేదు. అమలు గురించిన ప్రశ్న కాదు. పథకం రూపకల్పనలోనే లోపాలున్నాయి. రుణ మాఫీకి సంబంధించి రెండో విషయం.. అప్పుల్లో అధిక భాగం ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్నవే. కేవలం బ్యాంకు రుణాలకు మాత్రమే ఉద్దేశించిన రుణ మాఫీ ఈ ప్రయివేటు అప్పులకు వర్తించదు. గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థ అంతకంతకూ సమస్యాత్మకంగా మారుతోంది. మరోవైపు రుణం పొందటం మరింత కష్టమవుతోంది. 'వ్యవసాయ రుణాన్ని నేను రెట్టింపు చేశాను.. మూడు రెట్లు పెంచాను' అని ప్రణబ్‌ముఖర్జీ నుంచి చిదంబరం, అరుణ్‌జైట్లీ వరకూ ప్రతి ఆర్థికమంత్రీ చెప్పుకుంటారు. అది నిజం. కానీ అది వ్యవసాయదారులకు చేరటం లేదు. అది వ్యవసాయ వాణిజ్యానికి వెళుతోంది.

2017 సంవత్సరానికి నాబార్డు మహారాష్ట్ర లింక్ క్రెడిట్ ప్రణాళికలో 53శాతం రుణం ముంబయి, దాని పరిసరాల్లోని పట్టణ ప్రాంతాలకు కేటాయించారు. ముంబయిలో వ్యవసాయదారులెవరూ లేరు.. కానీ వ్యవసాయ వ్యాపారాలున్నాయి. అంటే వ్యవసాయ రుణాల్లో సింహభాగం వ్యవసాయానికి అందటం లేదు. దీనివల్ల చిన్న రైతులు రుణం పొందటం అంతకంతకూ కష్టమవుతోంటే వారు ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు.

నీరవ్ మోడీ, విజయ్ మాల్యా వంటి వారు భారీ మొత్తాల్లో రుణాలు పొందుతారు. కానీ ఒక రైతు రూ. 50 వేల రుణమైనా సులువుగా పొందలేడు. ఈ రుణ మాఫీల ద్వారా మనం నీటి కుళాయిని కట్టేయకుండా నేల మీద తడిని తుడుస్తున్నామన్నమాట. అందుకే అది పనిచేయటం లేదు.

**కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని ప్రకటించింది. అయినా ఎంఎస్‌పీ విధానాన్ని సక్రమంగా అమలుచేయాలన్న డిమాండ్ ఇంకా ఉంది. తాజా పాలసీ రైతులకు మేలు చేయటం లేదా?**

కనీస మద్దతు ధర అనేది స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసు. ఉత్పత్తి వ్యయాన్ని నిర్ణయించటానికి మూడు పద్ధతులున్నాయి.

ఎంఎస్‌పీని నిర్ణయించేటపుడు.. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారకాల వ్యయంతోపాటు కుటుంబసభ్యుల శ్రమనూ, ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసింది. కానీ కేవలం విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ఖరీదు మాత్రమే ఉండే విధానాన్ని మాత్రమే ఎంఎస్‌పీ నిర్ణయానికి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఇది కేవలం కంటితుడుపు మాత్రమే. రైతులకు మేలు చేసేది కాదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆ ఆదాయం పెరుగుదల నామమాత్రంగా ఉంటుందా వాస్తవికంగా ఉంటుందా అనేది విస్పష్టంగా చెప్పలేదు. ప్రభుత్వం కేవలం ప్రజలను మభ్యపెట్టే మాటలు మాత్రమే చెప్తోంది. ఈ పాదయాత్ర చేస్తున్న రైతులు కూడా మోసపోబోతున్నారు.

**2014 తర్వాత వ్యవసాయ సంక్షోభం పెరిగిందని మీరు అనుకుంటున్నారా?**

వ్యవసాయ సంక్షోభం 2014 తర్వాత పెరిగింది నిజమే. కానీ ఇది 2014లోనే మొదలుకాలేదు. ఇది నూతన సరళీకరణ విధానాలను అమలుచేయటం మొదలైనప్పటి నుంచి 20 ఏండ్లుగా పెరుగుతూ వచ్చిన సంక్షోభం. అయితే 2014 నుంచి ఈ పరిస్థితి మరింతగా దిగజారిందని చెప్పొచ్చు. ఇటువంటి విషమ పరిస్థితి 2004కు ముందు ఉంది. అది 2004 ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పుడు మళ్లీ అదే జరగబోతోందని నేను అనటం లేదు. గత 20 ఏండ్లలో వ్యవసాయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరిన ఉదంతాలున్నాయి. కానీ 2014 నుంచీ అది మరింత విషమించిందనేది నిజం. వ్యవసాయం గురించి ఏమాత్రం తెలియని పార్టీ బీజేపీ.

విషయమేమిటంటే.. అది రైతులకు వ్యతిరేకంగా పనిచేయటం మాత్రమే కాదు.. నిజానికి వారు చేస్తున్నది.. ఒక దాని తర్వాత ఒకటి వచ్చిన ప్రభుత్వాలు చేస్తున్నదీ.. నేడు రాజ్యాన్ని నడిపిస్తున్న కార్పొరేట్ రంగం లక్ష్యాన్ని పూర్తిచేయటమే. ఆ మాట కొస్తే కార్పొరేట్ రంగానికి ఉత్తమ సేవలందించగలిగేది ఎవరు? అందులో బీజేపీ చాలా ముందుంది.

**రైతుల ఈ ఆగ్రహం 2019 ఎన్నికల్లో ప్రతిఫలిస్తుందా?**

రైతుల ఆగ్రహం భవిష్యత్తులో ఎన్నికల ఫలితాల మీద ప్రభావం చూపుతుందని మీరు అనుకుంటున్నారా? ఎన్నికలనేవి మరింత సంక్లిష్టమైన అంశం. మహారాష్ట్రలో గత 20 ఏండ్లలో సుమారు 65,000 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అది పోగుపడిన సంక్షోభం. దేశంలోని అత్యధిక రైతులు సంఘటితంగా లేరు. మహారాష్ట్రలో కొన్ని రైతు సంఘాలు ఉన్నాయి. కానీ దేశంలోని ఇతర అనేక ప్రాంతాల్లో బలమైన సంఘాలు లేవు. 2004లో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ సంక్షోభం ఫలితంగా చంద్రబాబునాయుడు ఓడిపోయారు. కీలక పాత్ర పోషించే ఇతర అంశాలు చాలా ఉన్నాయి. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ మతతత్వం వైపు మళ్లించటానికి బలమైన ప్రయత్నం జరగబోతోంది. ప్రత్యేకించి.. రాబోయే కొన్ని నెలల్లో కర్ణాటకలో మతప్రాతిపదికన భారీ సమస్య తలెత్తవచ్చు.

గుజరాత్ శాసనసభ ఎన్నికల ఫలితాల వెంటనే భీమా కోరెగావ్ ఘటనను మనం చూశాం. దానికి చాలా స్పష్టమైన లింకు ఉందనేది నా అభిప్రాయం. ఆ ఫలితాల తర్వాత భీమా కోరెగావ్ ఘటన, రాజస్థాన్‌లో హత్య, ఇతర దారుణ ఘటనలు జరిగాయి. గుజరాత్ ఎన్నికల్లో విభజన సామాజిక-ఆర్థిక విభజన నుంచి సామాజిక-మతతత్వ విభజనకు మారింది. పరిస్థితులు మరింత దిగజారనున్నాయి. ఎన్నికల్లో ఇతర అంశాలు చాలా ఉంటాయి. ప్రతిపక్షం ఏకమవుతుందా లేదా అన్న దానిమీద కూడా ఎన్నికల ఫలితం ఆధారపడి ఉంటుంది.

**ఆత్మహత్యలు ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయి?**

జాతీయ బ్యాంకుల రుణ వ్యవస్థను వరుస ప్రభుత్వాలు ధ్వంసం చేశాయి. బ్యాంకులు తమ రుణాలను రైతుల నుంచి మధ్య తరగతికి, ఎగువ మధ్యతరగతికి, నీరవ్ మోడీ వంటి వారికి మళ్లించాయి. నిజానికి గత 20 ఏండ్లలో భారతదేశంలో వ్యవసాయ కుటుంబాలు రెట్టింపయ్యాయి. అంటే వ్యవసాయ రుణాలను పెంచాలి. కానీ ప్రభుత్వం ఆ నిధులను సమాజంలోని ధనిక వర్గాలకు ప్రత్యేకించి కార్పొరేట్ రంగానికి మళ్లించింది.

వ్యవసాయాన్ని కార్పొరేట్లు స్వాధీనం చేసుకోవటానికి ప్రభుత్వాలు సాయం చేశాయి. నేడు.. వ్యవసాయంలో కీలకమైన పెట్టుబడి సాధనాలను కార్పొరేట్‌రంగం నియంత్రిస్తోంది. బ్యాంకులు తమ రుణాలను రైతులకు బదులుగా కార్పొరేట్ రంగానికి మళ్లిస్తున్నాయి. కార్పొరేట్‌రంగం లక్ష్యాలను నెరవేర్చటానికి ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి. ఈ దేశ ఆర్థిక విధానంలో ఇదే ప్రాథమిక సమస్య.

**ఈ సంక్షోభానికి పరిష్కారం ఏమిటి?**

జాతీయ రైతు కమిషన్ అంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలి. వ్యవసాయ సంక్షోభం మీదే పూర్తిగా చర్చించటానికి ప్రత్యేకంగా పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలని నేను డిమాండ్ చేస్తున్నాను. మూడు రోజుల పాటు స్వామి నాథన్ కమిషన్ మీద చర్చించండి. మూడు రోజులు రుణం విషయం మీద చర్చించండి. మూడు రోజులు దేశంలో నీటి సంక్షోభం మీద చర్చించండి. మరో మూడు రోజులు.. వ్యవసాయ సంక్షోభం బాధితులను తీసుకువచ్చి పార్లమెంటులో వారిచేత మాట్లాడించండి. వ్యవసాయ కూలీల గళం విందాం.. ఢిల్లీలోని మేధో బృందాల మాటలు కాదు. అందుకోసం కోటి మంది రైతులు పార్లమెంటుకు పాదయాత్ర చేయాలి. వారంతా పార్లమెంటు దగ్గరే ఉండాలి.

# దోపిడీ అరికడితేనే రైతులకు ప్రయోజనం

- బీసీలకు ఎన్ని సీట్లిస్తారో చెప్పాలి
- కేసీఆర్, చంద్రబాబులకు : స్థిరత్వం లేదు
- బీఎల్ఎఫ్‌తోనే బీసీలకు రాజ్యసభ టికెట్లు: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని

**నవతెలంగాణ-వరంగల్**

మార్కెట్‌లో దోపిడీని అరికడితేనే రైతుకు ప్రయోజనం చేకూరుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం హన్మకొండలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఎల్ఎఫ్ 119 స్థానాల్లో పోటీ చేయనుందని చెప్పారు. సామాజిక న్యాయం గురించి ఇప్పుడు మాట్లాడుతున్న టీఆర్ఎస్, కాంగ్రెస్‌లు వచ్చే ఎన్నికల్లో సగం సీట్లు బీసీలకు ఇస్తారో లేదో స్పష్టం చేయాలన్నారు. సేద్యం కోసం ఎకరాకు రూ.4వేలు ఇవ్వడం, రుణమాఫీ చేయడం లాంటివి చిల్లు కుండలో నీళ్లు పోయడం లాంటివేనన్నారు. వరంగల్ మార్కెట్‌లో రైతు నుంచి మిర్చి క్వింటాల్ రూ.1500కు కొనుగోలు చేశారని, రైతుల చేయి దాటిన అనంతరం రూ.10 వేల ధర పలికిందని ఆవేదన వ్యక్తం చేశారు. బడా ప్రాజెక్టులతో కాంట్రాక్టర్లకే అధికంగా లాభం జరుగుతుందన్నారు. చిన్ననీటి వనరులే తెలంగాణకు అవసరమన్నారు. మద్యంపై నిషేధం విధించాలని, మద్యానికి బానిసలై జనం ప్రాణం కోల్పోతున్నారని అన్నారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఆవిర్భావం, మహాజన పాదయాత్ర నేపథ్యంలోనే టీఆర్ఎస్ పార్టీ బీసీలకు రాజ్యసభ టికెట్లు ఇచ్చిందన్నారు. అసలు కుర్చీని తన దగ్గరే పెట్టుకొని సీట్లు ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదన్నారు. గొర్రెలు, మేకలు, గేదెలు సబ్సిడీపై ఇవ్వడం కాదని సామాజిక న్యాయం కావాలన్నారు. బీసీలకు, ఎస్సీలకు అధికారం ఇవ్వాలన్నారు. బహుజన తెలంగాణను నిర్మించడమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిర్బంధం తీవ్రమవుతోందన్నారు. టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్‌ను అరెస్టు చేశారని, అంతకుముందు మంద కృష్ణమాదిగను అరెస్టు చేశారని గుర్తు చేశారు. టీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని, ప్రజలు ప్రత్యామ్నాయం వైపు ఆలోచించాలని కోరారు. కేసీఆర్, చంద్రబాబులకు స్థిరత్వమే కాదు, విధానం కూడా లేదని విమర్శించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, జి.రాములు, పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

# కోదండరామ్ సామాన్యుడు కాదు

- టీజేఏసీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ వ్యాఖ్య




**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

కోదండరామ్‌కు పార్టీ పెట్టడం ఇష్టం లేకున్నా, తాజా పరిస్థితులు పార్టీ పెట్టేలా చేశాయని మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ ఆధ్వర్యంలో ఆయన టీజేఏసీలో చేరారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీజేఏసీకి మావంతు సహకారం అందించడానికే కోదండరామ్ పార్టీలో చేరుతున్నామన్నారు. నాతో పాటు మరికొంతమందీ ఆయన వెంట నడుస్తామని తెలిపారు. నాతోపాటు మహ్మద్ రియాజ్ కూడా జాయిన్ అవుతున్నాడని గుర్తు చేశారు. ఇదో ప్రభంజనమని, ఇక నుంచి రోజు రోజుకు కోదండరామ్ పార్టీలో చేరే వారి సంఖ్య పెరుగుతుందని చెప్పారు. ఆయన సామాన్యుడు కాదని, కోదండరామ్ తలచుకుంటే కేసీఆర్ కనపడడని అన్నారు. సామాజిక తెలంగాణ కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని భావించామని కోదండరామ్ అన్నారు. కాని దానికి విరుద్ధంగా పనిచేస్తున్నదని చెప్పారు. సచివాలయానికి రాని ఏకైక సీఎం కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. భవిష్యత్‌లో ఇంటింటికి నీళ్ల పథకానికి డబ్బులు వసూలు చేస్తారని, రెండు, మూడు రోజుల్లో ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతామని, కొద్దిరోజుల్లో పార్టీ పేరుపై స్పష్టత వస్తుందని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించిన వాళ్లకు ఇప్పుడు సర్కారులో ప్రాధాన్యత లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కలిసి పనిచేయడానికి, సామాజిక తెలంగాణ సాధించడానికి ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం నేడు ధర్నా

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



**నవతెలంగాణ - ఉస్మానియా యూనివర్సిటీ**


పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చెప్పారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్‌హౌజ్‌లో మాదిగ విద్యార్థి సమాఖ్య నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈనెల 13న తలపెట్టిన బంద్‌ను రద్దు చేసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలాగా తాము మొండివైఖరితో పోలమేని చెప్పారు. రవాణా, విద్యార్థుల చదువులు, పరీక్షలకు ఎలాంటి ఆటంకమూ కలగకుండా 13న అంబేద్కర్ విగ్రహాల ఎదుట ధర్నా చేపట్టాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. రాజ్యసభ సీట్ల కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ, అసెంబ్లీ సీట్లల్లో రిజర్వేషన్లు ఉండటం వల్లే ఎస్సీ, ఎస్టీలు చట్టసభలకు వెళ్లగలుగుతున్నారని అన్నారు. రాజ్యసభ సీట్లల్లో రిజర్వేషన్ లేని కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్కరు కూడా ఎస్సీ, ఎస్టీలు లేరన్నారు. తెలంగాణలో యాదవ్, ముదిరాజ్‌లకు రాజ్యసభ సీట్లు ఇవ్వడాన్ని తాను స్వాగతిస్తున్నానని అన్నారు. ఈ సమావేశంలో మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ ఓయూ ఇన్‌చార్జి పల్లెర్ల సుధాకర్ పాల్గొన్నారు.

# ఆర్జేడీ సంతకం ఫోర్జరీ!

- 12 పాఠశాలలకు నకిలీ గుర్తింపుపత్రాలు
- పరీక్షల విభాగం ఫిర్యాదులో వెలుగులోకి..
- పాఠశాల విద్యాశాఖ మరో అక్రమ బాగోతం

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

హౌస్ బిల్డింగ్ అడ్వాన్స్‌ల అక్రమాలు బయటికొచ్చిన మరుసటిరోజు మరో అవినీతి భాగోతం పాఠశాల విద్యాశాఖలో వెలుగుచూసింది. గుర్తింపు లేని పాఠశాలలకు ఏకంగా ఉన్నతాధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి మరీ అక్రమ గుర్తింపు ఇప్పించిన ఘటన హైదరాబాద్ విద్యాశాఖ కార్యాలయంలో వెలుగుచూసింది. దీంతో 12 పాఠశాలలు గుర్తింపు లేకుండానే పదో తరగతి పరీక్షలకు ఆయా పాఠశాలల విద్యార్థులు హాజరవుతున్నారు. అయితే ఫోర్జరీ సంతకాలు ఎవరు చేశారనే దానిపై విద్యాశాఖాధికారులు దృష్టిసారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2017-18 విద్యాసంవత్సరానికి గానూ హైదరాబాద్ జిల్లాలోని 17 పాఠశాలలు కొత్తగా గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. పదో తరగతి వార్షిక పరీక్షల నామినల్ రూల్స్ పంపించేటప్పుడు తప్పనిసరిగా తాత్కాలిక గుర్తింపు పొడిగింపు పత్రం(ఈటీఆర్) జతచేయాల్సి ఉంటుంది. ఇవి ఉంటేనే పరీక్షల విభాగం నుంచి వారికి ప్రత్యేక నెంబర్లు వస్తాయి. హైదరాబాద్ డీఈఓ ఆఫీస్ నుంచి ఆయా పాఠశాలలకు గుర్తింపు లభించినట్టు పరీక్షల విభాగానికి లేఖ రాశారు. దీంతో వారు 17 స్కూళ్లకు ప్రత్యేకంగా స్కూల్ కోడ్‌ను అందించారు. వాటి ఆధారంగా ఆయా పాఠశాలల్లోని విద్యార్థులను పదో తరగతి పరీక్షల ఫీజులు చెల్లించారు. హాల్‌టికెట్లు కూడా అందాయి. అయితే ఈ పాఠశాలలపై అనుమానం వచ్చిన పరీక్షల విభాగం అధికారులు విచారణ చేయాల్సిందిగా హైదరాబాద్ ఆర్‌జేడీని కోరారు. అధికారుల విచారణలో 12 స్కూళ్లకు ఇచ్చిన ఈటీఆర్‌లు బోగస్ అని తేలింది.



**ఆర్‌జేడీ సంతకాలు ఫోర్జరీ చేసి...**

నగరంలోని 12 స్కూళ్ల ఈటీఆర్‌లపై ఆర్‌జేడీ సంతకాలు ఫోర్జరీ చేసినట్టు అధికారులు గుర్తించారు. వీటిని ఎవరు చేశారనే దానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఆరు మండలాలకు చెందిన 12 స్కూళ్లు ఉండగా, వీటిలో అత్యధికంగా ఆరు స్కూళ్లు బండ్లగూడ మండలానికి చెందినవే కావడం గమనార్హం. ఇప్పటికే హిమాయత్‌నగర్ మండలంలోని సెంట్ అగస్టన్, క్రిస్టచర్చ్ హైస్కూల్స్ కూడా బోగస్ పత్రాలు సమర్పించిన ఘటనలో అధికారులు ఆయా పాఠశాలలపై క్రిమినల్ కేసులు పెట్టారు. దీనికి కారణమైన హిమాయత్‌నగర్ జూనియర్ అసిస్టెంట్ మాజిద్‌ఖాన్‌ను సస్పెండ్ చేశారు. తాజాగా 12 స్కూళ్ల ఈటీఆర్‌లపై ఏకంగా ఆర్‌జేడీ సంతకాలు ఫోర్జడీ కావడం విద్యాశాఖలో కలకలం రేగుతోంది. ఈ తంతులో డీఈఓ ఆఫీస్‌లోని నలుగురు సిబ్బంది పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది.ఫోర్జరీ చేసి గుర్తింపు పొందిన బడుల్లో గోల్కొండ మండలంలోని విద్యార్థి హైస్కూల్, బహదూర్‌పురాకు చెందిన ఇండియన్‌స్టార్స్ గ్రామర్ స్కూల్, బండ్లగూడకు చెందిన షా రెడియంట్ హైస్కూల్, ఇస్లామిక్ మిషన్‌కు చెందిన ఆరు స్కూళ్లు, చార్మినార్‌కు చెందిన ఎలైట్ స్కూల్, సైదాబాద్‌కు చెందిన మార్నింగ్ స్టార్ స్కూల్, ఆసిఫ్‌నగర్‌కు చెందిన మోయిజ్‌స్కూల్ ఉన్నది. అయితే దీనిపై సమగ్ర విచారణ చేయిస్తున్నట్టు ఆర్‌జేడీ విజయలక్ష్మిబాయి తెలిపగా, ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులను పరీక్షలకు అనుమతిస్తున్నట్టు పరీక్షల విభాగం అధికారి ఒకరు తెలిపారు.

# హదియాకు స్వేచ్ఛ

సంపాదకీయం

పాతికేండ్ల కేరళ యువతి హదియా వివాహానికి సంబంధించి సుప్రీం కోర్టు నాలుగు రోజుల క్రితం వెలువరించిన తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛకు పట్టం గట్టింది. హదియా తన ఇష్టప్రకారమే షఫీన్ జెహన్ అనే ముస్లిం యువకుణ్ణి పెండ్లి చేసుకుంటే దానిని అడ్డుకునే హక్కు ఏ న్యాయస్థానానికి లేదని సుప్రీం స్పష్టం చేయడం మంచి విషయం. హదియా తాను ఇష్టపడి జెహన్‌ను పెండ్లి చేసుకున్నానని పదే పదే చెప్పినా వినకుండా, ఆమె ఎవరో నడిపిస్తే నడుస్తున్నారని పోలీసులు, దర్యాప్తు సంస్థలు కట్టుకథలల్లితే వాటినే సత్యంగా భావించి కేరళ హైకోర్టు గత ఏడాది మే నెలలో ఇచ్చిన తీర్పును సుప్రీం నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. హదియాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దింది. న్యాయం కోసం గత పది మాసాలుగా ఆ కోర్టు నుంచి ఈ కోర్టుకు తిరుగుతూ హదియా అనుభవించిన మానసిక క్షోభ భారతదేశంలో మరే మహిళకు పట్టకూడని విధంగా సుప్రీం చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన వ్యక్తి స్వేచ్ఛకు ఈ తీర్పు పట్టం గట్టడమే కాదు, హదియా వివాహంపై నానా యాగీ చేస్తున్న కాషాయ మూకలకు ఇదొక చెంపపెట్టు. కొత్త దంపతులను విడదీసి పైశాచికానందం పొందే పరివార్ మూకలు ఈ తీర్పు తరువాత కూడా బుసలు కొడుతున్నాయి. అందులో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, ప్రజాతంత్రయుతంగా పనిచేయాల్సిన దర్యాప్తు సంస్థలు హదియా స్వేచ్ఛను హరించాలని చూడడమే బాధాకరం. ఆరెస్సెస్, బీజేపీ ఎజెండాకు అనుగుణంగా దర్యాప్తు సంస్థలు వ్యవహరించడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. వీరి దన్ను చూసుకునే మనువాదులు పెట్రేగేపోతున్నారు. ప్రేమబంధానికి ఉగ్రవాద ముద్రను అంటగట్టి ఆ నవ దంపతులను వేధిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కలచి వేస్తోంది. హదియా ఎవరి అదుపులోనూ ఉండనవసరం లేదనీ, తనకు నచ్చిన వ్యక్తితో జీవించవచ్చునని తీర్పు సుప్రీం స్పష్టం చేసిన తరువాత కూడా ఆమె భర్తకు ఉగ్రవాదంతో సంబంధముందన్న కోణంలో దర్యాప్తు సంస్థలు వెంటాడుతున్నాయి. జెహానాకు ఉగ్రవాదంతో సంబంధాలున్నట్టు ఆధారాలుంటే అరెస్టు చేయవచ్చు. కానీ, ఇన్ని నెలలైనా ఒక్క ఆధారం సేకరించకుండా ఇంకా దర్యాప్తు కొనసాగింపు పేరుతో వెంటాడడంలో ఔచిత్యమేమిటి? దర్యాప్తు సంస్థలను ఆ దిశగా నడిపిస్తున్నదెవరో తెలుస్తూనే వుంది. దర్యాప్తు సంస్థల పరిస్థితి పంజరంలో బందీ అయిన చిలుకల్లా తయారైందని సుప్రీం ఎన్నడో చెప్పింది.



కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ చేతిలో పావులుగా ఇవి వ్యవహరిస్తున్నంతకాలం ఇవి ప్రజల విశ్వాసాన్ని చూరగొనలేవు.


హదియా కేసులో కేరళ హైకోర్టు వెలువరించిన తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం మొదటి నుంచి ఆగ్రహంతో వున్నది. యుక్తవయస్కురాలైన ఒక మహిళ వివాహాన్ని రద్దుచేసే విషయంలో మీకున్న అధికారాలు ఏమిటో చూసుకున్నారా? అని గతంలోనే నిలదీసింది. ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా చేసుకున్న పెండ్లిని న్యాయస్థానాలు రద్దుచేయగలవా? వారి నిర్ణయంలో జోక్యం చేసుకొనే అధికారం వాటికి ఎక్కడిది?' అని సుప్రీం ధర్మాసనం సూటిగా నిలదీసింది. ఆమె తనకు తగిన వ్యక్తిని ఎంచుకున్నదా లేదా, ఈ వివాహం ఆమె ప్రయోజనాలను కాపాడుతుందా లేదా అన్న విషయాలను కూడా న్యాయస్థానాలు నిర్ధారించలేని, నిర్ధారించకూడని అంశాలని తిరుగులేని రూలింగ్ ఇచ్చింది.

పాతికేండ్ల వయసున్న తాను మనసా వాచా ఇష్టపూర్వకంగానే షఫీన్ జహాన్‌ను వివాహం చేసుకున్నానని, తనకు నచ్చినమేరకే అతని మతాన్ని స్వీకరించాననీ, సునిశితంగా ఇస్లాంను అధ్యయనం చేసిన తర్వాతే తాను మతం మార్చుకున్నానని, ఈ ప్రక్రియ మొత్తంలో ఎక్కడా ఎవ్వరి ఒత్తిడీ తనపై లేదని నవంబరులో సుప్రీంకోర్టు ముందు హదియా వెళ్లబోసుకున్న గోడును చూసి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు చలించిపోయారు. హదియా మొత్తంలో అతిపెద్ద చిక్కుగా భావించేది ఆమె భర్తకు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే అంశం. నేరపూరితమైన ఈ కోణంలో సాగాల్సిన దర్యాప్తు హదియా వ్యక్తిగత స్వేచ్ఛ, స్వతంత్రతలకు భంగం కలిగించడం, ఆమెను ఇబ్బందులకు గురిచేయడం ఎంతమాత్రం అనుమతించరానిది. హిందూత్వ శక్తులు ప్రత్యేకంగా దృష్టి నిలిపిన ఒక్క కేరళలోనే హదియా లాంటి 89 జంటల కేసులను 'లవ్ జిహాదీ' కేసులుగా జాతీయ దర్యాప్తు సంస్థ వెంటాడివెంటాడి వేధింపులకు గురి చేస్తోందంటే దేశంలో ఎంతటి ప్రమాదకర పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు.

మతతత్వ శక్తుల ఒత్తిళ్లకు తలొగ్గిన సొంత కుటుంబ సభ్యులే స్వచ్ఛమైన తమ ప్రేమకు ఉగ్రవాద కోణాలను అంటగట్టి ఛీకొట్టినా, న్యాయస్థానాల్లో కేసులు, దర్యాప్తు సంస్థల విచారణలు ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా నిత్య మానసిక సంఘర్షణలోనూ అలుపెరగక సంయమనంతో హదియా, ఆమె భర్త షఫీన్ సగౌరవంగా సర్వోన్నత న్యాయస్థానంలో విజయం సాధించిన తీరు, వారి మొక్కవొని పోరాట స్ఫూర్తి ఎంతైనా ప్రశంసనీయం. వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో కుటుంబాన్ని ధిక్కరించవచ్చా? అని పితృస్వామ్యవాదులు కొందరు లేవనెత్తిన ప్రశ్నకు వ్యక్తిగత స్వేచ్ఛే ముఖ్యమని సుప్రీం కోర్టు తిరుగులేని రీతిలో సమాధానమిచ్చింది. అందుకే ఈ తీర్పుఅనేక విధాలుగా ప్రాధాన్యత సంతరించుకుంది.

> **హదియా, ఆమె భర్త షఫీన్ సగౌరవంగా సర్వోన్నత న్యాయస్థానంలో విజయం సాధించిన తీరు, వారి మొక్కవొని పోరాట స్ఫూర్తి ఎంతైనా ప్రశంసనీయం. వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో కుటుంబాన్ని ధిక్కరించవచ్చా? అని పితృస్వామ్యవాదులు కొందరు లేవనెత్తిన ప్రశ్నకు వ్యక్తిగత స్వేచ్ఛే ముఖ్యమని సుప్రీం కోర్టు తిరుగులేని రీతిలో సమాధానమిచ్చింది.**

# నీరవ్ మోడీ కుంభకోణం మూలాలు



**ప్రభాత్ పట్నాయక్**

ప్రజల డబ్బును దోచుకుని, దేశం నుంచి పారిపోయిన 'నూతన భారతదేశ పారిశ్రామికవేత్తల' పట్టికలో నీరవ్ మోడీ, అతని మామ మెహుల్ ఛోక్సీ తాజాగా చేరారు. దేశంలో రెండవ అతిపెద్ద బ్యాంకైన పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎటువంటి తనఖా లేకుండా వీరికి అప్పులిస్తూ పోయింది. సంక్లిష్ట ప్రక్రియగల 'లెటర్స్ ఆఫ్ టేకింగ్' చేసిన పనిఇదే. సడీచప్పుడు లేకుండా నీరవ్ మోడీ దేశం వదలిపోయాడు. ఆ తరువాత అతని మేనమామ అతన్ని అనుసరించాడు.

ఇలా ఉడాయించిన 'పారిశ్రామికవేత్తల' జాబితాలో లలిత్ మోడీ, విజయ్ మాల్యాలు ఉన్నారు. అనేక లక్షణాలు కామన్‌గా వీరందరిలోనూ కనపడతాయి. మొదటిది, వీరందరూ 'ప్రసిద్ధ వ్యక్తులు(సెలబ్రిటీలు)'. ఐపీఎల్ క్రికెట్ పోటీలు జరుగుతున్న రోజుల్లో ప్రముఖ రాజకీయ, బాలీవుడ్ నటీనటులతోపాటు లలిత్ మోడీ ఏండ్ల తరబడి లక్షలాది గృహాల టీవీ తెరలపై కనిపించాడు. ఆయన ఐపీఎల్ క్రికెట్

> **నయా వుదారవాద ప్రవేశంతో ఈ అదుపు తప్పింది. స్వంతంగా లాభం పొందాలనే కాంక్ష సాధారణీకరిం పబడింది. ఇది సంస్థాగత వైఫల్యాలలో ప్రతిబింబిస్తున్నది. కాబట్టి నీరవ్ మోడీ ఉదంతాన్ని 'నిజమైన పెట్టుబడిదారీ వ్యవస్థ'ను 'ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ' స్థానభ్రంశం చేయటంగా చూడరాదు. దీని ద్వారా 'నిజమైన పెట్టుబడిదారీ వ్యవస్థ' తనకుతానుగా మౌలికంగా పనికిమాలినదని బహిరంగంగా ప్రకటించటంగా మనం అర్థం చేసుకోవాలి.**

'సృష్టికర్త'గా ఖ్యాతిగడించాడు. విజయ్ మాల్యా అట్టహాసంగా పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఐపీఎల్ క్రికెట్ పోటీలు జరుగుతున్న కాలంలో తన 'రాయల్ చాలెంజెస్, బెంగుళూరు' జట్టుతోపాటు మాల్యా నిత్యం టీవీల్లో కనపడేవాడు. హాలీవుడ్, బాలీవుడ్ నటీమణుల కంఠమాలలను అలంకరించటానికి వజ్రాలను అందజేసిన నీరవ్ మోడీ దేశంలోనే అత్యున్నత 'పారిశ్రామికవేత్తల' కుటుంబంగా పేరొందిన అంబానీల బంధువు.

రెండవది, వీరందరికీ కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న పాలక పార్టీతో చాలా దగ్గరి సంబంధాలున్నాయి. దేశం నుంచి పారిపోయిన తరువాత కూడా లలిత్ మోడీ సుష్మా స్వరాజ్‌తోనూ, వసుంధరా రాజేతోనూ తన సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. బీజేపీకున్న మిగులు ఓట్లతో విజయ్ మాల్యా రాజ్యసభకు ఎన్నికయ్యాడు. మెహుల్ చోక్సీని నరేంద్ర మోడీ 'మెహుల్ భాయ్' అని పిలవటమే కాకుండా దావోస్‌లో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సులో నీరవ్ మోడీ దేశం నుంచి పారిపోయిన తరువాత కూడా మోడీతో భారత పారిశ్రామిక వేత్తలతోపాటు పోటో దిగాడు. ఫొటో తీస్తుండగా నీరవ్ మోడీ మధ్యలో దూరాడనే ప్రభుత్వ వాదన అర్థరహితమని వేరే చెప్పనవసరం లేదనుకుంటా.


నిజానికి వీళ్ళు 'ప్రభుత్వ సహాయంతోనే దేశం నుంచి పారిపోయారు' అనే వాస్తవంతో పాలక వర్గానికి వీరు ఎంత ప్రీతిపాత్రులో తెలుస్తుంది. 9వేలకోట్లు దిగమింగిన విజయ్ మాల్యాపై 2015 అక్టోబరు15వ తేదీన జారీ అయిన 'లుక్ ఔట్ నోటీసు' స్థాయిని నవంబరు 25వ తేదీన దిగజార్చి 2016, మార్చి1వ తేదీన దేశం నుంచి పారిపోయేందుకు అవకాశం కల్పించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకును 11,400కోట్లకు ముంచిన నీరవ్ మోడీపై 2016 జులైలోనే సమాచారం అందించినప్పటికీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మూడవది, వీరిలో ప్రతి ఒక్కరూ తాము చేసిన పనికి ఏమాత్రం చింతించటం లేదు. తనే సమిధనయ్యానని నటిస్తూ నీరవ్ మోడీ ప్రపంచమంతా తిరుగుతున్నాడు. లండన్‌లోని భారత రాయబార కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యే ధైర్యాన్ని విజయ్ మాల్యా చేశాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు తొందరపాటు చర్యవల్ల మీడియా తన విషయం గురించి చిలువలుపలువలతో రాయటం కారణంగా తాను దివాళా తీయవలసి వచ్చిందని నీరవ్ మోడీ ఒక లేఖ రాశాడు. అయితే మీడియాకు ఈ విషయం గురించి ఏమీ తెలియకముందే ఆయన జనవరి1వ తేదీన దేశం విడిచి పారిపోయిన విషయం అందరికీ తెలిసిందే.

అయితే ఆర్థిక నేరాలను ఏమాత్రం సహించబోనని బొంకుతూ, నల్లధనంపై పోరాటం పేరుతో నోట్ల రద్దుతో కోట్లాది ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, ప్రజాపంపిణీకి ఆధార్ అనుసంధానించాలను చెబుతూ అనేక మంది నిర్భాగ్యుల మరణానికి కారణభూతమైన ప్రభుత్వం కనుసన్నల్లో దేశంలోని అత్యంత ధనవంతులలో కొందరు బ్యాంకులను కొల్లగొట్టారు. అలా బ్యాంకులను కొల్లగొట్టిన వారు దేశం నుంచి పారిపోవటంలో కూడా ఇదే ప్రభుత్వం సహకరించింది! తాజాగా నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకును చేసిన లూటీపై ప్రధాని, ఆర్థిక మంత్రి పూర్తిగా మౌనం పాటించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.

ఇదిలావుంటే పెట్టుబడిదారుల సంఘం అస్సోచామ్ బ్యాంకులలో జరిగిన ఈ లూటీని ఉదహరిస్తూ ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటీకరించాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చింది! అంటే ఏ వర్గమైతే బ్యాంకులను లూటీ చేసిందో అదే వర్గానికి బ్యాంకులపై పెత్తనాన్ని ఇవ్వమని అనటంతో ఇలా డిమాండ్ చేయటం సమానమౌతుంది. ఒక నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకును లూటీచేసి చిద్విలాసంగా న్యూయార్క్ నగరంలో కూర్చుంటాడు. సరిగ్గా ఈ లూటీనే కారణంగా చూపి పంజాబ్ నేషనల్ బ్యాంకును అంబానీలాంటి అతని బంధువుకు అప్పజెప్పాలనే డిమాండ్ ముందుకు వస్తుంది! లేక అంతకంటే ఘోరంగా అదే నీరవ్ మోడీ బినామీ కంపెనీ అదే పంజాబ్ నేషనల్ బ్యాంకును అదే బ్యాంకును లూటీ చేసిన డబ్బుతో కొంటుంది!

అయితే అసోచామ్ అలాంటి పనికిమాలిన డిమాండ్లను ముందుకు తెస్తుందని ఊహించగలం. కానీ బ్యాంకులలో జరిగే అవకతవకలపై పర్యవేక్షణ పెరగటం కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులలో ప్రయివేటు వాటా పెరగాలని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యం కోరుతున్నారు. ఆయన అభిప్రాయాలు ప్రభుత్వానివి అయితే ఆశ్చర్యం. ఒకవేళ అవి తనవే అయితే ఒక బాధ్యతాయుత పదవిలోవున్న అధికారి అలా బహిరంగంగా వాటిని వ్యక్తం చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అయితే ఆయన దృక్పథంలో రెండు స్పష్టమైన లోపాలున్నాయి. మొదటిది, బ్యాంకులో ప్రయోజనాలు ఉన్నవారు అప్రమత్తంగా ఉన్నంతమాత్రాన బ్యాంకులలో అవకతవకలు ఆగవు. ఈ విషయాన్ని బేరింగ్స్ బ్యాంక్ ఉదంతం నిరూపించింది. బ్రిటన్‌లో అత్యంత ప్రాచీనమైన ఈ బ్యాంకు ఉద్యోగిగావున్న నిక్ లీసన్ బ్యాంకు డబ్బును చట్టా వ్యాపారంలోపెట్టి బ్యాంకును దివాళా తీయించాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఉదంతంలో ఎల్ఓయూలకు చాలా తక్కువ ఆయుప్రమాణం ఉన్నది. ఈ కుంభకోణం బయటపడకముందు అనేక ఎల్ఓయూలను జారీచేయటమో లేక ఆడిట్‌ను తప్పించుకోవటానికి తాజాగా ఎల్ఓయూలను జారీచేయటమో జరిగింది. కాబట్టి వాటాదారులు దీనిని అడ్డుకోవటం సాధ్యపడదు.

ఈ వాస్తవానికి సంబంధించి అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమంటే నీరవ్ మోడీకి ఇచ్చిన అప్పుకు సంబంధించిన షరతులను ఉద్యోగులు సరళతరం చేయటం. దీనిని అడ్డుకోవటానికి కావలసింది ఆచరిస్తున్న పద్ధతిని మార్చటం తప్ప వాటాదారులు అప్రమత్తంగా ఉండటం కాదు. హెచ్చరించినా చర్యతీసుకోకుండా మోడీ ప్రభుత్వం తప్పు చేసింది. ఇందుకు సంబంధించిన ఆచరణలో కూడా మార్పును తీసుకురావాలి. ఉదాహరణకు అలాంటి మార్పులో మరింతగా పార్లమెంటరీ పర్యవేక్షణ ఉండాలి తప్ప




ప్రయివేటీకరణ ద్వారా ప్రవేశించిన వాటాదార్ల అప్రత్తతతో కాదు. రెండవది, కాసేపు పంజాబ్ నేషనల్ బ్యాంకు ఒక ప్రయివేటు బ్యాంకు అనుకుందాం. ఇటువంటి స్థాయిలో కుంభకోణం జరిగినప్పుడు డిపాజిట్లు పెట్టినవారు బ్యాంకుపై ఎగబడి తమ డిపాజిట్లను ఉపసంహరించుకుంటారు. దానితో బ్యాంకు దివాళా తీయటమో లేక ఆ బ్యాంకుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్దీపనలను ఇవ్వటమో జరుగుతుంది. అయితే పంజాబ్ నేషనల్ బ్యాంకు ప్రభుత్వ రంగ బ్యాంకు అవటం కారణంగా మోడీ, జైట్లీలు మౌనంగా ఉన్నప్పటికీ డిపాజిటర్లకు బ్యాంకుమీద విశ్వాసం సడలలేదు. కాబట్టి వారు తమ డిపాజిట్లను ఉపసంహరించుకోలేదు.

ప్రయివేటు నియంత్రణ పేరుతోగానీ, ప్రయివేటు వాటాల పెరుగుదల రూపంలోగానీ ప్రవేశించే ప్రయివేటీకరణలో ఇటువంటి సంఘటనలు జరగక మానవు. అటువంటి సంఘటనలు జరిగినప్పుడు బ్యాంకులకు ప్రభుత్వ మద్దతు అవసరమౌతుంది. అటువంటి కుంభకోణాలు జరిగినప్పుడు ప్రభుత్వ నిధులు అవసరమైనప్పుడు ప్రభుత్వమే బ్యాంకులకు యజమాని ఎందుకు కాకూడదు లేక ప్రభుత్వం తన వాటా ఎందుకు తగ్గించుకోవాలి. అటువంటి కుంభకోణాలు జరిగినప్పుడు ప్రభుత్వం తన యాజమాన్యాన్ని నిలుపుకుంటూనే సంస్థాగత పర్యవేక్షణను బలోపేతం చేయవలసి ఉంటుంది.

అయితే ఇక్కడ ఒక లోతైన సమస్య ఉన్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యాపార, కార్పొరేట్, బ్యాంకు వర్గాలను లాభాలను ఆర్జించమని పురిగొల్పుతుంది. నిజానికి దాని పునాది లాభార్జనపైనే ఆధారపడి ఉన్నది. అయినప్పటికీ ఈ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులను రహస్యంగానైనా తమ వ్యక్తిగత లాభాలను పట్టించుకోద్దని చెబుతుంది. ఆర్థిక వ్యవస్థలో లాభాలను పెంచుకోవాలనే తత్వాన్ని ఇది ప్రోత్సహిస్తుంది. కానీ ప్రభుత్వంగానీ, ప్రభుత్వోద్యోగులుగానీ ఇటువంటి వ్యక్తిగత లాభాపేక్షను కలిగి ఉండరాదని అది కోరుతుంది. ప్రయివేటు ఏజెంట్లు లాభాలను వీలైనంత ఎక్కువగా పెంచుకోవాలని అది కోరుతుంది. అయితే అది కేవలం చట్ట పరిధిలోనే జరగాలి. అయితే ఆ చట్టాన్ని పరిరక్షించవలసిన వారికి లంచాలిచ్చి చట్టవ్యతిరేకంగానైనా తమ లాభాలను పెంచుకుంటే అడ్డంకి ఏముంటుంది? వేరేమాటల్లో చెప్పాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థ మూలాలలోనే ఒక మౌలిక వైరుధ్యం ఉన్నది. అది ప్రోత్సహించే ప్రవర్తన ఒక పరిధిలో ఉన్నప్పుడే అది మనగలుగుతుంది. అయితే అలా తాను గీసిన పరిధిలోనే బంధించి ఉంచటానికి ఆ వ్యవస్థలో ఏమీలేదు. ఈ సమస్య గతంలో రాగలిగినంత ప్రమాదకరంగా ఇంతలా ముందుకు రాలేదు. ఎందుకంటే చాలాకాలంపాటు ఆర్థిక వ్యవస్థ ఆవల సంస్థలలోను, ప్రభుత్వంలోను పనిచేస్తున్న ఉద్యోగులు తాము చేస్తున్న పని గతించిన ఉత్పత్తి విధానం లోవలే గౌరవనీయమైనదా లేక సామ్యవాద ప్రజాస్వామ్యంలోవలే సామాజికంగా నిబద్ధతను ప్రతిబింబిస్తున్నదా అనే ఆలోచనలు ఉండేవి. మనలాంటి దేశాలలో స్వాతంత్ర్య పోరాట వారసత్వం కారణంగా ప్రభుత్వ ఉద్యోగులలోను, ప్రభుత్వరంగ పరిశ్రమలలో పనిచేసే ఉద్యోగులలోను పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించిన లాభాపేక్ష ఉండేది కాదు. క్లుప్తంగా చెప్పాలంటే వ్యవస్థ కుదేలయ్యేలా పెట్టుబడిదారీ వ్యవస్థ మూలాలలోగల వైరుధ్యం తీవ్రతరం కాలేదు.

అయితే నయా వుదారవాద ప్రవేశంతో ఈ అదుపు తప్పింది. స్వంతంగా లాభం పొందాలనే కాంక్ష సాధారణీకరిం పబడింది. ఇది సంస్థాగత వైఫల్యాలలో ప్రతిబింబిస్తున్నది. కాబట్టి నీరవ్ మోడీ ఉదంతాన్ని 'నిజమైన పెట్టుబడిదారీ వ్యవస్థ'ను 'ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ' స్థానభ్రంశం చేయటంగా చూడరాదు. దీని ద్వారా 'నిజమైన పెట్టుబడిదారీ వ్యవస్థ' తనకుతానుగా మౌలికంగా పనికిమాలినదని బహిరంగంగా ప్రకటించటంగా మనం అర్థం చేసుకోవాలి.

ఇంతకుముందు సూచించినట్టుగా సంస్థాగత ప్రతిబంధకాలు ఈ క్షీణతను కొంతవరకు అరికట్ట గలుగుతాయి. అయితే అచిరకాలంలో ఈ ప్రతిబంధకాల అడ్డును కూడా తొలగించటం జరుగుతుంది. ప్రయివేటు లాభాపేక్షపై ఆధారపడిన వ్యవస్థ మౌలికంగా పనికిమాలినదనే విషయం అలా మరోసారి బహిర్గతమౌతుంది.

**అనువాదం: నెల్లూరు నరసింహారావు,**
**సెల్: 8886396999**

# లెనిన్ విగ్రహాలపై విధ్వంసకాండ వెనుక...


**కె. లలిత**

బీజేపీ-ఐపీఎఫ్‌టీ ప్రభుత్వం త్రిపురలో అధికారం చేపట్టిన నాటి నుంచి సీపీఐ(ఎం) కార్యాలయాలపై విధ్వంసకాండ, ఆఫీసులను ఆక్రమించుకోవడంతోపాటు ఆ పార్టీ కార్యకర్తలపై నిరంతరాయంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. బీజేపీ మద్దతుదారులు లెనిన్ విగ్రహాన్ని కూలదోశారు. లెనిన్ విగ్రహాన్ని కూల్చడం ద్వారా సంఘ్ పరివార్ నిరూపించాలనుకున్నదేమిటి? వారు ఆ విగ్రహాలను చూసి ఎందుకు భయపడుతున్నారు.

కార్మికులు, రైతులు ఉత్పత్తి సాధనాలపై నియంత్రణ సాధించిన నాడు ఈ దోపిడీ సమాజాన్ని అంతం చేస్తారు, సమానత్వ సమాజాన్ని నిర్మిస్తారు. సోషలిజం అంటే ఏమిటో తన గొప్ప రచనల ద్వారా లెనిన్ వివరించారు. పెట్టుబడిదారీ విధానం చాలా అధునాతన దశలో ఉన్నప్పుడు, అది ఆ ఒక్క దేశం నుంచి తగినంత లాభాలు పొందడం సాధ్యం కాదనీ, దాంతో ఇతర దేశాలపై ఆర్థికంగా (తరచూ భౌతికంగా) దోపిడీ ప్రారంభమవు తుందని లెనిన్ బోధించాడు. పెట్టుబడిదారీ సమాజాన్ని ఎలా ఓడించాలో ఆ మహానేత వివరించాడు.

ప్రపంచంలో మొట్టమొదటిసారిగా నిజమైన ప్రజారాజ్యం లెనిన్ నాయకత్వంలో స్థాపించబడింది. ఆ సమాజం పురుషులకే కాదు, మహిళలకూ ఆర్థిక స్వేచ్ఛనిచ్చింది, సామాజిక హక్కులను అందించింది, చరిత్రలో తొలిసారిగా వారికి ఓటు హక్కును ఇచ్చింది. ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య సంరక్షణ కల్పించింది. అనతికాలంలోనే 100శాతం అక్షరాస్యతను ఆ దేశం సాధించింది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో విస్తత అభివృద్ధితోపాటు, అంతరిక్షంలోకి తొలిసారిగా ఒక వ్యక్తిని పంపించే స్థాయికి ఎదిగింది.

'1913 - 1965 మధ్యకాలంలో సోవియట్ ఆర్థికాభివృద్ధి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైనది. అన్ని ప్రధాన లేదా అభివృద్ధి చెందిన దేశాలు, జపాన్ కంటే వేగవంతమైన అభివృద్ధి రష్యా రిపబ్లిక్‌ది' అని ప్రసిద్ధ ఆర్థికవేత్త అంగస్ మాడిసన్ ప్రకటించారు. ఉపాధిని ప్రాథమిక హక్కుగా చేయడమేకాదు, 1936 నాటికి నిరుద్యోగ సమస్య లేకుండా చేయగలిగింది.



విదేశీయుడైన లెనిన్ విగ్రహం భారతదేశంలో ఎందుకు అని ప్రశ్నించేవారికి ఇక్కడ సమాధానం దొరుకుతుంది. వలసవాద సంకెళ్ళను ఛేదించి తెల్ల జాతిపాలనను అంతమొందించిన భారత్ వంటి మూడో ప్రపంచదేశాలకు రష్యా ప్రేరణగా నిలిచింది. జాతీయ విముక్తి పోరాటాలకు లెనిన్ మద్దతుపలికారు. భారత స్వాతంత్రోద్యమానికి ఆయన సంపూర్ణ మద్దతునిచ్చారు.

మన దేశంలో విప్లవపోరాటయోధుడు భగత్ సింగ్ కూడా లెనిన్ నుంచి స్ఫూర్తిపొందినవారే. భగత్ సింగ్ రచనల్లో ఈ విషయం చాలా స్పష్టంగా అర్థమవుతుంది. లెనిన్ నుంచి నేర్చుకోవాలనీ, సోషలిస్టు విప్లవం కోసం పనిచేయాలనీ "యువ రాజకీయ కార్యకర్తలు" అనే తన వ్యాసంలో భగత్ సింగ్ దేశ యువతను కోరారు.

లెనిన్ జయంతి సందర్భంగా 1931 జనవరి 21న రష్యా నేతలకు పంపిన టెలిగ్రామ్‌ను భగత్ సింగ్, ఆయన సహచరులు కోర్టులో చదివారు. "గొప్ప నేత లెనిన్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్ళేందుకు కృషిచేస్తున్న వారికి ఆయన జయంతి సందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాం. రష్యా నిర్వహిస్తున్న ఈ గొప్ప ప్రయోగంలో విజయం సాధించాలని మేం కోరుకుంటున్నాం. అంతర్జాతీయ శ్రామిక ఉద్యమానికి మా గళాన్ని కూడా అందిస్తాం'. కొన్ని గంటల్లో తనకు ఉరివేయడానికి ముందు భగత్‌సింగ్ లెనిన్ జీవితచరిత్రను చదివారన్నది చారిత్రక వాస్తవం.

రష్యన్ విప్లవం జరుగుతున్నప్పుడు బిపిన్ చంద్రపాల్, బాల్ గంగాధర్ తిలక్, లాలా లజపత్ రాయ్‌లాంటి వారు కూడా రష్యా విప్లవాన్ని స్వాగతించారు. దాని నుండి ప్రేరణ పొందారు. భారతదేశ కార్మికోద్యమం 1917 తిరుగుబాటు తరువాత భారీ ఊపునందుకుంది. జవహర్ లాల్ నెహ్రూ, పెరియార్ నుంచి రవీంద్రనాథ్ ఠాగోర్ వరకు పలువురు నేతలు ఆ దేశాన్ని సందర్శించి సోవియట్ యూనియన్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. భారత స్వాతంత్ర్య పోరాటంపై లెనిన్ ప్రభావం గురించి ప్రశ్నించే వారికి చరిత్ర తెలియదని అర్థమవుతున్నది. పేదరికాన్ని, దోపిడీని అంతమొందించే మార్గాన్ని సోషలిజం చూపిస్తున్నది. పెట్టుబడిదారీ విధానం ప్రపంచమంతటా విస్తరించబడి ఉన్నది కాబట్టి.. సోషలిజం ఒక అంతర్జాతీయ సిద్ధాంతంగా ముందుకొచ్చింది.

జాతీయవాదులమని చెప్పుకునేవారు.. లెనిన్ విదేశీయుడని చెప్పేవారు... హిట్లర్, ముస్సోలినీ నుంచి జాతీయవాద పాఠాలు నేర్చుకున్నారు. ఆర్ఎస్ఎస్ గురువు గోల్వాల్కర్ గ్రంథాల్లో ఇది స్పష్టమవుతుంది.

లెనిన్ ఆలోచనలను చూసి బీజేపీ, సంఘ్ భయపడుతున్నదని మాత్రం స్పష్టమవుతున్నది. అందువల్లే వారు ఆయన విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. దేశంలోని అన్ని వనరులపై నియంత్రణను కలిగి ఉన్న పెట్టుబడిదారీ వర్గానికి మద్దతుగా నిలుస్తూ... ఆదాయ అసమానత సష్టిస్తున్నారు. అణచివేతకు, దోపిడీకి గురవుతున్న కార్మికలోకం లెనిన్ సిద్ధాంత స్ఫూర్తితో ఆ దౌర్జన్యపాలనకు చరమగీతం పాడతారన్న విషయం సంఘ్ పరివార్‌కు తెలుసు. అందుకే ఆ భయం. లెనిన్ సొంత మాటల్లో చెప్పాలంటే.. 'పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానికి నియంతృత్వం ఒక సూచీ".

విగ్రహాలను ధ్వంసం చేయడం ద్వారా లెనిన్ ఆలోచనలను చంపలేరన్న వాస్తవాలను హిందూత్వశక్తులు మర్చిపోతున్నారు. దోపిడీ ఉన్నంతకాలం దానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగుతూనే ఉంటాయి. ఈ పోరాటాలు చేస్తున్న ప్రజలకు లెనిన్ ఆలోచనలు బలాన్ని, మనోస్థైర్యాన్ని, స్ఫూర్తీ గుండె నిండుగా నింపుతూనే ఉంటాయి.

# భారత్‌లో 'మెక్ కార్థీయిజం'

**ఎస్.హెచ్**

ఆధారాలు లేకుండా రాజకీయ మోసం, అమానవీయ అపనిందలను అలవాటుగా ప్రచారం చేయడం, వినాశక కార్యక్రమాలతో ప్రతిపక్షాలను అణగదొక్కడం, నేరశోధనలను ప్రయోగించడం 'మెక్ కార్థీయిజం' అని అమెరికన్ హెరిటేజ్ నిఘంటువు నిర్వచించింది. ఇందులో వ్యక్తిగత దాడులు, హింస, హత్యలు ఉంటాయని వెబ్‌స్టర్ నిఘంటువు వివరించింది. మెక్ కార్థీయిజం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపగల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక సంఘటనల పరంపర.చరిత్రను వివాదాస్పదం చేసి, ప్రజలను భయాందోళనలకు, మానసికరోగానికి గురిచేసే మంత్రగాళ్ళ వేట.

**ప్రపంచ శిబిరాలు:** రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ ఫాసిజాన్ని ఓడించింది. యుద్ధం తర్వాత సామ్రాజ్యవాద పీఠం ఇంగ్లండు నుండి అమెరికాకు మారింది. తూర్పు ఐరోపా దేశాలలో సామ్యవాదాన్ని, మూడవ ప్రపంచ దేశాల స్వాతంత్రోద్యమాలను సోవియట్ ప్రోత్సహించింది. వెనుకబడిన దేశాల అభివృద్ధికి సాయపడింది. ప్రపంచ కార్మికులు మార్క్సిజాన్ని, సోవియట్ నమూనా అనుసరించారు. అమెరికాలో వామపక్ష కార్మిక సంఘాల సభ్యత్వం 74శాతం దాటింది. ఇంగ్లండులోనూ ఇదే పరిస్థితి. ఇంగ్లండ్ వంటి అభివృద్ధిచెందిన పారిశ్రామిక దేశాల్లో విప్లవమొస్తుందన్న మార్క్స్ ఊహకు బలమొచ్చింది. సామ్రాజ్యవాదం భయంతో వణికింది. అమెరికా దృష్టిలో కమ్యూనిజం ఒక భూతం. నాజీ జర్మనీ వ్యతిరేక కూటమి చీలింది. అమెరికా ఆధ్వర్యాన సామ్రాజ్యవాద కూటమి, సోవియట్నాయకత్వాన సామ్యవాద శిబిరంఏర్పడ్డాయి. వీటి మధ్య రాజకీయ ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఆనాటి అమెరికా అధ్యక్షుడు హారీ ట్రూమన్ సోవియట్ నియంత్రణకు 12.03.1947 విదేశీ విధానాన్ని ప్రకటించాడు. ఇదే ట్రూమన్ సిద్ధాంతం. 26.12.1991 సోవియట్ పతనమైంది. ఈ మధ్యకాల ఉద్రిక్తతలే ప్రచ్ఛన్న యుద్ధం.

> **ముస్లిం, క్రిస్టియన్, దళితులు, కమ్యూనిస్టులపై దాడులు పెరిగాయి. ధర్నా చౌకులనే ఎత్తేశారు. శాంతియుత నిరసనలకు అనుమతివ్వరు. లాఠీలు ఎగురుతాయి. తూటాలు దూరుతాయి. శవాలు దొర్లుతాయి. మెక్ కార్థీ గుణగణాలు, లక్షణాలు, అలవాట్లు పాలకులకు వంటబట్టాయి. మన ప్రధాన సేవకుడు మెక్ కార్థీ పరిపూర్ణ ప్రతిబింబం. మెక్ కార్థీయిజం ఆయన పాలనలో ప్రతిబింబిస్తున్నది.**

**మెక్ కార్థీ:** అమెరికా సెనేటర్ జోసెఫ్ రేమండ్ మెక్ కార్థీ (14.11.1908-02.05.1957) రాజకీయ వాది. వాగాడంబర వక్త. పరమ కోపిష్టి. విచిత్రవిపరీత వాంఛలున్నవాడు. సహనం, సమన్వయం, సహచర సమంజసత లేవు. అపర నారదుడు. వాణిజ్యవేత్తల అనుకూల, కార్మిక వ్యతిరేకచట్టాలు చేయించాడు. ధరల నియంత్రణల రద్దుకు పోరాడాడు. పెప్సీ కంపెనీ నుండి 20,000 డాలర్ల అప్పు తీసుకున్నాడు. 'పెప్సీ-కోలా బాలుడు' అన్న "బిరుదు" పొందాడు. సైన్యంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలు సాగుతున్నాయని ఆరోపించాడు. కాని నిరూపించలేకపోయాడు. అమెరికన్ సెనేటర్లలో మెక్ కార్థీ అత్యంత అధముడని ఒక సర్వే పేర్కొంది. కమ్యూనిస్టులు, సోవియట్ గూఢచారులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో అమెరికా ఫెడరల్ ప్రభుత్వంలో, పాలనా సంస్థల్లో, ప్రభుత్వ అంతర్జాతీయ వార్తా సంస్థ 'వాయిస్ ఆఫ్ అమెరికా'లో, సైన్యంలో, విశ్వవిద్యాలయాల్లో, చిత్ర పరిశ్రమలో, ప్రజోపయోగ సంస్థల్లో చొరబడ్డారని మెక్ కార్థీ ప్రచారం చేశాడు. సోవియట్ పేరు ప్రతిష్టలకు మరకలంటించడానికి ప్రయత్నించాడు.


**మెక్ కార్థీయిజం:** 1950లో మెక్ కార్థీ పేరుతో పుట్టిన 'మెక్ కార్థీయిజం' పదాన్ని కమ్యూనిస్టు వ్యతిరేక కార్యకలాపాల సూచనకు, రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిత్వం, దేశభక్తిపై రుజువులులేని నిందలు, దాడులు, వాక్కూరతల ప్రస్తావనకు ప్రయోగిస్తున్నారు. ప్రతి ఏడాది రిపబ్లికన్ పార్టీ 'లింకన్ దినం' పేరుతో నిధి వసూళ్ళ వార్షికోత్సవాలను జరుపుతుంది. 09.02.1950 లింకన్ దినాన పశ్చిమ వర్జీనియాలో సభ్యులు, ప్రోత్సాహక చందాదారులనుద్దేశించి మెక్ కార్థీ ఉపన్యసించాడు. అమెరికా విధాన రూపకల్పనలో పనిచేస్తున్న 205 మంది కమ్యూనిస్టుల జాబితా తనవద్ద ఉందని చెప్పాడు. కమ్యూనిస్టు వ్యతిరేకులకు అది సంతోష వార్త. మెక్ కార్థీ జాతీయ స్థాయిలో ఎదిగాడు. అతని మాటలన్నీ అబద్ధాలే. చేతిలో కాగితముంది. అందులో జాబితా లేదు. అధ్యక్షుడు ట్రూమన్‌కు 57మందని టెలిగ్రాం ఇచ్చాడు. పేర్లివ్వలేదు. 20.02.1950న 81మంది.. అని ఉపన్యసించాడు. ప్రభుత్వ కార్యదర్శి జేమ్స్ బిర్నెస్ పార్లమెంట్ సభ్యుడు అడాల్ సాబత్‌కు 1946లో ఉత్తరం రాశాడు. నిఘావిభాగ నివేదిక ప్రకారం 284 మందిని ఉద్యోగం నుండి తొలగించాలని, 79మందిని తీసేశామని, ఇంకా 205మంది ఉన్నారని వివరించారు. మెక్ కార్థీ ఉపన్యసించేనాటికి నిఘా విభాగ తనిఖీలలో నిగ్గుదేలిన 65మందే ఉద్యోగాలలో ఉన్నారు. 1950 నాటికి తూర్పు ఐరోపా దేశాలలో సోవియట్ ప్రాబల్యం పెరిగింది. చైనా పౌరయుద్ధంలో కమ్యూనిస్టులు విజయం సాధించారు. స్వీయరక్షణకు సోవియట్ అణ్వాయుధ అగ్రగామి అయింది. ఈ పరిణామాలతో అమెరికాకు సోవియట్‌పై కోపం, అసూయ పెరిగాయి. ఈ దశలో ప్రభుత్వంపై మెక్ కార్థీ నేరారోపణ పత్రికల దృష్టిని ఆకర్షించింది. ఎవరూ నిజనిర్ధారణ జోలికి పోలేదు. ఫలితంగా మెక్ కార్థీ హీరో అయ్యాడు. వేలమంది అమెరికన్లను కమ్యూనిస్టులని, కమ్యూనిస్టు సానుభూతిపరులని నిందించారు. తీవ్ర నేరవిచారణకు గురిచేశారు. కమ్యూనిస్టులు, ఉదారవాదులు, మేధావులు, వామపక్షవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు, కళాకారులు, విద్యావేత్తలు, కార్మికసంఘ కార్యకర్తల మీద దాడులు జరిగాయి. పత్రికా స్వేచ్ఛను అణగదొక్కారు. 12,000మంది ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. వందలకొద్దీ జైళ్ళ పాలయ్యారు. అధ్యక్షుడు ట్రూమన్ 21.03.1947న జారీచేసిన కార్యనిర్వాహక ఆదేశం 9835 ద్వారా ఉద్యమకారుల రాజ్యాంగ హక్కులు నిరాకరించబడ్డాయి. ఆకాశవాణి, దూరదర్శన్, చిత్రసీమ, విద్యాలయాలు, కళారంగాల నుండి అరుణవర్ణ ప్రతినిధులను తరిమేయండి (డ్రైవ్ ద రెడ్స్ ఔట్) అన్న ప్రచారం తీవ్రంగా జరిగింది. డెమొక్రాటిక్ పార్టీ ప్రభుత్వం మెక్ కార్థీ ఆరోపణల దర్యాప్తునకు ఆదేశించింది. మెక్ కార్థీ ఆరోపణలకు ఆధారాలు లేవు. అతను చెప్పిన వారెవరూ కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు సానుభూతిపరులు కాదని, కొందరు ఉద్యోగులే కాదని, ప్రభుత్వ భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉన్నాయని, అతని చర్యలు చట్ట, రాజ్యాంగ విరుద్ధాలని విచారణలో తేలింది. మెక్ కార్థీ నేరారోపణలు మోసపూరిత గాలివార్తలని, అతని మాయ మాటలతో ప్రజలు చీలిపోయారని రుజువయింది. సెనేట్ మెక్ కార్థీని అభిశంసించింది. జరగరాని నష్టం జరిగిపోయింది.

**మన పాలనలో మెక్ కార్థీయిజం:** ప్రధాని, మంత్రుల, బీజేపీఅధ్యక్షుల, సంఘీయుల అసత్య ప్రచారాలు గోబెల్స్‌ను తలదన్నాయి. చైనా వస్తువులను హైకోర్టులు నిషేధించాయని, రోహింగ్యా శరణార్థులు దేశద్రోహులని సామాజిక మాధ్యమాలలో అబద్ధాల వర్షాలు కురుస్తున్నాయి. ముస్లిం, క్రిస్టియన్, దళితులు, కమ్యూనిస్టులపై దాడులు పెరిగాయి. ధర్నా చౌకులనే ఎత్తేశారు. శాంతియుత నిరసనలకు అనుమతివ్వరు. లాఠీలు ఎగురుతాయి. తూటాలు దూరుతాయి. శవాలు దొర్లుతాయి. మెక్ కార్థీ గుణగణాలు, లక్షణాలు, అలవాట్లు పాలకులకు వంటబట్టాయి. మన ప్రధాన సేవకుడు మెక్ కార్థీ పరిపూర్ణ ప్రతిబింబం. మెక్ కార్థీయిజం ఆయన పాలనలో ప్రతిబింబిస్తున్నది. సంఘ్ ఆలోచనలను అంగీకరించనివారు దేశద్రోహులే. హింసా రాజకీయాలకు, హత్యలకు అంతం లేదు. తప్పుడు చర్యల సమర్థనకు ఫలితాలను తారుమారు చేస్తున్నారు. ప్రకటించిన ఆశయాలను, వాగ్దానాలను మార్చేస్తున్నారు. మాటల పటాటోపం, నిజం చెప్పిన మన్‌మోహన్, అన్సారీలపై కోపం, కువిమర్శ, కమ్యూనిస్టులు, హైందవేతరుల, ద్వేషం, విదేశీయాకరణ, నోట్లరద్దు ఫలితాల తప్పుడు ధృవీకరణలు, గణాంకాలు, ప్రజావ్యతిరేక వస్తుసేవల పన్నుల అతిశయీకరణ, సమర్థన, గోవధ నిషేధం, గోరక్షకుల సంరక్షణ, చరిత్ర క్షీణీకరణ, స్వేచ్ఛా స్వాతంత్రాల హత్య, నిరుద్యోగం, సమాజాన్ని మత ప్రాతిపదికన చీల్చడంవంటి పాలక పనులన్నీ మెక్ కార్థీయిజాలే. కోట్ల ప్రజాధనం, వేల ప్రాణాలు మట్టిలో కలిసినా పాలకులకు లెక్కలేదు. ప్రత్యర్థులు, ప్రత్యామ్నాయాలు నశించాలి. అధికారం కావాలి. అవాంఛిత హింసల ప్రేరకం, కారణం మెక్ కార్థీయిజం. దీన్ని అంతమొందించాలి.

# అభివృద్ధికి హద్దులుండాలి..



**డోన్నెల్లా (డానా) మెడోస్**
**(మార్చి 13, 1941 - ఫిబ్రవరి 20, 2001)**




ప్రపంచీకరణ, పారిశ్రామీకరణ పేరుతో భూభాగంపై జరుగుతున్న విధ్వంసం.. ప్రకృతి వినాశనం, సహజవనరుల తరలింపు నానాటికీ పెరిగిపోతున్నాయి. వీటి కారణంగా.. వాతావరణంలో సమతుల్యత లోపించి జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతున్నది. కాలుష్యం పెరగడంతో ఆరోగ్యసమస్యలతో సగటు మనిషి సతమతమవుతున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి అసలైన అభివృద్ధి కాదని.. అభివృద్ధికి కూడా హద్దులుండాలని చెప్పిన వ్యక్తి డోన్నెల్లా మెడోస్. ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్‌గా, టీచర్‌గా, రైటర్‌గా ఆమె పర్యావరణ పరిరక్షణకోసం ఎంతో కృషి చేశారు.

'కన్సర్వేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్' శాస్త్రవేత్తగా 20వశతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన పర్యావరణ ఆలోచనాపరులలో ఆమె ఒకరుగా పేరుగడించారు. హార్వర్డ్ నుంచి జీవసాంకేతిక శాస్త్రంలో పిహెచ్‌డి తీసుకున్న తర్వాత ఆమె MIT లో చేరారు. ప్రపంచాన్ని ప్రభావవంతం చేసిన 'ది లిమిట్స్ టు గ్రోత్'(1972) పుస్తక ప్రధాన రచయితగా ఆమె సుపరిచితం. ఆమె మరికొంతమంది రచయితలతో కలిసి రచించిన ఈ పుస్తకం 26 భాషల్లో 9 మిలియన్ కాపీలకుపైగా అమ్ముడైంది. రచయిత, సహ రచయితగా మరో ఎనిమిది పుస్తకాలను రచించారు. అమెరికాలోని ఇల్లినాయిలో జన్మించిన మెడోస్ చిన్నతనం నుంచి సైన్స్‌పై ఎక్కువ ఆసక్తి. 1963 లో కార్లేటన్ కళాశాల నుండి రసాయన శాస్త్రంలో డిగ్రీ అందుకున్న తర్వాత ఒక 1968 లో హార్వర్డ్ నుండి జీవభౌతిక శాస్త్రంలో పిహెచ్‌డి పూర్తి చేశారు. ఆ తర్వాత ఇంగ్లాండ్ నుంచి శ్రీలంక వరకు జీవభౌగోళిక, పర్యావరణ అంశాలను పరిశీలిస్తూ.. పరిశోధిస్తూ.. ఏడాది పాటు సుదీర్ఘప్రయాణం చేశారు. MIT లో తన పరిశోధనా సహచరుడు, జే ఫోర్రె-స్టర్ ఏర్పాటుచేసిన విభాగంలో సభ్యుడిగా చేరారు. ఈ సమయంలో కంప్యూటర్లులో అయస్కాంత డేటా కోసం జరిగిన పరిశోధనల్లో ఆమె పాల్గొన్నారు.

మెడోస్ "ది గ్లోబల్‌సిటిజెన్" అన్న పేరుతో వీక్లీ కాలమ్ రాసేవారు. ఇందులో ప్రపంచ సంఘటనలపై తన అభిప్రాయలను వివరించేవారు. ఆ తర్వాత ఈ వ్యాసాలన్నీ సంకలనంగా అందుబాటులోకి వచ్చాయి. దాదాపు 20 కంటే ఎక్కువ పత్రికలకు ఆమె వ్యాసాలు రాసేవారు. వ్యాపార ం, ఆర్థిక రంగాలలో రాసిన వ్యాసాలకు 1985 ఛాంపియన్-టక్ జాతీయ పోటీలో రెండవ స్థానం పొందారు. 1990లో వాల్టర్ సి. ఫైన్ సైన్స్ ఎడ్యుకేషనల్ అవార్డు అందుకున్నారు. అంతేకాదు 1991లో 'పులిట్జర్ బహుమతి' కోసం నామినేట్ చేయబడ్డారు. యునైటెడ్ స్టేట్స్ అసోసియేషన్ ఆఫ్ ది రోమ్ క్లబ్‌లో ఆమె చాలాకాలం సభ్యులుగా ఉన్నారు. ఆమె జ్ఞాపకార్థం "సస్టేనబుల్ గ్లోబల్ యాక్షన్స్ రోమ్ డోనాలా మెడోస్ అవార్డు' ను అమెరికా అసోసియేషన్ ఫర్ ది రోమ్ క్లబ్ ప్రకటించింది. పర్యావరణ పరిరక్షణ పై విశేషమైన వ్యాసాలు రాసిన వారికి ఈ అవార్డును బహుకరిస్తారు. ఆమె మరణానంతరం 'కన్సర్వేషన్ లా ఫౌండేషన్' పర్యావరణ సంబంధాల అవార్డును 2001లో అందుకున్నారు.





# లెహంగ చోళి...

కాలేజీ పార్టీ.. పండుగ.. పెండ్లి.. అకేషన్ ఏదైనా నిండైన లెహంగ చోళీ ధరిస్తే అందరిలో ప్రత్యేకంగా కనిపించేది మనమే. అందమైన ఎంబ్రయిడరీతో చాలా అందంగా, నిండుగా, హుందాగా కనిపిస్తాం. ఈ తరం యువత ఆసక్తి చూపించే డ్రెస్సుల్లో దొకటి అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మోడ్రన్‌గా కనిపిస్తూనే సంప్రదాయం ఉట్టిపడాలంటే లెహంగ చోళీకి మించిన మరో డ్రెస్సు లేదు. నలుపు రంగు లెహంగకు పసుపు రంగు పూలద్దినట్టుగా... ముదురు ఆకుపచ్చ లెహంగ మీద బంగారు వర్ణంతో అలంకరించిన ఎంబ్రాయిడరీ వర్క్... నీలం రంగు మీదకు ఎరుపు, బంగారు వర్ణపు రంగులతో డిజైన్ చేసిన లెహంగ ధరిస్తే చూడముచ్చటగా, కంటికి నిండుగా కనిపిస్తుంది. అలాంటి అద్భుతమైన ఎంబ్రాయిడరీ లెహంగాలు మీ కోసం... ఈసారి ఫంక్షన్లో ఓ సారి ప్రయత్నించి చూడండి!

## పురుషులతో పోలిస్తే...



మహిళలకు ప్రత్యేక పోషకాలు అవసరమే! వారి శరీర జీవక్రియలకు తగ్గట్టు అవసరమైన పోషకాలను తీసుకుంటూ ఉండాలి. అవేంటంటే...

**విటమిన్ బి6:** నిద్ర, ఆకలి సక్రమంగా ఉండాలంటే ఆహారంలో విటమిన్ బి6 ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం రోజుకో అరటిపండు తినాలి.

**విటమిన్ బి12:** అలసటను తొలగించి, అలర్ట్‌నెస్‌ను పెంచుతుంది. కాబట్టి ఈ విటమిన్ ఉండే గుడ్డును రోజూ తినాలి.

**ఫోలేట్:** గర్భిణిగా ఉన్న మొదటి వారాల్లో బిడ్డలో నాడీమండల సమస్యలు రాకుండా ఉండాలన్నా, పెద్ద పేగు, రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉండాలన్నా ఫోలేట్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఇందుకోసం ఆకు కూరలు తినాలి.

**విటమిన్ డి3:** ఎముకలు, దంతాలు, కండరాలకు పటుత్వాన్నిస్తుంది. ఈ విటమిన్ ఉండే గుడ్డు ఆహారంలో చేర్చుకోవాలి.

**క్యాల్షియం:** రుతు సమయంలో సమస్యలు అదుపులో ఉండాలన్నా, రక్తపోటు నియంత్రణలో ఉండాలన్నా క్యాల్షియం తీసుకోవటం తప్పనిసరి. ఇందుకోసం పాల ఉత్పత్తులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

## తెలుపు రంగులో ఉంటే...

పెద్దవారివైనా లేక పిల్లలవైనా సరే బ్లూట్లు, చెప్పులు త్వరగా మురికి పట్టేస్తాయి. అందులో తెల్లవైతే మరింత మురికి పడతాయి. అయితే తెలుపు రంగు చెప్పులను, బూట్లను మెయిన్‌టెన్ చేయడం చాలా కష్టమవుతుంది. ప్రతిసారి పాలిష్‌కు బయట ఇవ్వడం, శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించడం ఇబ్బందికరం. ఇలాంటి పరిస్థితుల్లో చెప్పులను, బూట్లను అందంగా, కొత్తవాటిలా ఉంచుకోవడానికి కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

- ముందు బూట్లు బురద, మురికి లేదా మట్టి తగిలించుకున్నాయోమో పరిశీలించుకోండి. మరకలు తక్కువే అనుకుంటే ఒక కాటన్ గుడ్డను సోప్ నీటిలో తడిపి బూట్లను తుడవండి. ఇలా చేస్తే బూట్లపైనా, చెప్పులపైనా వున్న మరకలు తొలగిపోతాయి.
- తెల్లని కాన్వాస్ బూట్లు లేదా చెప్పులు మెషీన్‌లో వేసి వాష్ చేయాలనుకుంటే వాటి లేసులు తీసి వేడి నీటిలో కడగండి. అవసరమైన డిటర్జెంట్ వాడండి. బ్లీయర్ వాడవద్దు. ఇది వాడితే షూస్ పాడవుతాయి.



- బ్లీచ్, బేకింగ్ సోడా, లేదా కొద్దిపాటి డిటర్జెంట్ ను నీటిలో కలపాలి. ఆ మిశ్రమంలో ఒక టూత్ బ్రష్ ముంచి మరకలు పోయేంత వరకు వైట్ కలర్ బూట్లను బ్రష్‌తో రుద్ది శుభ్రంగా నీటితో కడిగితే సరిపోతుంది.
- కడిగే ముందు బూట్లకు లేదా చెప్పులకు వున్న దుమ్ము పూర్తిగా దులపండి. అరకప్పు వేడి నీరు. ఒక టేబుల్ స్పూన్ అమోనియా, కొద్దిపాటి సబ్బు కలిపిన మిశ్రమం తయారు చేసి బాగా కలపాలి. మొదట బేకింగ్ సోడాలో ముంచిన టూత్ బ్రష్‌తో శుభ్రపరచి తర్వాత దానిని ఈ మిశ్రమంలో ముంచి మరోసారి కడగాలి.
- తెల్లటి బూట్లను, చెప్పులను శుభ్రం చేయటానికి సాధారణంగా బేకింగ్ సోడా లేదా తెల్లని వెనిగర్ వాడతారు. ఈ మిశ్రమాన్ని బూట్లకు రాసి పది నుండి పదిహేను నిమిషాలపాటు నానపెట్టండి. తర్వాత కడిగేయండి.
- తెల్లటి బూట్లను, చెప్పులను శుభ్రపరచేందుకు టూత్ పేస్ట్ వాడండి. బ్రష్‌ను వేడి నీటిలో ముంచి కొద్దిపాటి టూత్ పేస్ట్‌ను బూట్లపై రుద్దాలి. తర్వాత నీటితో కడిగి టవల్ లేదా గుడ్డతో బాగా తుడిస్తే షూస్, చెప్పులు కొత్త వాటిలా మెరుస్తాయి.

## ఇట్ల చేద్దాం

గర్భిణీలు ఎక్కువ మొత్తంలో ఒకేసారి ఆహారాన్ని తీసుకోకుండా చిన్న చిన్న మీల్స్‌గా తీసుకోవాలి. అంటే రెండు నుండి మూడు గంటలకోసారి తీసుకోవాలి. దాంట్లో రెండు మెయిన్ మీల్స్, రెండు హెల్దీ స్నాక్స్ తీసుకుంటే సరిపోతుంది.

## సంతోషంగా ఉంటేనే...

ఆరోగ్యమే మహా భాగ్యం అన్నదాంట్లో ఎంత సత్యం వుందో... ఆనందమే మహా భాగ్యం అనేదాంట్లోనూ అంతే నిజం వుందంటున్నాయి తాజా అధ్యయనాలు.

ఎంత సంతోషంగా వుంటే అంత ఎక్కువ కాలం బతుకుతారని ఓ తాజా అధ్యయనం స్పష్టంచేస్తోంది. ఉత్సాహంగా వుండటం, సంతోషంతో జీవించడం, ప్రశాంతమైన జీవితాన్ని గడిపేవారి ఆయుష్షు సాధారణ వ్యక్తులకన్నా అధికంగా వుంటుందని ఈ స్టడీ పేర్కొంది. ఎక్కువ సంతోషంగా వుండేవారికి అనారోగ్యం దరిచేరదని తాము జరిపిన అధ్యయనంలో తేలింది అని స్పష్టంచేశారు. సంతోషంగా లేనివారు అనారోగ్యం బారిన పడటం కారణంగా, సంతోషంగా వున్న వారికన్నా ముందే ఆయుష్షుని కోల్పోతారు అని ఈ అధ్యయనంలో పాల్గొన్న పరిశోధకులు చెబుతున్నారు.



40 ఏండ్ల నుంచి 65 ఏండ్ల వయసు వున్న 175 మందిపై 30 రోజులపాటు అధ్యయనం జరిపారు. ప్రతీరోజు సాయంత్రం వారు అనుభవించిన 16 రకాల ఎమోషన్స్‌ని నమోదు చేశారు. ఆ తర్వాత ఆరు నెలలకి వారి రక్త నమూనాలని సేకరించి పరీక్షించిన అనంతరం పరిశోధకులు ఈ ఫలితాన్ని తేల్చారు. సో.. బీ హ్యాపీ..!



## వివక్ష తప్పట్లేదు

స్త్రీ పట్ల సమాజం ధోరణ ఎప్పుడూ చిత్రంగానే ఉంటుంది. వారిని ఓ పక్క దేవతగా పొగుడుతూనే... మరో పక్క ఆటవస్తువుగా చూస్తుంది. స్త్రీ స్వేచ్ఛ గురించి బల్లగుద్ది మాట్లాడుతూనే సంకెళ్లు వేస్తుంది. ఆడవారి పట్ల ఈ సమాజపు ద్వంద్వ వైఖరికి సాక్ష్యంగా ఇప్పుడు ఏకంగా ఓ పరిశోధనే వెలుగులోకి వచ్చింది. ఆ వివరాలు ఏమిటో మీరే చదవండీ...

ఈ మధ్యకాలం అంతా మెటర్నటీ లీవ్ గురించే మాట్లాడుతున్నారు. "ఆడవాళ్లు పిల్లల్ని కన్న తరువాత ఎంతకాలం మెటర్నిటీ లీవ్ ఉంటే మంచిది? దాని కోసం ప్రభుత్వాలు ఏం చేయాలి?" అంటూ తెగ ఉపన్యాసాలు వినిపిస్తున్నాయి. కానీ మెటర్నటీ లీవ్ తీసుకునే ఆడవారి గురించి సమాజం ఏమనుకుంటుంది? అన్న ఆలోచన వచ్చింది ఇంగ్లండులోని కొందరు పరిశోధకులకి. ఆలోచన వచ్చిందే తడవుగా ఓ 137 ఆడవారినీ, 157 మగవారినీ తమ ప్రయోగం కోసం ఎంపిక చేసుకున్నారు.

ప్రయోగంలో భాగంగా అభ్యర్థులందరికీ ఈమధ్యనే బిడ్డను కన్న ఒక స్త్రీ గురించి చెప్పారు. కాకపోతే ఆమె తన పిల్లవాడిని చూసుకునేందుకు మెటర్నటీ లీవ్ తీసుకుందని కొందరితో చెబితే, మెటర్నటీ లీవ్ పూర్తిగా వాడుకోకుండా ఆఫీసుకి వెళ్తోందని మరికొందరితో చెప్పారు. ఆ తర్వాత ఆ మహిళ గురించి తమ అభిప్రాయం ఏమిటంటూ వారిని ప్రశ్నించారు. అనూహ్యంగా రెండు సందర్భాలలోనూ సదరు వ్యక్తి చేసిన పనిని అభ్యర్థులు తప్పుపట్టారు.

మెటర్నటీ సెలవులను ఉపయోగించుకున్న సందర్భంలోనేమో ఆ వ్యక్తికి ఉద్యోగం పట్ల అంతగా నిబద్ధత లేదన్న అభిప్రాయం వ్యక్తమైది. మెటర్నటీ సెలవులను వద్దనుకుని ఉద్యోగంలో చేరిన సందర్భంలోనేమో... తల్లిగా తన బాధ్యతని సక్రమంగా నిర్వర్తించలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. వారు చెప్పిన అభిప్రాయాల ప్రకారం రెండు సందర్భాలలోనూ స్త్రీ నింద పడాల్సి వచ్చింది. ఈ అభిప్రాయాలను వ్యక్తం చేసినవారంతా కూడా 33 ఏండ్ల సగటు వయసున్న యువతే కావడం గమనార్హం. వారిలో దాదాపు సగం మంది స్త్రీలు ఉండటం మరో వైపరీత్యం. పైగా వీరంతా అభివృద్ధి చెందాయని చెప్పే ఇంగ్లండ్, అమెరికా దేశవాసులు కావడం మరో విచిత్రం.

మెటర్నటీ లీవ్ పట్ల సమాజపు ధోరణ తెలుసుకునేందుకు ఈ పరిశోధన జరిగి ఉండవచ్చు. కానీ బిడ్డను కనేందుకు, తన జీవితాన్ని పణంగా పెట్టే సందర్భంలోనే ఆడవారి పట్ల ఇలాంటి వివక్ష ఉంటే... ఇక రోజువారీ సందర్భాలలో వారి పట్ల సమాజ ధోరణి ఎలా ఉంటుందో ఇక చెప్పేదేముంది..!

## ఏపీ శాసనమండలి భవనం తెలంగాణకు అప్పగింత

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాష్ట్ర విభజన నేపథ్యంలో హైదరాబాద్‌లో ఏపీకి కేటాయించిన శాసనమండలి భవనాన్ని ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించింది. దీనికి సంబంధించి ఏపీ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం నుంచి పాత శాసనమండలి భవనంలోనే మండలి సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా అసెంబ్లీలో ఏపీకి కేటాయించిన భవనాన్ని కూడా తెలంగాణ అసెంబ్లీకి కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలకు పదేండ్ల పాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే శాసనమండలి భవనాన్ని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. గత రెండేండ్లుగా ఏపీ రాజధాని అమరావతిలోనే అసెంబ్లీ, సచివాలయాలు కొనసాగుతున్నాయి. దీంతో తెలంగాణ శాసనమండలి, శాసనసభలో ఏపీకి కేటాయించిన భవనాలను తెలంగాణకు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రంలోని డీఓపీటీకి, ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ముందుగా శాసనమండలి భవనాన్ని తెలంగాణకు కేటాయిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## తెలంగాణ బార్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి : ఐలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ బార్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని అఖిల భారత న్యాయ వ్యాదుల సంఘం (ఎఐఎల్‌యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి బార్ కౌన్సిల్ విడిపోని కారణంగా సంక్షేమ నిధికి ఆటంకం కలుగుతుందన్నారు. చనిపోయిన న్యాయవాదుల కుటుంబ సభ్యులకు సంక్షేమ నిధి ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత కూడా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయకపోవడం సరికాదని తెలిపారు. ఉమ్మడి బార్‌కౌన్సిల్ ఎన్నికలుజరపడం ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకమన్నారు.

## 15 నుంచి ఒంటిపూట బడులు

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

ఎండల తీవ్రత నేపథ్యంలో ఈనెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ జి కిషన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు తరగతులు నిర్వహించాలని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలను ఆయన ఆదేశించారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలున్న హైస్కూళ్లలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు ఉంటాయని తెలిపారు.

## నిట్‌లో విద్యార్థిపై హత్యాయత్నం

- ఎలక్షన్ గొడవలే కారణమా..?
- గతంలోనే డీన్‌కు ఫిర్యాదు
- ఏడుగురిపై కేసు నమోదు



**నవతెలంగాణ- కాజీపేట**

వరంగల్ నిట్‌లో వసంతోత్సవ సంబురాలు జరుగుతున్న సమయంలో ఓ విద్యార్థిపై హత్యాయత్నం జరిగింది. ఆదివారం రాత్రి పది గంటల సమయంలో జరిగిన ఈ ఘటన బయటకు పొక్కకుండా నిట్ అధికారులు తీవ్రంగా ప్రయత్నించినట్టు సమాచారం. కానీ దాడిలో విద్యార్థి తీవ్రంగా గాయపడటంతో ఆస్పత్రికి తరలించే క్రమంలో విషయం బయటికి తెలిసింది. కాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి నిట్ స్టేడియం గేట్ ఎదురుగా విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. రాజస్థాన్‌కు చెందిన నిట్ బిటెక్ విద్యార్థి జె ప్రీత్‌సింగ్‌పై ఇదే యూనివర్సిటీకి చెందిన ఏడుగురు విద్యార్థులు ఇనుప రాడ్‌తో, కత్తులతో దాడి చేశారు. ప్రీత్‌సింగ్ తలకు, తొడపై తీవ్రగాయం అయింది. వెంటనే విద్యార్థిని సుబేదారిలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. బాధితుడు జె.ప్రీత్‌సింగ్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన విద్యార్థులు అమిత్ యాదవ్, ధీరజ్, నితీష్ కుమార్, రవికుమార్ యాదవ్, పంకజ్‌యాదవ్, రోహిత్‌కుమార్, అలీవారిష్‌పై కేసు నమోదు చేశారు. ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు. రోహిత్ కుమార్ పరారీలో ఉన్నాడు. ఆగస్టులో నిర్వహించిన ఎన్నికల సందర్భంగా ఇరు గ్రూపుల మధ్య జరిగిన చిన్న గొడవలే తీవ్రస్థాయికి చేరాయని పోలీసులు అంటున్నారు.

**నాలుగు నెలల కిందటా..**

ఇదే విద్యార్థిపై నాలుగు నెలల కిందట కూడా నిట్ పరిసర ప్రాంతాల్లో నలుగురు దాడి చేశాడు. దాడిపై డీన్‌కు ఫిర్యాదు చేశాడు. అప్పుడే నిట్ అధికారులు కఠినంగా వ్యవహరించి ఉంటే ఈ ఘటన పునరావృతం అయ్యేది కాదని విద్యార్థులు అంటున్నారు.

## వాస్తవ సాగుదారులకు పెట్టుబడి పథకం వర్తింప చేయాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

వాస్తవ సాగుదారులకు పెట్టుబడి పథకం వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మఖ్దూంభవన్‌లో జరిగిన సదస్సులో ప్రోత్సాహక పథకంపై చర్చించారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని 5 ఎకరాల మెట్ట భూమిగా కానీ, రెండున్నర ఎకరాలు తరిగా కానీ పరిగణలోకి తీసుకుని, 3 నెలల లోపల ఆదేశాలు జారీ చేయాలని సదస్సు ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి ప్రోత్సాహక పథకంపై అందరి అభిప్రాయాలు సేకరించి వాస్తవ సాగుదారులకు వర్తింపజేయాలని కౌలు రైతులు, మహిళా రైతుల సదస్సు డిమాండ్ చేసింది. సదస్సులో తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం అధ్యక్షులు వి.ఎస్.ప్రసాద్ శాస్త్రి ప్రసంగిస్తూ పెట్టుబడి పథకాన్ని కేవలం భూ యజమానులకు మాత్రమే పరిమితం చేయడం సమంజసం కాదన్నారు. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ, ప్రధాన కార్యదర్శి టి.విశ్వేశ్వరరావు, కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి కె.సూర్యనారాయణ తదితరులు ప్రసంగించారు.

## జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- టీ మాస్ డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) డిమాండ్ చేసింది. తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఇతర పేదలకు న్యాయం చేయాలని కోరుతూ ఫోరం రాష్ట్ర చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య, కన్వీనర్ జాన్‌వెస్లీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో 93 శాతంగా ఉన్న అణగారిన వర్గాల వారి సమస్యలను పరిష్కరించటంలో టీఆర్ఎస్ సర్కారు విఫలమైందని వారు విమర్శించారు. వారి అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించటంలో, చట్టాలను అమలు చేయటంలో చిత్తశుద్ధిని ప్రదర్శించటం లేదని పేర్కొన్నారు.

# ప్రజాందోళనపై పైశాచికం



**ఒంగోలు :** వెనుకబడిన ప్రకాశం జిల్లాకు న్యాయం జరగాలంటే బడ్జెట్‌లో ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వా లని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) నాయకులు చేపట్టిన రిలే దీక్షల్లో భాగంగా మూడో రోజైన సోమవారం నిర్వహించిన 'చలో కలెక్టరేట్' ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టరేట్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న 50 మంది సీపీఐ(ఎం) నేతలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. వివిధ స్టేషన్లకు తరలించి నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు తొలుత ఎల్‌బిజి భవన్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ రెండు గేట్ల వద్ద ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు బలవంతంగా లాగేశారు. పోలీసులకూ, నాయకులకూ మధ్య తీవ్ర పెనుగులాట జరిగింది. సీపీఐ(ఎం) కార్యకర్తలను పోలీసులు పిడిగుద్దులు గుద్దారు. చొక్కా కాలర్ పట్టుకొని ఈడ్చేశారు. మెడతిప్పి మరీ వ్యాన్‌లో కుక్కేశారు. మహిళల చీరలను మహిళా పోలీసులు లాగిపడేశారు. రెండు చేతులు పట్టుకొని రోడ్డుపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యానులో పడేశారు. సీపీఐ(ఎం) జెండాలను తీసుకెళ్లి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పడేశారు. సుమారు 25 నిమిషాలు పాటు ఈ అరెస్టుల పర్వం సాగింది. సీపీఐ(ఎం) తూర్పు జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, ఎస్‌కె మాబు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు సహా 50 మంది నాయకులకు, కార్యకర్తలను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని కొంతమందిని జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించగా, మరికొందరిని సంతనూతలపాడు, ఇంకొందరిని ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. నాన్‌బెయి లబుల్ కేసు నమోదు చేశారు. నాయకులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## కనీస మద్దతు ధరకు ఒక్క రూపాయి తగ్గొద్దు : పోచారం

- చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన గుత్తా సుఖేందర్‌రెడ్డి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మార్కెట్‌లోకి వచ్చే ధాన్యాన్ని కనీస మద్దతు ధర కంటే ఒక్క రూపాయి తగ్గకుండా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సమన్వయ సమితి సభ్యులను ఉద్దేశించి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతు సమన్వయ సమితి చైర్మెన్‌గా ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మంత్రి పోచారం మాట్లాడుతూ రైతు సమన్వయ సమితికి సుమారు రూ.7 వేల కోట్లు అందుబాటులో పెడతామని చెప్పారు.

# రాజ్యసభకు ఐదు నామినేషన్లు

- ఈనెల 23న ఎన్నిక
- విప్ జారీ చేస్తే...?

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలో ఏప్రిల్ రెండుతో ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలకు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. టీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కరు నామినేషన్ వేయగా, మరో స్వతంత్ర అభ్యర్థి బరిలోకి దిగారు. సోమవారం అసెంబ్లీలో శాసనసభ కార్యదర్శి సిహెచ్ నరసింహాచార్యులుకు నామినేషన్లు అందజేశారు. టీఆర్ఎస్ నుంచి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు బంధువు జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, బండ సాయిప్రకాశ్ ముదిరాజ్ నామినేషన్లు వేయగా, కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరామ్‌నాయక్ సమర్పించారు. అలాగే ఇండిపెండెంట్ అభ్యర్థిగా శ్రమశక్తి పార్టీ నుంచి జాజుల భాస్కర్ నామినేషన్ వేశారు. ఈసందర్భంగా రెండు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నామినేషన్ల కార్యక్రమానికి హాజరయ్యారు.

**ప్రతిష్టాత్మకం:** రాజ్యసభ ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. మూడింటిని కైవసం చేసుకోవాలని టీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తుండగా, బలం లేకపోయినా కాంగ్రెస్ బరిలోకి దిగింది. ఎంఐఎం మద్దతుతో మూడో సీటును సైతం గెలువగలుగుతామని టీఆర్ఎస్ భావిస్తుండగా, విప్ జారీచేయడం ద్వారా సర్కారును ఇబ్బందుల్లోకి నెట్టడంతోపాటు పార్టీ నుంచి వెళ్లిపోయిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా కాంగ్రెస్ వ్యూహారచన చేస్తున్నది. అదే పనిలో టీడీపీ కనిపిస్తున్నది. శాసనసభలో 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున 21 ఎమ్మెల్యేలు గెలిచారు. ఇద్దరు చనిపోగా మిగిలింది 19 మంది. టీడీపీ నుంచి 15మంది విజయం సాధించారు. కాగా కాంగ్రెస్ నుంచి ఏడుగురు, టీడీపీ నుంచి 12మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లోకి, ఒకరు కాంగ్రెస్‌లోకి జంప్ చేశారు. ఈనేపథ్యంలో ఇప్పటికే అనర్హత విషయమై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి న్యాయస్థానంలో కేసునడుస్తున్నది.

**ఫిరాయింపుల సంగతి తేల్చేందుకే..**

రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చేందుకు పూనుకుంది. ఈమేరకు రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగింది. ఇప్పటికే ఫిరాయింపులపై స్పీకర్‌కు ఫిర్యాదు సంగతి తెలిసిందే. న్యాయస్థానం తలుపు సైతం తట్టింది. అయితే దేశ వ్యాప్తంగా ఈ తరహా ఫిర్యాదులు రావడంతో కోర్టులో విచారణ పెండింగ్‌లో ఉంది. ఈనేపథ్యంలో మరిన్ని సాక్ష్యాలను సేకరించడానికి ఈ ఎన్నికలను ఆయుధంగా మలుచుకోవాలని భావిస్తున్నట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఓట్ల సంఖ్య ఆధారంగా సభ్యులు ఎవరికి ఓటేశారో సులభంగా తెలిసిపోతుందని ఆ పార్టీ అంచనా వేస్తున్నది. విప్ జారీ చేయడం ద్వారా తమకు ఓట్లు పడకపోతే, అధికార పార్టీకి వేసినట్టుగా స్పష్టమవుతుందని, తద్వారా ఫిరాయింపుల వ్యవహారాన్ని మరోసారి చర్చనీయాంశం చేయడం, కోర్టుకు వెళ్లడం చేయాలని కాంగ్రెస్, టీడీపీ భావిస్తున్నాయి. కాంగ్రెస్ మూడో సీటు కోసం తమ అభ్యర్థిని రంగంలోకి తెచ్చింది. ఆ మేరకు ఓట్లు తమ అభ్యర్థికి పడకపోతే స్పీకర్‌కు ఫిర్యాదు చేయాలని, అనక న్యాయపరమైన చర్యలకు దిగేందుకు నిర్ణయించుకున్నట్టు ఆపార్టీ వర్గాలు తెలిపాయి. ఆ తరహాలోనే టీడీపీ అడుగులేస్తున్నది. అయితే మార్చి 13న జరిగే పోలింగ్‌కు బీజేపీ, టీడీపీ దూరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ద్ధతివ్వండి..

# సిట్టింగులు వర్సెస్ ఆశావహులు

- ఢిల్లీకి వెళ్లే సమర్థులెవరో..
- ఎవరి మద్దతుదారులకు చెక్ ఇది
- కేసీఆర్ ప్రకటనతో గులాబీపార్టీలో ఆందోళన

**నవతెలంగాణప్రత్యేక ప్రతినిధి**

టీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో చేసిన ప్రకటన ఆ పార్టీలో చర్చనీయాంశమైంది. సిట్టింగుల్లో ఎంతమందికి మళ్లీ టికెట్లు వస్తాయి. ఆశావహుల్లో ఎవరికి సీట్లు ఇస్తారన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో ఆరోపణలు వచ్చిన వారిని మాత్రమే పక్కన పెడతారా? ఒక గ్రూపునకు న్యాయం చేసి, మరో గ్రూపు మద్దతుదారులకు చెక్ చెబుతారా? అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఢిల్లీకి కేసీఆర్‌తో పాటు వెళ్లే సమర్థులైన మంత్రులు ఎవరై ఉంటారని కూడా గులాబీ నేతల్లో గుసగుసలు మొదలయ్యాయి. వచ్చే ఎన్నికల్లో నలుగైదుగురికి తప్ప సిట్టింగులందరికీ టికెట్లు ఇస్తామని, రాష్ట్ర ప్రయోజనాల కోసం తనతో పాటు మంత్రుల్లో సమర్థులైన వారిని ఢిల్లీకి తీసుకెళ్తానని సీఎం కేసీఆర్ చెప్పడం టీఆర్ఎస్‌పార్టీలో కొంతమందిని కలవరానికి గురిచేస్తున్నది. 2019 ఎన్నికలపై ఎవరు పోటీ చేస్తారన్న దానిపైనే అధికారపార్టీ నేతలకు స్పష్టత లేకుండా పోయింది. ఇదే విషయమై సోమవారం ఒకరిద్దరు ఎమ్మెల్యేలను అడగగా, తమ నాయకుడు ఎక్కడ పోటీ చేయమంటే అక్కడికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ మాటను జవదాటబోమన్నారు. సిట్టింగులందరికీ టికెట్లు ఇస్తామని చెప్పడంతో పాటు కొంతమందికి టికెట్లు ఇవ్వబోమని సీఎం కేసీఆర్ చెప్పడంతో ప్రస్తుత ఎమ్మెల్యేల్లో ఆందోళన నెలకొంది. నలుగైదుగురికి టికెట్లు ఇవ్వబోమని అనడంతో, వారు ఎవరై ఉంటారన్నది ఆసక్తి నెలకొంది. గుడిగ శోభతో పాటు జనగాం, మహబూబాబాద్, మేడ్చల్, మంథని ఎమ్మెల్యేలకు ఈ సారి టికెట్లు ఇవ్వరన్న ప్రచారం జరుగుతున్నది. దాంతోపాటు ఇంకా ఉమ్మడి నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లోని కొంతమంది సిట్టింగులకు టికెట్లు ఇచ్చే అవకాశం ఉండకపోవచ్చు అని కూడా తెలుస్తోంది. ఇదిలావుండగా సిట్టింగులందరికీ టికెట్లు ఇస్తే తాము ఏమై పోవాలని ఆశావహులు ఆవేదన చెందుతున్నారు. టికెట్టు వస్తుందన్న ఆశతో టీఆర్ఎస్‌లో చేరామని, ఇప్పుడేమి కావాలని ప్రశ్నిస్తున్నారు. నల్లగొండ, భూపాలపల్లి, జనగాం వంటి నియోజకవర్గాల్లో ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలకు టికెట్లు ఇస్తే, పార్టీలో ఉంటున్న తాము ఏమి కావాలని గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతలు ఆవేదన చెందుతున్నారు. అదేవిధంగా ఎంపీలు వినోద్‌కుమార్, కవిత, మల్లారెడ్డి, బూర నర్సయ్యగౌడ్ వంటి ఎంపీలు అసెంబ్లీకి వచ్చేందుకు ఉత్సాహ చూపుతున్నారు. కేసీఆర్ ప్రకటన వల్ల కొంతమంది ఎమ్మెల్యేలకు నష్టం వాటిల్లినా, ఆయన అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# 'మధ్యాహ్న' కార్మికుల వేతనాలు పెంచాలి

- ఈ బడ్జెట్ సమావేశాల్లోనే నిర్ణయించాలి : మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ
- పలుచోట్ల రిలే దీక్షలు



**నవతెలంగాణ-యంత్రాంగం**

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని, దీనిపై ఈ బడ్జెట్ సమావేశాల్లోనే నిర్ణయించాలని మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం పలుచోట్ల రిలే దీక్షలు చేపట్టారు. మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట దీక్షలల్లో ఎస్.రమ పాల్గొన్నారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే నిర్ణయించి వేతనాలు పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన రంగాన్ని ప్రయివేటీకరణ చేసే ఆలోచనని విరమించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే, ఎంపీల జీతాలు రూ.వేలల్లో పెరుగుతున్నా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. మెనూ చార్జీలు అరకొరగా ఇస్తూ, వేతనాలు పెంచకుండా పిల్లలకు వారానికి మూడుగుడ్లు పెట్టాలని ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోనూ రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ఎన్ రెడ్డి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కవిత మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సందర్శించారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ పట్టణాధ్యక్షులు గోపాలకృష్ణ, నాయకులు నందిమల్ల రాములు పాల్గొన్నారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లోని ధర్నాచౌక్ వద్ద దీక్షలు ప్రారంభించారు. రెండురోజుల పాటు దీక్షలను నిర్వహించనున్నట్టు తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి తెలిపారు. దీక్షాశిబిరంలో సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ప్రసంగించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో కూడా రిలే దీక్షలు ప్రారంభించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## సాంకేతికతతో ఉత్తమ ఫలితాలు

- మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీనఖ్వీ

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

సాంకేతిక వినియోగం మానవ జీవనంలో భాగమైపోయిందని, దానితో ఉత్తమ ఫలితాలు వస్తాయని మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ టెక్నాలజీ డైరెక్టర్, ప్రొఫెసర్ అలీనఖ్వీ అన్నారు. దైనందిన జీవనంలో ప్రతి సందర్భంలోనూ సాంకేతిక పరిజ్ఞానం అవసరమవుతుందని అన్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్సు విభాగం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా 'రీసెంట్ ఇన్నోవేషన్ ఇన్ కంప్యూటర్ సైన్సు అండ్ ఐటీ' అంశంపై సోమవారం జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నఖ్వీ మాట్లాడుతూ.. వ్యవసాయంతో పాటు విద్యా, విజ్ఞానం, అంతరిక్షం వరకు ప్రతి విషయంలోనూ సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరిగా మారిందన్నారు. ఉన్నత విద్యారంగంలో డిజిటల్ విద్యకు ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వారా సమయం ఆదాతో పాటు నాణ్యతతో కూడిన ఫలితాలు వస్తాయని చెప్పారు. ఐటీ ప్రాధాన్యతా పెరిగిందన్నారు. మహేంద్ర సంస్థ యూనిట్ హెడ్ మురళీ మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు సాధ్యపడుతుందని అన్నారు. టెక్ మహేంద్ర సంస్థ జనరల్ మేనేజర్ నరేశ్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో సమయం ఆదా చేయడంతో పాటు చేసే ప్రతి పనిలోనూ ఫలితాలు ప్రయోజనకరంగా ఉండేలా చూపాలని అన్నారు. ఆశించిన ఫలితాలే వ్యక్తిని, వ్యవస్థను ఉన్నతస్థాయిలో నిలబెడతాయని చెప్పారు. సదస్సుకు సైన్సు విభాగం డీన్ ప్రొఫెసర్ విద్యావర్ధిని అధ్యక్షత వహించగా, సెమినార్ కన్వీనర్ సారథి, వీసీ సాంబయ్య, రిజిస్ట్రార్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామిగౌడ్‌పై దాడికి ఖండన

- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్‌పై దాడి చేయడాన్ని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం ఖండించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యంవి రమణ ఒక ప్రకటన విడుదల చేశారు. సభలో దాడికి పాల్పడ్డ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**మూడెకరాల భూమి ప్రస్తావనేది? : లక్ష్మణ్**

**హైదరాబాద్ :** దళితులకు మూడెకరాల భూమి ప్రస్తావనేదని బీజేపీ శాసనసభ్యులు కె లక్ష్మణ్ ప్రశ్నించారు. మొదటి పేజీ నుంచి చివరి పేజీ వరకు గవర్నర్ ప్రసంగమంతా అబద్ధమేనని ఎద్దేవా చేశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిరుద్యోగం, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, బీసీ సబ్‌ప్లాన్ గురించి ఊసేలేదన్నారు. ప్రజల కోసం పోరాటం చేస్తామని చెప్పారు.

**ప్రజలను మోసం చేసేలా ఉంది : రామచంద్రరావు**

గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రజలను మోసం చేసేలా ఉందని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్రరావు అన్నారు. అభివృద్ధికి నిర్దిష్టమైన చర్యల్లేకుండా బంగారు తెలంగాణ సాధ్యమయ్యే అవకాశం లేదన్నారు. 53 మంది పోలీసులతో అసెంబ్లీ నడపడం శోచనీయమని అన్నారు.

## మహిళా హక్కులను కాపాడాలి

- మహిళ సంఘాలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మహిళల వ్యక్తిగత విషయాలను వార్తలుగా ప్రసారం చేసి అవమానానికి గురిచేసే శక్తులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని మహిళా సంఘాలు పేర్కొన్నాయి. ఇలాంటి ప్రసారాలు మహిళల ప్రైవసీ హక్కును కాలరాస్తాయని అన్నారు. ప్రైవసీ జీవించే హక్కులో భాగమని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిళా సంఘాల ప్రతినిధులు జే లలిత, మధుమితా సిన్హా, ఎం.లక్ష్మీ, శాలిని మహదేవ్ తదితరులు మాట్లాడారు. సునీతారెడ్డి అనే మహిళా బెడ్‌రూం, బాత్‌రూంకు సంబంధించిన విషయాలను ఓ ఛానెల్ ప్రసారం చేయడం దారుణమని వాపోయారు.

## 'ఆర్వో వాటర్ ఆరోగ్యానికి మంచిది కాదు'

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఆరోవో ద్వారా వచ్చే తాగునీరు వాటర్ ఆరోగ్యానికి అంత మంచిది కాదని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. సురేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా మిషన్ భగీరథలో నీటి శుద్ధి జరుగుతుందన్నారు. ఎర్రమంజిల్ లోని ఆర్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర కార్యాలయంలో నీటి నాణ్యత, పర్యవేక్షణ పై సమీక్ష చేశారు.

# మే 25న లాసెట్

- ఈనెల 22న నోటిఫికేషన్
- 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- షెడ్యూల్ విడుదల

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్-2018 నోటిఫికేషన్ ఈనెల 22న విడుదల కానుంది. సోమవారం లాసెట్ కమిటీ సమావేశం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగింది. అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. లాసెట్ రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో మే 25న జరుగుతుందని తెలిపారు. లాసెట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ.500, ఇతరులకు రూ.800 ఉందని తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు తుదిగడువు ఏప్రిల్ 25వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. అపరాధ రుసుం రూ.500లతో మే 2 వరకు, రూ.వెయ్యితో మే 9 వరకు, రూ.2 వేలతో మే 16 వరకు, రూ.4 వేలతో మే 23 వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశముందని తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తప్పులు సవరించుకునేందుకు మే 17 నుంచి 20వ తేదీ వరకు వీలుందని పేర్కొన్నారు. మే 22వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసేకునేందుకు అవకాశముందని తెలిపారు. మే 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. మే 28న లాసెట్ ప్రాథమిక కీ విడుదల చేస్తామని తెలిపారు. మే 29న ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. జూన్ 10న లాసెట్ ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు.

**22న పీజీలాసెట్ నోటిఫికేషన్**

ఈనెల 22న పీజీలాసెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మే 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దరఖాస్తుల సమర్పణకు తుదిగడువు వచ్చేనెల 25వ తేదీ వరకు అవకాశముందని తెలిపారు. దరఖాస్తు ఫీజు ఎస్సీ,ఎస్టీలకు రూ.600, ఇతరులకు రూ.1000 ఉందని పేర్కొన్నారు.

# 'ఇంటిగుట్టు'పై సర్కార్ సీరియస్

- విచారణకు ఆదేశించిన డిప్యూటీసీఎం కడియం
- విచారణాధికారిగా విజయలక్ష్మిబాయిని నియమించిన కమిషనర్

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌ల్లో అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. సమగ్ర విచారణ జరిపి వెంటనే నివేదిక సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్‌ను డిప్యూటీసీఎం కడియం శ్రీహరి ఆదేశించారు. డీఈఓలు ఫీల్డ్ విజిట్ చేయకుండా నిధుల మంజూరు చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇంటిగుట్టు' శీర్షికతో నవతెలంగాణ సోమవారం ప్రత్యేక కథనంతో ఈ అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కాగా ఈ అక్రమాలపై విచారణాధికారిగా హైదరాబాద్ ఆర్‌జేడీ విజయలక్ష్మిబాయిని కమిషనర్ కిషన్ నియమించారు. సాధ్యమైనంత త్వరగా నివేదిక అందించాలని కోరారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ డీఈఓ వెంకటనర్సమ్మ ఈ ఘటనకు సంబంధించిన ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. వాస్తవంగా ఇండ్లులేని ఉద్యోగులు ఎంతమంది..? తప్పుడు పత్రాలతో హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌లో తీసుకున్న వారు ఎందరు.? అడ్వాన్సులు పొందిన వారిలో స్థలాలు కొనుగోలు చేసి, ఇండ్లు నిర్మించింది, మార్ట్‌గేజ్ చేయించింది ఎంతమంది..? తదితర వివరాలను సేకరిస్తున్నారు. కాగా హైదరాబాద్ డీఈఓ ఇచ్చిన నివేదికలో అక్రమాలు నిజమేనని ధృవీకరించినట్టు సమాచారం. హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌లకు సంబంధించిన ఫైల్స్‌ను ఇప్పటికే ఆమె సీజ్ చేశారు. కాగా ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ 'నవతెలంగాణ'తో తెలిపారు. దీనివెనుక ఎంత పెద్దవారున్న వదిలి పెట్టబోమని స్పష్టం చేశారు.

**విద్యాశాఖలో హల్‌చల్...**

పాఠశాల విద్యాశాఖలో 'ఇంటిగుట్టు' కథనం ప్రకంపనలు సృష్టించింది. హైదరాబాద్ డీఈఓ ఆఫీస్‌తో పాటు ఆర్‌జేడీ, విద్యాశాఖ డైరెక్టరేట్, సచివాలయం విద్యాశాఖ విభాగంలో హౌసింగ్ అడ్వాన్స్‌లపై సర్వత్ర చర్చ జరిగింది. సోషల్‌మీడియాలోనూ నవతెలంగాణ కథనాలు హల్‌చల్ చేశాయి. అయితే అడ్వాన్స్‌లు పొందిన ఉద్యోగులు మల్లగుల్లాలు పడుతున్నారు. డీఈఓ ఆఫీస్‌లో పనిచేసే ఒకరిద్దరు ఉద్యోగులతో పాటు డైరెక్టరేట్ పరిధిలో పనిచేసే ఓ అధికారిపై తీవ్రంగా మండిపడుతున్నారు. కాగా ఈ ఘటనపై ఒకట్రెండు రోజుల్లో డీఈఓ ఆఫీస్‌లో పనిచేసే ఇద్దరు ఉద్యోగులపై వేటు పడే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఆర్థిక పరమైన అంశం నేపథ్యంలో అక్రమాలు నిజమని తేలితే అవసరమైతే సర్వీస్ నుంచి తొలగించే అవకాశాలూ లేకపోలేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఈ ఘటనతో సంబంధమున్న ఇద్దరు ఉన్నతాధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశముంది. అయితే డీఈఓ ఆఫీస్‌లో పనిచేసే 75 మందికి ఈ ఘటనతో సంబంధం ఉండటంతో ఒకేసారి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధికారుల్లోనూ అంతర్మథనం మొదలైంది.


# ఖాట్మండ్ ఎయిర్‌పోర్ట్‌లో కూలిన విమానం

- 50 మంది మృతి, 12 మందికి గాయాలు

**ఖాట్మండ్ :** నేపాల్ రాజధాని ఖాట్మండ్ విమానాశ్రయంలో సోమవారం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఢాకా నుంచి అమెరికాకు బయలుదేరిన బంగ్లాదేశ్‌కు చెందిన బీఎస్-211 విమానం ఖాట్మండ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 50 మంది ప్రయాణికులు మృతిచెందారు. మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరో తొమ్మిది మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. విమానంలో నేపాల్‌కు చెందిన 33 మంది, బంగ్లాదేశ్‌కు చెందిన 32 మంది, ఒకరు చైనా, మరొకరు మాల్దీవ్‌కు చెందిన పౌరులు ప్రయాణించినట్టు అధికారులు ధ్రువీకరించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ఢాకా విమానాశ్రయం నుంచి నేపాల్‌కు వచ్చిన బీఎస్-211 విమానం త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ అయ్యే క్రమంలో ఒక్కసారిగా నిలకడ కోల్పోయి క్రాష్‌ల్యాండ్ అయింది. దీంతో, విమానం నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించాయి. విమానం క్రాష్‌ల్యాండ్ కావడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న నేపాల్ ఆర్మీ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. అగ్నిమాపక బృందాలు విమానంలో ఎగిసిపడ్డ మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్నాయి. విమాన శకలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్టు నేపాల్ ఆర్మీ పేర్కొన్నది. విమానం బయలుదేరిన సమయంలో నలుగురు సిబ్బంది, 67మంది ప్రయాణికులు సహా మొత్తం 71మంది విమానంలో ఉన్నారు. ప్రస్తుతం ప్రమాదానికి గురైన విమానం అమెరికా, బంగ్లాదేశీ జాయింట్ వెంచర్ అయిన యూఎస్-బంగ్లా గ్రూపునకు చెందినది. 2014, జులైలో ఈ బంగ్లాదేశీ సంస్థ కార్యకలాపాలను ప్రారంభించింది. బాంబార్డియర్, బోయింగ్ విమానాలను ఈ సంస్థ నడుపుతోంది. ఇప్పుడు ప్రమాదానికి గురైంది బాంబార్డియర్ డాష్ 8 క్యూ400 విమానం. దీన్ని ప్రపంచంలోనే అత్యంత అధునాతన టర్బోప్రాప్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలుస్తారు. ఈ ఘటనపై నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనాస్థలిలో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా, నేపాల్‌లో విమాన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. 2016లో నేపాల్‌లోని పర్వతాల్లో ట్విన్ ఆటర్ టర్బోప్రాప్ ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోయింది. ఈ ఘటనలో 23 మంది మృతి చెందారు. రెండు రోజుల క్రితం ఓ చిన్న పాసింజర్ విమానం క్రాష్ ల్యాండింగ్ కావడంతో ఇద్దరు పైలట్లు మరణించారు.



## క్రోనిజం స్కాంలో... జపాన్ ప్రధాని భార్యపై ఆరోపణలు



అకీ

**టోక్యో :** జపాన్‌లో జరిగిన క్రోనిజం భారీ కుంభకోణంలో ప్రధాని షింజో అబే భార్య అకీపై ఆరోపణలు వచ్చాయి. అయితే, ఆమెను ఉద్దేశ పూర్వకంగా తప్పించేందుకు ప్రధాని ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాని, ఆర్థికశాఖ ఒత్తిడి మేరకు ఆయన భార్యను కుంభకోణానికి పాల్పడిన వ్యక్తుల జాబితా నుంచి తొలగించినట్టు ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. కేవలం ప్రధాని స్థాయి వ్యక్తి కాబట్టే తన భార్యకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ఎవరికీ అనుమానం రాకుండా తప్పించారని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వానికి చెందిన భూమిని మోరిటోమో గాకువెన్ ఓ విద్యాసంస్థ యజమానికి పెద్ద మొత్తంలో డిస్కౌంట్‌కు కట్టబెట్టారని, ఆ స్కూల్ యజమానితో అబే భార్య ఒప్పందాలు చేసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు పెద్ద మొత్తంలో ప్రభుత్వానికి నష్టం వచ్చిందని, అదొక పెద్ద కుంభకోణం అంటూ దానికి పాల్పడిన వ్యక్తుల జాబితాను రూపొందించారు. తొలుత అందులో అబే భార్య పేరు ఉన్నప్పటికీ తాజాగా విచారణ బృందం చేతికి వెళ్లే సమయంలో ఆమె పేరును మాయం చేశారు. దీనిపై అబే కూడా స్పందిస్తూ తనకు గానీ, తన భార్యకు గానీ ఆ స్కూల్ యాజమాన్యానికి ఎలాంటి సంబంధం లేదని, ఒక వేళ నిజంగానే సంబంధాలు ఉన్నట్టు గుర్తిస్తే కచ్చితంగా తాను రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.

## సౌర కుటుంబం వెలుపల సూపర్ ఎర్త్ : శాస్త్రవేత్తలు

**టోక్యో :** శాస్త్రవేత్తలు కొత్తగా మరో 15 గ్రహాలను కనుగొన్నారు. సౌరకుటుంబం బయట ఉన్న ఈ గ్రహాల్లో ఓ సూపర్ ఎర్త్ కూడా ఉంది. దీనిపై జీవం ఉండే అవకాశం కూడా ఉంది. సౌరకుటుంబానికి దగ్గర్లోనే కొన్ని చిన్న, చల్లటి నక్షత్రాల చుట్టూ ఇవి తిరుగుతున్నట్టు గుర్తించారు. వీటిని ఎరుపు మరగుజ్జులుగా పిలుస్తున్నారు. విశ్వం ఏర్పాటుకు సంబంధించిన అధ్యయనాలకు ఇవి తోడ్పడనున్నాయని శాస్త్రవేత్తల బృందానికి సారథ్యం వహిస్తున్న టోక్యో ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ తెరుయుకి హిరానో వెల్లడించారు. కే2-155 అనే ఈ ఎరుపు మరగుజ్జు నక్షత్రం మనకు 200 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీని చుట్టూ భూమిని పోలిన మూడు సూపర్ ఎర్త్స్ తిరుగుతున్నాయి. ఇవి మన భూమి కంటే కాస్త పెద్ద పరిమాణంలో ఉన్నట్టు గుర్తించారు. ఇందులో బయట ఉన్న కే2-155డీ అనే గ్రహం జీవం మనుగడకు అనుకూలంగా ఉన్నట్టు హిరానో తెలిపారు. ఈ అధ్యయనాన్ని ది ఆస్ట్రోనామికల్ జర్నల్‌లో ప్రచురించారు. ఈ కే2-155డీపై ద్రవరూపంలో నీళ్లు ఉండే అవకాశం ఉన్నట్టు శాస్త్రవేత్తల అంచనా. నాసాకు చెందిన కెప్లెర్ స్పేస్‌క్రాఫ్ట్‌తోపాటు భూమిపై ఉన్న పలు టెలిస్కోపుల సాయంతో ఈ గ్రహాలపై అధ్యయనం జరుపుతున్నారు. ఈ కే2-155డీ వ్యాసం భూమి కంటే 1.6 రెట్లు పెద్దగా ఉంది.

## ఇరాన్‌లో కూలిన టర్కీ విమానం :11 మంది మృతి

**టెహ్రాన్:** టర్కీ ప్రయివేటు జెట్ విమానం ఇరాన్‌లో కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 11 మంది మృతి చెందారు. మృతుల్లో పైలట్ కూడా ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...షార్జా నుంచి టర్కీలోని ఇస్తాంబుల్ నగరానికి బయలుదేరిన జెట్ విమానం జాగ్రస్ పర్వతాల్లో కూలిపోయింది. విమానం పర్వతాన్ని ఢీకొనడంతో మంటల్లో పేలిపోయిందని దేశ అత్యవసర సేవల విభాగం వెల్లడించినట్టు ఇరాన్ స్టేట్ మీడియా ఇర్నా ప్రకటించింది. విమాన ప్రమాదం సమాచారం అందుకున్న ప్రత్యేక బృందాలు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. విమానం టర్కీకి చెందిన బిజినెస్ టైకూన్ బసరన్ హోల్డింగ్‌ది. టర్కీలో ఆయనకు నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్, ఎనర్జీ, ఫైనాన్స్‌కి చెందిన వ్యాపారాలు ఉన్నాయి. వీటన్నింటికీ బసరన్ కుమార్తె మినా బసరన్(28) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా వ్యవహరిస్తున్నారు.

**నెల రోజుల్లో వివాహం..ఇంతలోనే విషాదం...**

మరో నెల రోజుల్లో మినా వివాహం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకోవడానికి విమానంలో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విమానానికి రాడార్ నుంచి సంబంధాలు తెగిపోవడంతో ప్రమాదాన్ని ముందే ఊహించి తక్కువ ఎత్తులో విమానాన్ని నడపాల్సిందిగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పైలట్‌ను హెచ్చరించింది. మెలికే కువ్వెట్ అనే మహిళ విమాన కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె టర్కీలోని తొలి మహిళా పైలెట్లలో ఒకరు. పదవీ విరమణ పొందాక ప్రయివేట్ జెట్‌లకు ఆమె కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు.



విమానం ఎక్కినప్పుడు దిగిన ఫొటోలతో పాటు తనకు కాబోయే భర్తతో కలిసి దిగిన ఫొటోలను మినా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. కాగా, విమానం కూలిన షెహ్రె కోర్డ్ ప్రాంతం టెహ్రాన్ నుంచి 370 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

## న్యూయార్క్‌లో హెలికాప్టర్ ప్రమాదం

- ఐదుగురు మృతి, ఒకరికి గాయాలు

**న్యూయార్క్ :** న్యూయార్క్ నగరంలో ఓ హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు. ఫెడరల్ ఏవియేషన్ సంస్థకు చెందిన అధికార ప్రతినిధి ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. యూరో హెలికాప్టర్ (ఎఎస్ 350) తూర్పు నదిలో సోమవారం కూలిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదం ఎందుకు సంభవించిందనే విషయమై జాతీయ రవాణా భద్రత సంస్థ విచారణ చేపట్టింది. ఘటనాస్థలిలో అధికారులు సహయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబాలకు న్యూయార్క్ ఫైర్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ డేనియల్ నీగ్రో ప్రగాఢ సానుభూతి తెలిపారు. హెలికాప్టర్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా కూలిపోయి ఉంటుందని అనుమానిస్తున్నామని అన్నారు. ఈ ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించామని అన్నారు.

# పోలీసులతో మా గొంతునొక్కారు

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన టీఆర్ఎస్

- నిరుద్యోగ సమస్యపై సర్కారు నిర్లక్ష్యం
- రైతు ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే : గవర్నర్ ప్రసంగంపై ఉత్తమ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో అసెంబ్లీ లోపల పెద్దఎత్తున పోలీసులను మోహరించారని, తమ గొంతు నొక్కారని కాంగ్రెస్ శాసనసభ్యులు, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. తాము 13 మంది సభ్యులం ఉంటే, పోలీసులు 50 మందికిపైగా ఉన్నారని చెప్పారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కాంగ్రెస్ శాసనసభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ తమపైకి పోలీసులను ఎగదోసి ప్రజాస్వామ్య హక్కులను కాలరాసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపేందుకు అవకాశం ఇవ్వకుండా పోలీసులు గిచ్చడం, గిల్లడం, తోయడం, వేధించడం, కింద పడేయం చేశారని చెప్పారు. పార్లమెంటులో నిరసన తెలిపే హక్కుందని, తెలంగాణ అసెంబ్లీలో ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం ఖూనీ చేసిందని అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కేసీఆర్ సర్కారుకు ఇదే ఆఖరి బడ్జెట్ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారని చెప్పారు. గవర్నర్ ప్రసంగంలో ప్రాధాన్యతాంశాలను ప్రస్తావించలేదని, ఉన్నా అబద్ధాలే చెప్పారని అన్నారు. ముస్లిం, గిరిజనులు, ఎస్సీ వర్గీకరణపై నోరుమెదపలేదని చెప్పారు. నిరుద్యోగ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా ఉందన్నారు. దళితులకు మూడెకరాల భూమి గురించి ఎక్కడా లేదని అన్నారు. వ్యవసాయాన్ని కాంగ్రెస్ నాశనం చేసినట్టు, టీఆర్ఎస్ ఉద్ధరించినట్టు ప్రసంగించారని చెప్పారు. తెలంగాణలో 4 వేల మంది రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. రుణమాఫీ వడ్డీ భారమంతా చెల్లిస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఇవ్వ లేదన్నారు. 35 లక్షల మంది రుణమాఫీ చేశామని చెప్తున్న టీఆర్ఎస్ 35 మందికైనా పాస్‌పుస్తకాలు ఇచ్చారా?అని ప్రశ్నించారు. 60 ఏండ్లలో రూ.69 వేల కోట్ల అప్పు చేస్తే, నాలుగేండ్లలో రూ.1.40 లక్షల కోట్ల అప్పు చేశారని అన్నారు. కమీషన్ల కోసమే అప్పు తెస్తున్నారని, ప్రాజెక్టులు రీడిజైనింగ్ చేస్తున్నారని విమర్శించారు. 5,500 చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయని చెప్పారు.



మాట్లాడుతున్న ఉత్తమ్

**చప్పగా ఉంది : చిన్నారెడ్డి**

గవర్నర్ ప్రసంగం చప్పగా ఉందని కాంగ్రెస్ సభ్యుడు జి చిన్నారెడ్డి అన్నారు. తక్కువ సమయంలో గవర్నర్ ప్రసంగం తన 20 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3,500 కోట్ల గురించి ఒక్క మాట చెప్పలేదని అన్నారు. 1.25 లక్షల ఉద్యోగుల సమస్య అయిన సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్ విధానం కొనసాగింపుపై మాట్లాడలేదన్నారు. బీసీ సబ్‌ప్లాన్ తెస్తామని, ఆ ఊసే లేదని చెప్పారు.

**అసెంబ్లీని గాంధీభవన్‌లా మార్చారు : కర్నె ప్రభాకర్**

గవర్నర్ మాట్లాడుతుండగా కాంగ్రెస్ సహజత్వానికి భిన్నంగా ఏమీ వ్యవహరించలేదని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీని గాంధీభవన్‌లా మార్చారని ఎద్దేవా చేశారు. గవర్నర్‌పై పేపర్లు విసరడం దురదృష్టకరమని అన్నారు.

**అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ దాదాగిరీ : శ్రీనివాస్‌గౌడ్**

ఇది బీహార్ అసెంబ్లీ కాదని, తెలంగాణ అసెంబ్లీ అని కాంగ్రెస్ గుర్తించాలని టీఆర్ఎస్ ఎమ్మెల్యే వి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సభ్యులు దాదాగిరీ చేస్తారా? సిగ్గుండాలని విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వానికి డబ్బా కొట్టిన గవర్నర్ : ఆర్ కృష్ణయ్య**

గవర్నర్ ప్రసంగం ప్రభుత్వానికి డబ్బా కొట్టినట్టుగా ఉందని ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య అన్నారు. తెల్లకాగితంపై ప్రభుత్వం రాసిచ్చింది చదివినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ సమస్య తాండవిస్తున్నా, 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీకి ప్రత్యేక చర్యల్లేవని విమర్శించారు. బీసీలకు మరో 500 గురుకులాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ లేకుండా, ధర్నాలు, సభలు నిర్వహించకుండా అణచివేస్తే, శాంతిభద్రతలు బాగున్నట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. చలో రాజ్‌భవన్ కార్యక్రమం చేపడితే తెలుస్తుందన్నారు.

**ధర్నాచౌక్ ఎత్తేసిన కేసీఆర్‌కు ఢిల్లీలో ధర్నా చేసే హక్కుందా? : సండ్ర**

ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ ఎత్తేసిన సీఎం కేసీఆర్‌కు ఢిల్లీలో ధర్నా చేసే హక్కు ఎక్కడుందని టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రశ్నించారు. కేసీఆర్ ద్వంద్వ వైఖరికి ఇదే నిదర్శనమని ఎద్దేవా చేశారు. దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, అమరుల కుటుంబాలకు రక్షణ వంటి అంశాలేవీ గవర్నర్ ప్రసంగంలో లేవని చెప్పారు. సంక్షేమ రంగాన్ని విస్మరించిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ గురించి పేర్కొనలేదన్నారు.

**కాంగ్రెస్ దాడి బ్లాక్ డే : కొండా సురేఖ**


గవర్నర్, మండలి చైర్మెన్‌పై కాంగ్రెస్ సభ్యుల దాడి శోచనీయమని టీఆర్ఎస్ ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ నీచరాజకీయాలు చేయొద్దని కోరారు. గవర్నర్ ప్రసంగంలో తప్పుంటే సభలో ఎండగట్టాలని సూచించారు.

**మహారాష్ట్ర తరహాలో చర్యలు తీసుకోవాలి : జీవన్‌రెడ్డి**

మహారాష్ట్ర తరహాలో గవర్నర్ ప్రసంగం సమయంలో దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

బస్సుయాత్ర తుస్సు కావడం వల్లే అసహనంతో దాడి చేశారని చెప్పారు. దాడి చేసిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు.

### హరీశ్‌రావు గవర్నర్ గల్లా పట్టుకోలేదా? : కోమటిరెడ్డి




ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ ప్రసంగం సమయంలో హరీశ్‌రావు గవర్నర్ గల్లా పట్టుకోలేదా?అని కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హరీశ్‌రావుపై నాడు ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. గవర్నర్‌ను కొట్టిన వ్యక్తులే తమకు నీతులు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. నిరసన తెలిపేందుకు పోడియం వద్దకు వెళ్లామని ప్రయత్నించామని, పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. తన కాలుకు గాయమైందని అన్నారు. కేసీఆర్ నియంత పాలన చేస్తున్నారని విమర్శించారు. పోయేకాలం దగ్గర పడిందని, ఓడిపోతామనే భయంతోనే పోలీసులతో సభను నడిపిస్తున్నారని చెప్పారు. గవర్నర్ ప్రసంగంలో అన్నీ మోసాలేనని, కొత్తదనం ఏమీ లేదన్నారు.

# స్పీకర్‌దే తుది నిర్ణయం

## అసెంబ్లీ ఘటనపై జానారెడ్డి

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

అసెంబ్లీలో జరిగిన సంఘటన స్పీకర్ పరిధిలోకి వస్తోందని, దానిపై విచారించి తుది నిర్ణయం తీసుకునే హక్కు ఆయనకే ఉంటుందని ప్రతిపక్ష నేత జానారెడ్డి చెప్పారు. ఎవరేం చెప్పినా, ఒకరిపై విమర్శలు చేసుకున్నా...సీసీ ఫుటేజి పరిశీలించి దాని ప్రకారమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు మల్లు భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంలో ఈ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీలను ప్రస్తావించలేదన్నారు. సభ్యులను పోలీసులు, మార్షల్స్ నెట్టివేయడంతో ఈ సంఘటన జరిగినట్టు తెలిపారు. ఈ తోపులాటలో నేను నిల్చున్న టేబుల్ విరిగి నాపైన పడిందన్నారు. కాంగ్రెస్ సభ్యులు మద్యం తాగి వచ్చారని ఆరోపించడం చాలా బాధాకరమన్నారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ సభ్యులు పార్లమెంటులో పేపర్లు చించారని తెలిపారు. అసెంబ్లీలో జరిగిన సంఘటనపై ఏం చర్యలు తీసుకున్నా రాజకీయంగా కాకుండా డెమొక్రటిక్ విధానంతో చర్య తీసుకోవాలని సూచించారు. గవర్నర్ ప్రసంగంలో పేదవర్గాలకు ఇచ్చిన హామీలను మరిచారని మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. దీనికి వ్యతిరేకంగానే కాంగ్రెస్ సభ్యులు తమ నిరసన తెలిపారన్నారు. ప్రజల సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ సంఘటనను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం కుట్రపూరితంగా సభ నుంచి తమను బయటకు పంపించాలని ప్రయత్నిస్తోందన్నారు. గతంలో టీఆర్ఎస్ సభ్యులు టేబుల్ ఎక్కి స్పీకర్‌పై దాడి చేశారని గుర్తు చేశారు. ఆ రోజు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. స్పీకర్ ప్రసంగం ముగిసిన తర్వాత గవర్నర్‌కు ఎస్కార్టుగా స్వామిగౌడ్ తీసుకెళ్లారని, ఆ సమయంలో ఆయన ఎంతో ఉషారుగా ఉన్నారని, ఆయన కంటికి గాయమైనట్టు లేదని, వీడియోలో కూడా ఎక్కడా కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కావాలనే కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయాలని కుట్ర చేస్తుందన్నారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడే మాటల్లో విశ్వసనీయత లేదన్నారు. ఈ రోజు సభలో జరిగిన సంఘటనకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, ఈ సభకు గవర్నర్ ఆలస్యంగా ఎందుకు వచ్చారని ఆయన నిలదీశారు.



## ఆల్కహాల్ పరీక్షలకు వస్తారా?

- కేసీఆర్ సహా టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులంతా రావాలి: పల్లాకు కోమటిరెడ్డి సవాల్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సీఎం కేసీఆర్ సహా, టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులంతా ఆల్కహాల్ పరీక్షలకు హాజరవుతారా?అని పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాల్ విసిరారు. పరీక్షలు చేయిస్తే ఎవరి శరీరంలో ఎంత ఆల్కహాల్ ఉందో తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ సభ్యులు మద్యం తాగి దాడి చేశారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై కోమటిరెడ్డి స్పందిస్తూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీకి అనర్హుడని అన్నారు. పనికిమాలిన మాటలు మాట్లాడ్డానికి సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. సీఎం కేసీఆర్‌ను పక్కన పెట్టుకొని మద్యం తాగడం గురించి మాట్లాడ్డం సిగ్గుచేటని అన్నారు. రాత్రి పది గంటల వరకే ఉన్న మద్యం దుకాణాలను రాత్రి 11 గంటల వరకు అమ్మేందుకు అనుమతి ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని తాగుడుమయం చేశారని విమర్శించారు.

# నవచిత్రం

## దర్శకేంద్రుడి ఆధ్యాత్మిక చిత్రం..



కె.రాఘవేంద్రరావు, వెంకటేష్, సునీల్

వెంకటేష్, కె.రాఘవేంద్రరావు కాంబినేషన్ అనగానే 'కలియుగ పాండవులు', 'భారతంలో అర్జునుడు', 'కూలీ నెంబర్ వన్, 'సాహస వీరుడు సాగర కన్య', 'సుభాష్ చంద్రబోస్' వంటి విశేష ఆదరణ పొందిన చిత్రాలు గుర్తొస్తాయి. వెంకటేష్‌ను హీరోగా పరిచయం (కలియుగ పాండవులు) చేసింది కూడా రాఘవేంద్రరావే. తాజాగా ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఓ ఆధ్యాత్మిక చిత్రాన్ని తెరకెక్కనున్నట్టు సమాచారం. ఇందులో సునీల్ ఓ ప్రధాన పాత్రలో నటించబోతున్నారట. అన్ని కుదిరితే వచ్చే ఏడాది ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్ళనుందట. వెంకటేష్ ప్రస్తుతం తేజ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. దీని తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా, త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించనున్నారు.

## ఉగాది నుంచి రెగ్యులర్ షూటింగ్..



నాగార్జున



నాని

నాగార్జున, నాని హీరోలుగా టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో వైజయంతి మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ఉగాది నుంచి ప్రారంభం కానుంది. ఆ విశేషాల గురించి సి.అశ్వనీదత్ మాట్లాడుతూ, 'మా వైజయంతి బ్యానర్‌లో మణిశర్మ చేసిన సినిమాలన్నీ మ్యూజికల్‌గా పెద్ద హిట్స్ అయ్యాయి. ఈ సినిమాని కూడా మ్యూజికల్‌గా పెద్ద హిట్ చేయాలని దృష్టిపెట్టారు. ప్రస్తుతం అమెరికాలో ఈ సినిమాలోని సాంగ్స్‌ని మణిశర్మ కంపోజ్ చేస్తున్నారు. మూడు పాటలకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ అక్కడ జరుగుతున్నాయి. మార్చి 18 ఉగాది రోజు నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తున్నాం. మా బ్యానర్‌లో ఎన్నో మల్టీస్టారర్స్ చేశాం. అవన్నీ కమర్షియల్‌గా ఘన విజయాల్ని అందుకున్నాయి. ఇప్పుడు నాగార్జున, నాని కాంబినేషన్‌లో చేస్తున్న మల్టీస్టారర్ కూడా బిగ్గెస్ట్ హిట్టై మా బేనర్‌కి మరింత మంచి పేరు తెస్తుంది' అని అన్నారు. 'ఆద్యంతం వినోదాత్మకంగా సాగే డిఫరెంట్ సబ్జెక్ట్ ఇది. నాగార్జున, నాని వంటి హీరోలతో వైజయంతి బ్యానర్‌లో ఈ మల్టీస్టారర్ చేయడం చాలా ఆనందంగా ఉంది' దర్శకుడు చెప్పారు.



కాదంబరి కిరణ్, అనూజ, వి.వి.వినాయక్, సి.కళ్యాణ్, జి.నాగేశ్వరరెడ్డి తదితరులు

## మానవత్వాన్ని చాటే గొప్ప కార్యక్రమం : వినాయక్

'మనం సైతం గొప్ప కార్యక్రమం. ఇలాంటి సంస్థల్లో రాజకీయాలు చేరకుండా దీన్నొక గొప్ప సంస్థగా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నా. నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి' అని వి.వి.వినాయక్ అన్నారు. కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'మనంసైతం' సంస్థ ద్వారా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న డ్రైవర్ యూనియన్ రాజు, లైట్‌మెన్ కూతురు అనూజ, నటుడు థమ్ తనయుడు బాబు, దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న ఉదయ్ కాంత్ తదితర పది మందికి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వినాయక్ అతిథిగా పాల్గొని, తన వంతుగా లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మనం సైతం సేవను కాదంబరి కిరణ్ తన జీవితంలో భాగం చేసుకున్నారు. కష్టాల్లో ఉన్న వాళ్ళ గురించి మాట్లాడుతుంటే ఆయన కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. అంతగా ఇతరుల బాధను పంచుకోవడం అద్భుతం. మాకు వేసే దండలు, శాలువాలకు బదులు ఆ మనీని కూడా పేదల సేవకు ఉపయోగించండి' అని అన్నారు. 'ఇప్పుడు లక్ష మందికి చేరుకున్న ఈ సంస్థ ముమ్మందు కోటి మందికి చేరాలని కోరుకుంటున్నా. కోటిలో పదిశాతం మంది స్పందించినా పది లక్షల రూపాయలవుతాయి. మనం ఘనంగా పుట్టిన రోజులు జరుపుకుంటాం. ఆ ఖర్చులో పదిశాతం మనం సైతంకు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా. నిర్మాతలుగా మేం హీరోల, దర్శకుల పుట్టిన రోజులకు వేసే ప్రకటనల్లో కొన్ని సెంటిమీటర్లు తగ్గించి ఆ సొమ్ముని ఈ సంస్థకిస్తే బాగుంటుంది. ఇది దేశ వ్యాప్తంగా విస్తరించాలి' అని సి.కళ్యాణ్ తెలిపారు. దర్శకుడు జి.నాగేశ్వర్‌రెడ్డి చెబుతూ, 'నా వంతుగా ఏడాదికి పాతిక వేల రూపాయలు అందిస్తాను' అని చెప్పారు. కాదంబరి కిరణ్ మాట్లాడుతూ, 'చిత్ర పరిశ్రమలో నాకు కష్టాలున్నాయని ఎవరూ చెప్పుకోరు. అలా చెప్పుకుంటే అవకాశాలివ్వరనే అపోహ ఉంది. నేను నా జీవితంలోని కష్టాలను పరిశ్రమలోని వాళ్ళతో పంచుకున్నా. వాళ్ళు నన్ను దూరం పెట్టకుండా ఆదరించారు. అప్పుడే ఈ భావన తప్పని అర్థమైంది. మనకున్న బాధలను చెప్పుకోవడంలో తప్పులేదు. మనం సైతం ఇంతింతై విస్తరిస్తోంది. సేవాభావం కలిగిన వాళ్ళు, చిరంజీవితో సహా పెద్దలంతా మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వినాయక్, కళ్యాణ్‌కి థ్యాంక్స్' అని చెప్పారు.

## ఊళ్లో పెళ్ళికి కుక్కల హడావుడి..



సాక్షి చౌదరి, రాజేంద్రప్రసాద్

రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రధారిగా, సాక్షి చౌదరి కథానాయికగా 'నిధి' ప్రసాద్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఊ.పె.కు.హ' (ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి). జెబి క్రియేషన్స్ పతాకంపై భాగ్యలక్ష్మి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం సమకూర్చారు. ఈ చిత్ర ఆడియో లాంచ్ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. బిగ్ సీడీని జెమినీ కిరణ్, పాటల సీడీని రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, 'నేను రాజ్, కోటితో కలిసి పనిచేసేటప్పుడు దిలీప్ అనే కీబోర్డ్ ప్లేయర్ ఉండేవారు. ఆయన ఇప్పుడు ఏ.ఆర్.రెహ్మాన్ అయ్యారు. అలాగే ఇప్పుడు అనూప్ కూడా కీబోర్డ్ ప్లేయర్‌ని అని చెప్పుకుంటుంటే ఆనందంగా ఉంది. అర్బన్ కామెడీ చిత్రమిది. నిధి ప్రసాద్ చక్కగా తీశారు. నేను 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'నాన్నకు ప్రేమతో', 'శ్రీమంతుడు' చిత్రాలను ఎలా అయితే చేశానో, ఈ సినిమాను కూడా అలాగే చేశాను. ఇన్నేండ్ల కెరీర్‌లో ఎంత సంపాదించామన్నది ముఖ్యంగా కాదు, ఎన్ని మంచి సినిమాలున్నాయనేది ముఖ్యం. వాటిలో ఇదొక్కటి అవుతుంది. వేడిలో రిలీజ్ అయ్యే చల్లని చిత్రమిది' అని అన్నారు. "నిధి' ప్రసాద్ దగ్గర కీబోర్డ్ ప్లేయర్‌గా పనిచేశా. ఆయనతో ఉన్న స్నేహంతో ఈ సినిమా చేశా. సినిమా హిట్ అయి నిధి ప్రసాద్ మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నా' అని అనూప్ రూబెన్స్ తెలిపారు. దర్శకుడు 'నిధి' ప్రసాద్ చెబుతూ, 'అనూప్ రూబెన్స్ పెద్ద సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ నేను అడగ్గానే ఈచిత్రానికి మంచి సంగీతం అందించారు. పెద్ద మ్యూజిక్ డైరెక్టర్ కావడంతో ఆలస్యమవుతుందనుకున్నా, కానీ అనుకున్న టైమ్ కంటే ముందే ఇచ్చారు. ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కించిన ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని నమ్ముతున్నా. త్వరలోనే విడుదల చేయనున్నాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాక్షి చౌదరి, రిషి, ఖయ్యూమ్, సాయి, భాగ్యలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.



పూజా హెగ్డే

## అలాంటి కథ కోసం వెయిటింగ్..



అనిల్ సుంకర

"శివ' లాంటి సినిమా చేయాలనేది నా లక్ష్యం. అలాంటి ఎలిమెంట్స్ 'కిరిక్ పార్టీ'లో ఉన్నాయి. ఈ కన్నడ సినిమా నచ్చడంతో తెలుగులో రీమేక్ చేశాం' అని అంటున్నారు నిర్మాత అనిల్ సుంకర. నిఖిల్ హీరోగా, శరన్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. కన్నడ 'కిరిక్‌పార్టీ' చిత్రానికి రీమేక్. ఈ నెల 16న సినిమా విడుదల కానుంది.

ఈ సందర్భంగా సోమవారం అనిల్ సుంకర మీడియాతో మాట్లాడుతూ, 'కాలేజ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. 'శివ', 'హ్యాపీడేస్' తరహాలో ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థుల లైఫ్‌ను ప్రతిబింబించేలా ఉంటుంది. 'హ్యాపీ డేస్' చిత్ర కథలోని మరో కోణాన్ని ఆవిష్కరించే చిత్రమవుతుంది. శరణ్ బాగా తెరకెక్కించారు. సినిమాపై నమ్మకంతో ఉన్నాం. ఒరిజినల్ రన్ టైమ్‌కు 20 నిమిషాలు తగ్గించి ఫాస్ట్‌గా సాగేలా చేశాం. సినిమాలో 9పాటలుంటాయి. మ్యూజికల్‌గా ఆకట్టుకునే చిత్రమిది. చివరి 20 నిమిషాలు ఎమోషనల్‌గా ఆకట్టుకుంటుంది. ఏదైన నా సినిమా హిట్ అయితే హ్యాపీ, లేదంటే విడుదల రోజే అమెరికా వెళ్ళిపోతుంటాను. నటిస్తూ సక్సెస్‌మీట్‌లకు హాజరుకావడం నాకిష్టం ఉండదు. ఈ సినిమా కచ్చితంగా హిట్ అవుతుందని నమ్ముతున్నాం. నెక్ట్స్ సురేష్ ప్రొడక్షన్‌తో కలిసి నిర్మించే వెంకటేష్-తేజల సినిమా ఈ నెల 25 నుంచి ప్రారంభం కానుంది. అలాగే 'రాజుగాడు' విడుదలకు సిద్ధంగా ఉంది. 14రీల్స్‌లో మహేష్‌బాబుతో ఓ సినిమా చేయాలనుకున్నాం. కానీ ఆయనతో చేసే సినిమా కచ్చితంగా హిట్ కొట్టేదిగా ఉండాలి. అలాంటి కథ కోసం వెయిటింగ్. నేను తొలుత దర్శకత్వం వహించినప్పటికీ ఆ చిత్రాలు ఆశించిన ఫలితానివ్వలేదు. ఫెయిల్యూర్ దర్శకుడిని. కాబట్టి నిర్మాతగానే ఇష్టపడతా. దర్శకుడిగా ఓ కథ సిద్ధం చేశా. త్వరలో అన్ని చూసుకుని సినిమాను రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నా' అని అన్నారు.

## ప్రభాస్ సరసన..!

'డీజే' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసిన పూజా హెగ్డే ప్రస్తుతం టాలీవుడ్‌లో చాలా చాలా లక్కీగర్ల్. ఎందుకంటే ఆఫర్ల మీద ఆఫర్లు రావడం ఓ విశేషమైతే, ఆ ఆఫర్లు కూడా బడా హీరోల సినిమాల్లో రావడం మరో విశేషం. బాలీవుడ్‌లో ఇప్పటికే సల్మాన్‌ఖాన్ సరసన 'రేస్ 3' నటిస్తోంది. అలాగే రామ్‌చరణ్ నటిస్తున్న 'రంగస్థలం' చిత్రంలోని ఓ స్పెషల్ సాంగ్‌లో మెరవబోతోంది. ఇదంతా ఓ ఎత్తయితే, మహేష్ సరసన ఓ చిత్రంలోను, ఎన్టీఆర్‌కి జోడీగా త్రివిక్రమ్ సినిమాలోను ఇప్పటికే ఎంపికైన పూజా తాజాగా మరో బంపర్ ఆఫర్ అందుకుంది. టాలీవుడ్ స్టార్ హీరో ప్రభాస్‌కి జోడీగా సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసేందుకు రెడీ అవుతోంది. ప్రభాస్ ప్రస్తుతం సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సాహో' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా తర్వాత 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో రూపొందబోయే తెలుగు, హిందీ ద్విభాషా చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన కథానాయికగా పూజాను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రభాస్ పెదనాన్న కృష్ణంరాజు నిర్మిస్తున్నారు.

## ప్రియమణి అంగుళీక



ప్రియమణి

ప్రియమణి టైటిల్ పాత్ర పోషిస్తున్న చిత్రం 'అంగుళీక'. దీపక్ హీరోగా, ప్రేమ్ ఆర్యన్ దర్శకత్వంలో శ్రీ శంఖు చక్ర ఫిల్మ్స్ పతాకంపై కోటి తూముల, ఎ.హితేష్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను సీనియర్ దర్శకులు కోడి రామకృష్ణ ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టీజర్ చాలా బాగుంది. టీజర్ టైమింగ్, కటింగ్ చూశాక దర్శకుడు సినిమా అద్భుతంగా తీశాడని అర్థమైంది. ఈ సినిమా గురించి, కథ గురించి నాకు మొదట్నుంచి తెలుసు. నిర్మాతలు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ఇస్తూ ఉంటారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా అన్నింటినీ తట్టుకుంటూ సినిమాను నిర్మించి దర్శకుడికి అండగా నిర్మాతలు నిలిచారు. నిర్మాతలిద్దరూ సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉన్నవారు. ఈ చిత్రం ద్వారా వారికి మంచి పేరు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని అన్నారు. 'సూర్యగ్రహణం, కాలచక్రంతో కూడుకున్న కథాంశమిది. దర్శకుడు సినిమాను అత్యద్భుతంగా తెరకెక్కించారు. గ్రాఫిక్స్ వర్క్ జరుగుతోంది. సినిమా అనుకున్న దానికన్నా చాలా బాగా వచ్చింది' అని నిర్మాత కోటి తూముల తెలిపారు. మరో నిర్మాత ఎ.హితేష్‌రెడ్డి చెబుతూ, 'కథ నచ్చి భారీ బడ్జెట్‌తో, విజువల్ గ్రాండియర్‌గా తెరకెక్కించాం. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా సినిమా ఉంటుంది' అని చెప్పారు. దర్శకుడు ప్రేమ్ ఆర్యన్ చెబుతూ, 'కోడి రామకృష్ణను స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాను రూపొందించాను. కాలచక్రంతో ముడిపడిన ఇద్దరు ప్రేమికుల వీరగాథ ఇది. 'అంగుళీక' టైటిల్ పాత్రలో ప్రియమణి అద్భుతంగా నటించారు. కాలచక్రం, సూర్య గ్రహణం ఈ రెండు అంశాల చుట్టూ సినిమా తిరుగుతుంది. సూర్యగ్రహణం ఘడియల్లో విడిపోయిన ప్రేమ జంట మళ్ళీ సూర్యుడి ఆశీస్సులతో 585 ఏండ్ల తర్వాత కలుసుకుంటారు. అదే సమయంలో పగతో రగిలిపోతున్న దుష్టాత్మ ఆ జంటపై పగ తీర్చుకుందా?, ఆ ప్రేమ జంట ఆత్మలకు ఎలా మోక్షం కలిగిందనేది సినిమాకు హైలైట్' అని చెప్పారు.


## సందేశాత్మక అనువంశికత



నేహాదేశ్ పాండే, సంతోష్ రాజ్

రమేష్ ముక్కెర దర్శకత్వంలో అశ్విత, క్రాంతికుమార్ సమర్పణలో కౌండిన్య మూవీస్ పతాకంపై తాళ్లపెల్లి దామోదర్‌గౌడ్ నిర్మిస్తున్న చిత్రం 'అనువంశికత'. సంతోష్ రాజ్, నేహాదేశ్ పాండే జంటగా నటించిన ఈ చిత్రానికి 'జెనిటిక్ లవ్ స్టోరీ' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్ర ఆడియో లాంచ్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నటుడు సుమన్ మాట్లాడుతూ, 'రక్త సంబంధీకులను పెళ్లి చేసుకుంటే వచ్చే పరిణామాలు ఎలా ఉంటాయనే పాయింట్ ఆధారంగా దర్శకుడు చక్కగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. మంచి సందేశాత్మక చిత్రమిది. పాటల్లో కూడా మంచి సందేశం ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తుంది. కొన్ని సన్నివేశాలు సరిగ్గా రాలేదని మళ్ళీ రీ షూట్ చేశారు. సినిమా పట్ల దర్శక,నిర్మాతలకున్న ప్యాషన్ ఏంటో అర్థమవుతుంది. సినిమా పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'మంచి కథాంశంతో రూపొందించిన ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని నిర్మాత తాళ్లపెల్లి దామోదర్ తెలిపారు. దర్శకుడు రమేష్ ముక్కెర చెబుతూ,'నటీనటుల సహకారం, నిర్మాత సపోర్ట్‌తో సినిమాను అనుకున్న విధంగా తెరకెక్కించగలిగాం. ఆడియోతోపాటు సినిమా కూడా పెద్ద విజయం సాధిస్తుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, హీరో సంతోష్ రాజ్, నేహాదేశ్ పాండే, తైదాలబాపు, కొత్త మనోహర్ రెడ్డి, సమ్మయ్య, రాధాకృష్ణ, అనిల్, విజయలక్ష్మి, రజీయా బేగం తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షిచారు.

## సీనియర్ నటుడు వంకాయల సత్యనారాయణ కన్నుమూత



వంకాయల సత్యనారాయణ

ప్రముఖ నటుడు వంకాయల సత్యనారాయణ (78) కన్నుమూశారు. గత కొంత కాలంగా శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన సోమవారం తుది శ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. తెలుగు, తమిళం, హిందీలో దాదాపు 180కిపైగా చిత్రాల్లో నటించి మెప్పించారు. 'సీతామాలక్ష్మి', 'సూత్రధారులు', 'అత్తవారిల్లు', 'శ్రీనివాస కళ్యాణం', 'ఊరికిచ్చిన మాట', 'శుభలేఖ', 'శృతిలయలు', 'విజేత' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనదైన ముద్ర వేశారు. ఆయన నటించిన చివరి చిత్రం 'కారం దోశ'. సినిమాలతోపాటు పలు సీరియల్స్‌లోనూ నటించారు.

1940లో విశాఖపట్నంలోని చవలవారి వీధిలో జన్మించిన వంకాయల సత్యనారాయణ తొలుత క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. 1958లో కొచ్చిన్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు జరిగిన పోటీల్లో ఆలిండియా ఉత్తమ జూనియర్ క్యాడెట్‌గా నిలిచారు. ఆలిండియా ఛాలెంజ్ బోట్ రోయర్ బహుమతిని కూడా గెలుచుకున్నారు. 1960లో ఢిల్లీ రిపబ్లిక్ డే కవాతులోనూ పాల్గొన్నారు. అదే ఏడాది షూటింగ్ కాంపిటీషన్‌లో ఫస్ట్ ప్రైజ్ పొందారు. బి.కాం పూర్తి చేసిన ఆయన అందులో బంగారు పతకం సాధించారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో మంచి ఉద్యోగం ఉన్నప్పటికీ నటన పట్ల ఆసక్తితో సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. వంకాయల సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన మృతిపట్ల తెలుగు చిత్ర పరిశ్రమ ప్రగాఢ సంతాపం తెలిపింది.

## సైన్స్ ఫిక్షన్‌లో..!



అదితిరావు హైదరి

గతేడాది మణిరత్నం 'చెలియా' చిత్రంతో ఆకట్టుకున్న అదితి రావు హైదరీ మళ్లీ మణిరత్నం తెరకెక్కించే 'నవాబ్' సినిమాలో నటించే అరుదైన అవకాశాన్ని అందుకోవడం ఓ విశేషం. అంతేకాకుండా తెలుగులో సుధీర్‌బాబు సరసన 'సమ్మోహనం' చిత్రంలో నటిస్తున్న అదితీని తాజాగా మరో మంచి ఆఫర్ వరించింది. 'ఘాజి' ఫేమ్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ చిత్రంలో ఓ కథానాయికగా అదితి ఎంపికైందని సమాచారం. ఇందులో వరుణ్ తేజ్ వ్యోమగామిగా కనిపించనున్నాడు. అందుకోసం ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకుంటున్నాడట. అలాగే అదితి కూడా జీరో గ్రావిటీ ట్రైనింగ్ తీసుకోవడానికి కజకిస్థాన్ వెళ్ళనుందట. ఈ చిత్రాన్ని రాజీవ్‌రెడ్డి, దర్శకుడు క్రిష్ సంయుక్తంగా నిర్మించనున్నారు. ప్రస్తుతం 'సమ్మోహనం', 'నవాబ్'లతోపాటు బాలీవుడ్ 'దాస్ దేవ్' చిత్రంలోనూ అదితి నటిస్తోంది.

## డాలర్ కష్టాల నేపథ్యం..



తేజస్, పల్లవిడోరా

తేజస్, వంశీ కోడూరి, వైవా హర్ష, వంశీకృష్ణ, పల్లవి డోరా, సాషా సింగ్, మేఘన ప్రధాన పాత్రధారులుగా రామ్మోహన్ కొమండూరి, భానుకిరణ్ చల్లా సంయుక్త దర్శకత్వంలో రాధా మీడియా పతాకంపై స్వప్న కొమండూరి సమర్పణలో పద్మజ కొమండూరి నిర్మిస్తున్న చిత్రం 'అమీర్‌పేట్ టు అమెరికా'. ఈ చిత్ర ట్రైలర్లను తనికెళ్ళ భరణి, రవికుమార్ ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. 'అమెరికా వెళ్లే వారి లైఫ్ స్వర్గంలా అనిపిస్తుంటుంది. కానీ వాళ్ళ డాలర్ కష్టాల దుస్థితిని ఈచిత్రంలో చూపించాం. పెద్ద కాస్టింగ్‌తోపాటు ప్రముఖ మంత్రులు కూడా ఇందులో నటించారు. ఈ నెల 23న ఆడియోను, 30న సినిమాని విడుదల చేస్తాం.మంచి సబ్జెక్ట్ ఉన్న ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని నిర్మాత పద్మజ చెప్పారు.

# అడ్వాన్సు కడితేనే 'ఆరోగ్యశ్రీ'

(మొదటిపేజీ తరువాయి)

చికిత్స చేస్తూ ఖరీదైన రోగాలపై చేతులెత్తేస్తున్నాయి. ఆరోగ్యశ్రీ కింద వచ్చిన డబ్బుతోపాటు అదనపు ఫీజులు గుంజుతున్నాయి. దీంతో కార్డు ఉన్నా..అడ్వాన్సు పేరుతో నిరుపేద రోగులు ఉన్న ఆస్తులు అమ్ముకుని అప్పుల పాలవుతున్నారు. ఇలాంటి ఆస్పత్రులపై నిఘా లేకపోవడం, పథకం అమలుపై సరైన పర్యవేక్షణ లేకపోవడమనే కారణమని రోగులు విమర్శిస్తున్నారు. గిట్టుబాటయ్యే రోగాలకు మాత్రమే ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేస్తూ.. ఇతర వ్యాధులపై విముఖత చూపుతున్నాయి. ముఖ్యంగా లుకేమియా, బోన్‌మ్యారో, బ్రెయిన్ ట్యూమర్ తదితర క్యాన్సర్ వ్యాధులతోపాటు గుండెమార్పిడి, కాలేయం, కిడ్నీ మార్పిడి అవయవాల మార్పిడి వంటి ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ కింద చేసేందుకు కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు తిరస్కరిస్తున్నాయి. ఈ చికిత్సలకు ఆరోగ్యశ్రీ కింద వచ్చే నిధుల్లో తమకు పెద్దగా ఆదాయం రాదని ఇలాంటి ఆస్పత్రులు బహిరంగంగానే పేర్కొనడం గమనార్హం. మరికొన్ని దవాఖానలు మాత్రం ఆరోగ్యశ్రీతో సంబంధం లేకుండా అదనపు ఫీజు చెల్లిస్తేనే చికిత్స చేస్తామని ముందుగానే రోగి కుటుంబసభ్యులతో ఒప్పందం కుదుర్చుకుని చికిత్స చేస్తున్నాయి.


ఆరోగ్యశ్రీ పరిధిలో 938 వ్యాధులకు ప్రభుత్వం చికిత్స అందిస్తున్నది. రాష్ట్రంలో 230 మల్టీస్పెషాలిటీ, 13 కార్పొరేట్ ఆస్పత్రులతో ఆరోగ్య శ్రీ ట్రస్టు ఒప్పందం కుదుర్చుకుంది. ఆయా వ్యాధులకు చికిత్స చేయించుకుంటే

| సంవత్సరం | కేసులు | చెల్లింపులు (రూ..కోట్లలో) |
|---|---|---|
| 2014-15 | 1,96,86 | 520 |
| 2015-16 | 2,60,543 | 686 |
| 2016-17 | 2,77,199 | 715 |
| 2017-18 | 1,83,108 | 460 |

అయ్యే ఖర్చును ప్యాకేజీల ప్రకారం ట్రస్టు చెల్లిస్తుంది. రాష్ట్రంలో ఏటా రూ.700 కోట్ల వరకు వెచ్చిస్తున్నది. అందులో దాదాపు 80 శాతం ప్రయివేటు ఆస్పత్రుల ఖాతాకే వెళుతున్నది. ఆరోగ్యశ్రీ కింద తక్కువ మొత్తానికి చికిత్స చేయాల్సి రావడంతో రోగులను ప్రయివేటు ఆస్పత్రులు పీల్చుకుతుంటున్నాయి. ముఖ్యంగా అత్యవసర, శస్త్రచికిత్సల కోసం వచ్చేవారిని ముప్పుతిప్పలు పెడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందించే రోగాలకూ ముందుగానే డిపాజిట్ల పేరిట వేలకు వేలు గుంజుతున్నాయి. ఈ పథకం కింద వర్తించే శస్త్రచికిత్సలకూ పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నాయి. ఆరోగ్యశ్రీపై అవగాహన ఉన్నవారిని కూడా 'ఇది లేదు.. అది లేదు' అంటూ గందరగోళపరుస్తున్నాయి. చివరికి పథకం అధికారులకు మొరపెట్టుకున్నాక, అక్కడి నుంచి ఆదేశాలు వస్తేగానీ చికిత్స అందించకుండా మొండికేస్తున్నాయి. ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు అందించేందుకు ప్రయివేటు ఆస్పత్రులు డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి రాలేదని ట్రస్టు అధికారులు తెలిపారు. ఏ ఆస్పత్రిలోనైనా వైద్యం అందించకున్నా, అదనంగా ఫీజులు వసూలు చేసినా తమకు ఫిర్యాదు చేస్తే సంబంధిత ఆస్పత్రిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్వాహకుల నుండి ఏదైన సమస్య వస్తే ఆరోగ్య మిత్ర దృష్టి తీసుకెళ్లాలని తెలిపారు.

**రోగులతో దురుసుగా..**

ఇక కచ్చితంగా ఆరోగ్య శ్రీ కిందే చికిత్స చేయించుకోవాలనుకునే రోగులతో ప్రయివేటు ఆస్పత్రులు అనుచితంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. రోగులతో పాటు వారి బంధువులను సదరు ఆస్పత్రుల నిర్వాహకులు ఛీదరించుకోవడం, సమయానికి డాక్టర్లు చికిత్స అందించకపోవడం, దురుసుగా మాట్లాడడం లాంటి ఘటనలు ఇటీవల పెరిగిపోయాయని పలువురు 'నవతెలంగాణ'తో వాపోయారు. కోలుకోకముందే డిశ్చార్జీ చేస్తున్నారని.. ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి అరకొర వైద్యం, నాసిరకం వసతులతో సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, పథకం ప్రారంభమైన కొత్తలో ప్రయివేటు ఆస్పత్రుల్లో ఆధునిక వైద్య చికిత్సలు, వసతులన్నీ ఇతర రోగుల్లాగే ఆరోగ్యశ్రీ రోగులకూ అందేవి. దీంతో ఈ పథకం పట్ల ప్రజల్లో ఆదరణ ఏర్పడింది. కానీ ప్రస్తుతం ఆరోగ్యశ్రీపై పర్యవేక్షణ కొరవడటంతో ప్రయివేటు ఆస్పత్రులు నిర్లక్ష్య భావంతో వ్యవహరిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. కాగా, ఈ పథకం కింద వైద్యం పొందేందుకు వచ్చే వారిలో చాలా మంది నిరుపేదలే ఉంటుండగా, వారికి పథకంపై




అవగాహన అంతంతే ఉంటున్నది. ఈ కారణంగానే ఆస్పత్రుల్లో రోగులకు ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించేందుకు, దగ్గరుండి సేవలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఆరోగ్యమిత్రలను ఏర్పాటు చేసింది. రోగులు అడుగిడిన వెంటనే వారి వివరాలు తెలుసుకోవడంతో పాటు ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నదీ లేనిదీ వీరే తెలుసుకోవాల్సి ఉంటుంది. వ్యాధి, సంబంధిత చికిత్స ఆరోగ్య శ్రీ పరిధిలోకి వస్తాయా? రావా?అనేది కొన్నింటిని ప్రాథమికంగా, మరికొన్నింటిని పరీక్షల తర్వాత తెలుసుకోవాలి. కానీ, మిత్రలు ఇలాంటివేవీ పాటించడం లేదన్న ఫిర్యాదులూ ఉన్నాయి. రోగులను ఆస్పత్రి నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నా, చికిత్స విషయంలో పట్టించుకోకపోయినా, దగ్గరుండి సేవలు అందేలా చూడాల్సిన ఆరోగ్య మిత్రలు, నిర్వాహకులకే వంత పాడుతున్నారనే ఆరోపణలూ లేకపోలేదు.

# మహాగర్జన

(మొదటిపేజీ తరువాయి)

రైతులు అసెంబ్లీని ముట్టడించి తీరుతామని వెల్లడించారు. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా సోమవారం ఉదయం 11 గంటల తర్వాత అసెంబ్లీకి ర్యాలీగా బయలు దేరనున్నట్టు సీపీఐ(ఎం) నేత అశోక్ దవ్లే వెల్లడించారు. ఈలోగా పాదయాత్ర అంశంపై అసెంబ్లీలో ఫడ్నవీస్ ప్రకటన చేశారు. రైతులు సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. అనంతరం అసెంబ్లీ భవనం వద్ద రైతు సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం లిఖిత పూర్వక హామీ ఇచ్చింది. ఈ మేరకు అన్నదాతలు తమ ఆందోళనను విరమించారు. రైతుల డిమాండ్లను పరిశీలించేందుకు ఫడ్నవీస్.. ఆరుగురు సభ్యులతో ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రకాంత్ పాటిల్, జల వనరుల శాఖ మంత్రి గిరిశ్ మహజన్, వ్యవసాయ శాఖ మంత్రి పాండురంగ్ పుండ్కర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విష్ణు సావ్రీ, సహకార శాఖ మంత్రి సుభాశ్ దేశ్‌ముఖ్, పీడబ్ల్యూడీ మంత్రి ఏక్‌నాథ్ షిండే ఉన్నారు. అంతేకాక, అటవీ భూముల బదలాయింపు విషయంలో నెలకొన్న సమస్యలను ఆరు నెలల్లోగా పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనిపై ఇద్దరు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపింది. రైతులంతా సొంత ప్రాంతాలకు తిరిగి వెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.



## సభలో కాంగ్రెస్ రభస

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, ఫ్లకార్డులు
- పేపర్లు చింపి గవర్నర్‌పైకి విసిరేసిన సభ్యులు
- ఇయర్‌ఫోన్స్ విసరడంతో స్వామిగౌడ్ కంటికి గాయమైనట్టు ప్రచారం

**నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో**

శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజు అనేక ఆసక్తికర సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఉదయం 10గంటల 5 నిముషాలకు గవర్నర్ తన ప్రసంగాన్ని చదవడం ప్రారంభించారు. ఐదు నిముషాలు మౌనంగా ఉన్న కాంగ్రెస్ సభ్యులు ఆ తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. పోడియంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. మార్షల్స్ వారు లోపలికి రాకుండా అడ్డుగా నిలబడ్డారు. దీంతో మార్షల్స్‌కు కాంగ్రెస్ సభ్యులకు మధ్య తోపులాట జరిగింది. కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి కాగితాలు చింపి గవర్నర్‌పైకి విసిరేసే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ తదితరులు కూడా కాగితాలు చింపి విసిరేసారు. ఈ గలాభాలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇయర్‌ఫోన్స్ విసిరేశారు. 25 నిముషాల్లో గవర్నర్ ప్రసంగాన్ని ముగించారు. ఆ వెంటనే గవర్నర్ పక్కనే కూర్చున్న శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్ గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను గౌరవంగా సాగనంపేందుకు బయటకు వెళ్లారు. ఆ వెంటనే పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి.

కాంగ్రెస్ సభ్యులు ఇయర్‌ఫోన్స్ విసరడంతో మండలి చైర్మెన్ స్వామిగౌడ్ కంటికి గాయమైందని..ఆయన్ని సరోజినీదేవి కంటి ఆస్పత్రికి తరలించారు. అయితే అదంతా ఒట్టి కట్టు కథ అని కాంగ్రెస్ సభ్యులు కొట్టిపారేశారు. దీనిపై మీడియా పాయింట్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. తాను ఇయర్‌ఫోన్స్ విసిరిన చిత్రాలను మాత్రమే చూపుతున్నారని, అవి ఎవరికి తగిలాయో కూడా చూపాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి సవాలు విసిరారు. తాను తప్పుచేసినట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తానని చెప్పారు. మార్షల్స్ తమను అడ్డుకొని తోసివేయడంతో కాళ్లకు గాయాలయ్యాయని చూపించారు. మరోవైపు సరోజినీ కంటి ఆసుపత్రిలో చేరిన మండలి చైర్మెన్ స్వామిగౌడ్‌ను పలువురు మంత్రులు పరామర్శించారు.

ఈ సందర్భంగా స్వామిగౌడ్ వారితో మాట్లాడుతూ గవర్నర్‌తో కలిసి సభ నుంచి బయటకు వస్తున్నప్పుడు కాంగ్రెస్ సభ్యులు ఇయర్‌ఫోన్స్ విసిరారని, అవి కంటి వద్ద బలంగా తగలడంతో గాయమైనట్టు చెప్పారని వారు చెప్పారు. ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి సహా పలువురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు స్వామిగౌడ్‌ను పరామర్శించారు.

**మధ్యలోనే వెళ్లిపోయిన జానారెడ్డి**

ఓవైపు కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నించడం, మార్షల్స్ అడ్డుగా నిలబడటం వంటి ఘటనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ శాసనసభాపక్షనేత జానారెడ్డి మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. బీజేపీ సభ్యులు కూడా గవర్నర్ ప్రసంగం ప్రారంభమైన పది నిముషాలకు సభ నుంచి వెళ్లిపోయారు.

**అబద్ధాల పుట్ట: కిషన్‌రెడ్డి**

గవర్నర్ ప్రసంగం అబద్ధాల పుట్ట అని బీజేపీ శాసనసభాపక్ష నేత జి కిషన్‌రెడ్డి ఆరోపించారు. నాలుగేండ్లుగా అరిగిపోయిన రికార్డులా ఉంద న్నారు. రైతు ఆత్మహత్యలు, అవినీతి నిర్మూలనపై ఒక్క మాటా లేదని చెప్పారు. సచివాలయానికి సీఎం ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అబద్ధాలు ఉన్నందునే వాకౌట్ చేసి మధ్యలోనే బయటికి వచ్చామన్నారు.

## నాటి స్వాతంత్ర్య పోరాటంలా...

**న్యూఢిల్లీ:** 88 ఏండ్ల క్రితం ఇలాగే దేశ రైతాంగం వెంటనడవగా...మహాత్మాగాంధీ బ్రిటీష్ వలసపాలన పునాదుల్ని పెకిలించారు. తద్వారా దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారు. మహారాష్ట్రలో రైతులు చేపట్టిన ఈ ఉద్యమం నాటి స్వాతంత్ర్య ఉద్యమాన్ని తలపిస్తోంది. రైతుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల పునాదుల్ని కూల్చటం ఖాయం. తమ పక్షం నిలిచే ప్రభుత్వాల్ని రైతులు ఎన్నుకుంటారు. దేశంలోని రైతులందరి రుణాల్ని మాఫీ చేయడానికి ఒక లక్ష కోట్లు అవసరమవుతాయి. ఇంతపెద్ద మొత్తాన్ని రుణ మాఫీ చేయలేమని చెబుతున్న కేంద్రంలోని మోడీ సర్కార్, మరోవైపు బడా కార్పొరేట్ వర్గాలకు లక్షల కోట్ల బ్యాంకు రుణాల్ని మాఫీ చేస్తోంది. ఇదెక్కడి న్యాయం ? తాను బతకటం కోసం రైతు రుణాల్ని తీసుకున్నాడు. అది కట్టలేని పరిస్థితి వచ్చి...ఆత్మహత్యకు పాల్పడుతున్నాడు. ఈ పరిస్థితి మార్చాలి.

## 15న ఎడ్‌సెట్ నోటిఫికేషన్

**నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్**

బీఎడ్ రెండేండ్ల కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే ఎడ్‌సెట్–2018 షెడ్యూల్‌ను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) విడుదల చేసింది. ఈనెల 15న ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని టీఎస్‌సీహెచ్‌ఈ చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని టీఎస్‌సీహెచ్‌ఈ కార్యాలయంలో ఎడ్‌సెట్ కమిటీ సమావేశం జరిగింది. ఈనెల 18వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దరఖాస్తుల సమర్పణకు తుదిగడువు వచ్చేనెల 20వ తేదీ వరకు ఉందని తెలిపారు. దరఖాస్తు ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ.450, ఇతరులకు రూ.650 నిర్ణయించామని పేర్కొన్నారు. అపరాధ రుసుం రూ.500తో ఏప్రిల్ 30 వరకు, రూ.2 వేలతో మే 15 వరకు, రూ.5 వేలతో మే 25వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశముందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తప్పుల సవరణకు మే 5వ తేదీ వరకు అవకాశముందని పేర్కొన్నారు. మే 20న హాల్‌టికెట్లను సిద్ధం చేస్తామని తెలిపారు. మే 21 నుంచి 26వ తేదీ వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసేందుకు వీలుందని పేర్కొన్నారు. మే 31, జూన్ 1న ఎడ్‌సెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక విడత, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండో విడత పరీక్షలు జరుపుతామని పేర్కొన్నారు. జూన్ 3న ప్రాథమిక కీ విడుదల చేస్తామని తెలిపారు. జూన్ 5వ తేదీ వరకు ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. జూన్ 11న ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు.

# రసాభాస

(మొదటిపేజీ తరువాయి)

సృష్టించింది. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ మాట్లాడేందుకు ప్రయత్నించగానే.. ప్రధాన ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లోంచి లేచి పోడియం వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా వారి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభ హోరెత్తింది. స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టిన కాంగ్రెస్ సభ్యులు తమ చేతుల్లో ఉన్న ఫ్లకార్డులను చించి సభలో విసిరేశారు. గవర్నర్ ప్రసంగం ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేదలకు అత్యంత అవసరమైన డబుల్ బెడ్ రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూ పంపిణీ తదితర విషయాలకు గవర్నర్ ప్రసంగంలో చోటు దక్కలేదంటూ నినాదాలు చేశారు. ఈ ఉద్రిక్త వాతావరణం నడుమే గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు. అయితే అంతకు ముందు కోమటిరెడ్డి విసిరిన హెడ్‌ఫోన్ తగలటంతో స్వామిగౌడ్ కంటికి గాయమైందంటూ టీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన్ను వీల్‌చైర్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై అధికార పక్షం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.

కాంగ్రెస్ సభ్యుల తీరు తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందంటూ శాసనసభా వ్యవహారాల మంత్రి హరీశ్‌రావు విమర్శించగా.. గవర్నర్ ప్రసంగం తాము ఆశించిన విధంగా లేకపోవటంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యామని ప్రధాన ప్రతిపక్ష నేత జానారెడ్డి సమర్థించుకునేందుకు ప్రయత్నించారు. మరోవైపు సభలోపల మార్షల్స్, బయట పోలీసులు చేసిన బలప్రయోగం వల్ల తమ కాళ్లు, చేతులకు సైతం దెబ్బలు తగిలాయంటూ కాంగ్రెస్ సభ్యులు మీడియా ముందు వాపోయారు. మొత్తం మీద అటు అధికారపక్షం, ఇటు ప్రధాన ప్రతిపక్షం సభలో వ్యవహరించిన తీరునుబట్టి.. బడ్జెట్‌లోని 'అసలు' విషయాలు.. ప్రజా సమస్యలపై చర్చ కొండెక్కినట్టేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వాస్తవాలకు దూరం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి వెళ్లగొడుతున్నారని చెప్పారు. మార్చిలోనే ఎండ తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. ప్రజల గొంతెండుతున్నా ముందస్తు చర్యల్లేవని విమర్శించారు. మిషన్ భగీరథ పథకం కాగితాలకే పరిమితమైందని, ఇంటింటికీ తాగునీరు ఎక్కడా అందలేదని చెప్పారు. కౌలురైతులను నట్టేట ముంచారని విమర్శించారు. పెట్టుబడిసాయం రూ.8 వేలు కౌలురైతులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు మార్కెట్ సౌకర్యం, రుణసౌకర్యం కల్పించాలని కోరారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సూచించారు. కరువు సాయం ప్రస్తావన లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను బుట్టదాఖలు చేసిందని విమర్శించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు భిన్నంగా ఉందని చెప్పారు. బడ్జెట్‌లోనైనా ఇవన్నీ పొందుపరచాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని మార్చివేశారని అన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలను మోసం చేసేలా గవర్నర్ ప్రసంగం ఉందని విమర్శించారు.

## ఇంటర్ విద్యార్థి దారుణ హత్య

**నవతెలంగాణ – కూకట్‌పల్లి**

హైదరాబాద్ నడిబొడ్డున దారుణం జరిగింది. పరీక్ష రాసేందుకు పోతున్న ఇంటర్ విద్యార్థిని వెంటాడి వేట కొడవళ్లతో చంపారు. నిందితుల్లో ఒకరిని అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వెంబడించి పట్టుకున్నాడు. ఈ ఘటన సోమవారం కూకట్‌పల్లిలో కలకలం రేపింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసాపేట్ జనతానగర్‌లో నివసించే రాజు పాల వ్యాపారం చేస్తున్నాడు. ఆయనకు నలుగురు సంతానం. చిన్నవాడైన సుధీర్(17) స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం ఉదయం పరీక్ష రాసేందుకు స్నేహితులు మేఘనాథ్, సాయితో కలిసి బైక్‌పై బయలుదేరాడు. కూకట్‌పల్లి జేఎన్‌టీ హోండా షోరూమ్ వద్దకు రాగానే అక్కడ కాపుకాసి ఉన్న నలుగురు దుండగులు సుధీర్‌ను అడ్డగించారు. ఆయనపై వేట కొడవళ్లతో దాడి చేశారు. తప్పించుకుని పరిగెత్తినా వెంటాడి మరీ నరికి చంపారు. వారిని అడ్డగించేందుకు ప్రయత్నించిన మేఘనాథ్, సాయిపైనా దాడికి యత్నించారు. దీంతో వారు భయపడి అక్కడి నుంచి పారిపోయారు. హత్య అనంతరం పారిపోతున్న నలుగురిలో ఒకరైన నవీన్‌ను అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోంగార్డు పరమేశ్ వెంబడించి పట్టుకున్నాడు. అప్పటికే స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు నవీన్‌ను అప్పగించాడు. మూసాపేట్‌లో నివసించే కృష్ణ, మహేష్, తేజ, నవీన్ ఈ హత్యకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలాన్ని కూకట్‌పల్లి సీఐ ప్రసన్నకుమార్, ఏసీపీ భుజంగరావు పరిశీలించి వివరాలు సేకరించారు. హత్యకు పాత కక్షలేవైనా కారణాలు ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఏసీపీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ ఘటన జరగడంతో కలకలం రేపింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# అన్నింటా అభివృద్ధి : గవర్నర్

**నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో**

దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే భిన్నంగా నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో నడుస్తోందని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. 25 నిముషాల ప్రసంగంలో రాష్ట్రంలోని వివిధ రంగాల అభివృద్ధిని ప్రస్తావించారు. 'బంగారు తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రభుత్వ విధానాలు రూపకల్పన జరుగుతున్నాయని వివరించారు. సమాజంలో ఇప్పటివరకు నిర్లక్ష్యం చేయబడి, అణచివేతకు గురైన వర్గాలు వృద్ధి ఫలాల్ని ఖచ్చితంగా పొందాలని అన్నారు. దశాబ్దాలుగా రాష్ట్రం అనుభవిస్తున్న క్లిష్టతర అభివృద్ధిలోటును పూడ్చడమే కాకుండా, ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతున్నదని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చడంలో గణనీయమైన సానుకూల ప్రభావాన్ని చూపుతుండటం సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు. రాష్ట్రం చేపట్టిన అనేక కార్యక్రమాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసల్ని పొందాయని కొనియాడారు. రైతుల పొలాలకు కృష్ణా, గోదావరి నదీజలాలను తీసుకురావడం కోసం అనేక భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల్ని నిర్మిస్తున్నామని చెప్తూ... కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి అంశాలను ప్రస్తావించారు.

వెనుకబడిన రంగాల సర్వతోముఖాభివృద్ధికి నిధులను కేటాయించేందుకై షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రత్యేకాభివృద్ధి నిధి చట్టాన్ని చేయడంతో పాటు అనేక ఇతర కార్యక్రమాలు ఉన్నాయని చెప్పారు. 2014–15 నుంచి 2016–17 వరకు మూడేండ్లలో తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డీపీ 8.6 శాతం సగటు వార్షిక పెరుగుదలకు చేరిందన్నారు. జాతీయ సగటు 7.5 శాతం కంటే అత్యధికమని చెప్పారు. దేశ తలసరి ఆదాయం 2016–17లో రూ.1.03 లక్షలు కాగా రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1.54 లక్షలుగా అంచనావేసినట్టు తెలిపారు. వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, 2016–17లో 101.29 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగిందన్నారు.

రాష్ట్రంలోని 23 లక్షల వ్యవసాయ పంపు సెట్లు, ఎత్తిపోతల పథకాలకు నిరంతరాయ విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తూ కొత్త రికార్డు సృష్టించామన్నారు. 84 లక్షల గొర్రెల లక్షిత పంపిణీకి గానూ 75 శాతం సబ్సిడీతో గొల్ల, కురుమ కులాలకు 50.10 లక్షల్ని పంపిణీ చేశామని తెలిపారు. వంద రోజుల్లో భూరికార్డుల ప్రక్షాళన చేశామని, కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు త్వరలో జారీ చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. త్వరలో ప్రారంభించే 'ధరణి' వెబ్‌సైట్‌లో రాష్ట్రానికి సంబంధించిన భూ రికార్డుల పూర్తి సమాచారం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం 23 భారీ, 13 మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల్ని చేపట్టిందని, ఇప్పటి వరకు 16.64 లక్షల ఎకరాల కొత్త సాగునీటి సామర్థ్యాన్ని కల్పించి, 8.97 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించినట్టు తెలిపారు.కోటి ఎకరాల సాగునీటి సామర్థ్యాన్ని సమకూర్చడానికి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందన్నారు. విద్యుత్‌రంగం గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధిని సాధించిందని వివరించారు. టీఎస్–ఐపాస్ వల్ల 4.47 లక్షల మంది వ్యక్తుల నేరు ఉపాధి సామర్థ్యంతో 6,206 పారిశ్రామిక యూనిట్ల ఆమోదంతో 1.18 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి సమకూరాయని చెప్పారు. వాటిలో 3,703 యూనిట్లు కార్యకలాపాల్ని ప్రారంభించాయన్నారు. వరంగల్ వద్ద జౌళిపార్కును ఏర్పాటు చేస్తున్నామని, యూనిట్ల ఏర్పాటు కోసం 22 మంది పెట్టుబడిదారులు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని తెలిపారు. 2016–17లో సాఫ్ట్‌వేర్, ఐటీ ఉత్పత్తి ఎగుమతుల మొత్తం విలువ రూ.85,470 కోట్లుగా ఉందని చెప్పారు. ఐటీ రంగాన్ని రాష్ట్రంలోని పలు జిల్లాలకు విస్తరించేలా ప్రణాళికలు ఉన్నాయన్నారు. మెట్రోరైల్‌ను ప్రారంభించామని, దీనికి ప్రజాస్పందన ప్రోత్సాహకంగా ఉందన్నారు. హరితహారం కింద 30 కోట్ల మొక్కలకు జియో ట్యాగింగ్ వర్తింప చేసినట్టు తెలిపారు. కేసీఆర్ కిట్లు వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ప్రసవ పూర్వ చెకప్‌లు, ప్రసవాలు, టీకాల కోసం గర్భిణుల రవాణా నిమిత్తం 250 వాహనాలతో 102–సర్వీసుల పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు.సంక్షేమం, విద్య, ఆసరా ఫించన్లు, ప్రజల రక్షణ, భద్రత, పర్యాటక అభివృద్ధి వంటి పలు అంశాలను గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు.

**ఆధ్యాత్మిక ఉన్నతి పొందండి**


ప్రజలంతా సుఖ సంతోషాలతో సమృద్ధిగా, ఆరోగ్యంగా ఉండాలని గవర్నర్ ఆకాంక్షించారు. అలాగే ప్రజలంతా ఆధ్యాత్మిక ఉన్నతి అంటే ఏమిటి అనే విషయాన్ని తెలుసుకోవాలని, ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

## గవర్నర్‌కు 'కాగ్' నివేదిక సమర్పణ

రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికను సోమవారం గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌కు సమర్పించారు. 2017 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక స్థితి, పద్దులు, బడ్జెట్ ప్రక్రియలకు సంబంధించి ఆడిట్ వ్యాఖ్యలు, పరిశీలనలు ఈ నివేదికలో ఉంటాయి. భారత రాజ్యాంగంలోని 151వ అధికరణాన్ని అనుసరించి 'కాగ్' రాష్ట్ర ప్రభుత్వ పద్దులపై తన ఆడిట్ నివేదికలను గవర్నర్‌కు సమర్పించింది. ఈ నివేదికలను రాష్ట్ర శాసనసభ ముందు ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలుగు, ఇంగ్లీష్ భాషలతో కూడిన ప్రతులను అందచేసినట్టు పీఐబీ అధికారులు తెలిపారు.

# అసెంబ్లీ 12 రోజులే...

- 15న రాష్ట్ర బడ్జెట్ ... 27 వరకు నిర్వహణ
- గవర్నర్ విదేశాలకు వెళ్లనున్న నేపథ్యంలో...
- పని దినాలు తగ్గిస్తున్నట్టు సర్కారు వివరణ
- కోమటిరెడ్డిపై ఏం చేయాలనే నిర్ణయం స్పీకర్‌దేనన్న విపక్షాలు
- ఈ సెషన్ అంతా బహిష్కరించాలి: అక్బరుద్దీన్



**నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను 12 రోజులు మాత్రమే జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాలు కనీసం 40 రోజులైనా నిర్వహించాలని విపక్షాలు చేసిన విజ్ఞప్తిని సర్కారు తిరస్కరించింది. మార్చి 27 తర్వాత రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎన్ నరసింహన్ విదేశాలకు వెళ్లనున్నారని, దీంతో అసెంబ్లీ సమావేశాలను కుదిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో ప్రకటించింది. ఈనెల 15న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టి...27 వరకు సభను కొనసాగించాలని సర్కారు నిర్ణయించింది. తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని 17,18 తేదీల్లో, 26న శ్రీరామనవమి పండుగ సందర్భంగా అసెంబ్లీకి సెలవులు ప్రకటించింది. సోమవారం అసెంబ్లీలోని చాంబర్‌లో స్పీకర్ మధుసూధనాచారి అధ్యక్షతన బీఏసీ సమావేశమైంది.

దీనికి శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, ప్రతిపక్ష నేత జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య, ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్, బీజేపీ పక్షనేత జి కిషన్‌రెడ్డి, టీడీపీ పక్షనేత సండ్ర వెంకటవీరయ్య హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీలో జరిగిన సంఘటన సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహార శైలిపై బీఏసీలో చర్చించారు. కొత్త శాసనసభలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం బాధాకరమని, తనను ఎంతో కలిచివేస్తున్నాయని స్పీకర్ ఆవేదన వ్యక్తం చేసినట్టు అధికార పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ తరహా ఘటనలు చట్ట సభలను అవమానించేలా ఉన్నట్టు చెప్పారు. శాసనసభ సమావేశాలకు సహకరించాలని జానారెడ్డి, విక్రమార్కకు ఫోన్ చేసినట్టు తెలిపారు. ప్రతిపక్ష నేత జానారెడ్డి అసెంబ్లీలో జరిగిన సంఘటనలు బాధాకరమన్నారు. తాము అనుకున్న అంశాలు గవర్నర్ ప్రసంగంలో రాలేదన్న ఆవేదనే ఈ సంఘటనకు కారణమైందని, ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. సభలో ఏం జరిగిందో విచారించి తగిన చర్యలు తీసుకునే నిర్ణయాధికారం స్పీకర్‌కు ఉందని, దాని ప్రకారం చర్యలు చేపట్టాలని కోరారు. మండలి చైర్మెన్‌పై సభ్యుడు దాడి చేస్తే దానిని స్ఫూర్తిగా ఎలా తీసుకుంటారని విపక్షాల నేతలు జానారెడ్డిని ప్రశ్నించినట్టు సమాచారం. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సభలో వ్యవహరించిన తీరుపై ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ తీవ్రంగా స్పందించారు. ఈ సెషన్ మొత్తం ఆయన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక భేటీ నిర్వహించి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ దాడి వ్యక్తిపై కాదు...పవిత్రమైన దేవాలయంపై ఆయన చేశారని పేర్కొన్నారు. గవర్నర్‌పై దాడి చేయాలని ఆయన మీడియాకు చెప్పారని, దీనిపై కూడా పోలీసులు దృష్టి సారించాలని సూచంచారు. ఇటువంటి దాడి చేసే వాళు రేపు ఎవరిపైనా దాడి చేస్తారని, ఈ వ్యవహారం సభా హక్కుల ఉల్లంఘన కిందికి ఆయన అభిప్రాయపడ్డారు.

# కనీస వేతనం కోసం పోరుబాట

- రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల ఆందోళన
- కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, వినతిపత్రాల అందజేత
- సర్కారు స్పందించకుంటే 15 నుంచి నిరవధిక దీక్షలు

**నవతెలంగాణ–యంత్రాంగం**

కనీస వేతనం కోసం మున్సిపల్ కార్మికులు సోమవారం పోరుబాట పట్టారు. ప్రదర్శనలు చేపట్టారు. తమకు మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, జీవో నెంబర్ 14 ప్రకారం వేతనాలివ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ల ఎదుట నినదించారు. తమ సమస్యలపై కలెక్టర్లకు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. హామీలను నెరవేర్చకపోతే 15వ తేదీ నుంచి నిరవధిక దీక్షలు చేపడతామని మున్సిపల్ కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు.

మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు 2015 జులైలో వేతనం రూ.8500 నుంచి రూ.12,500 పెంచిందన్నారు. కానీ, జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెంచకపోవడం అన్యాయమన్నారు.

మహబూబ్‌నగర్‌లో మున్సిపల్ కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకూ ర్యాలీ చేపట్టి అనంతరం కలెక్టరేట్ వైపునకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్మికులు రోడ్డుపైనే బైటాయించారు. పోలీసుల జోక్యంతో అక్కడ నుంచి వెళ్లి కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఖమర్ అలీ మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికుల ఆరు ప్రధాన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. సంవత్సరానికి 15 రోజుల సెలవులు, నూనె, బట్టలు, చెప్పులు, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వికారాబాద్ జిల్లా తాండూరులో మున్సిపల్ కార్మికులు దుకాణాల సముదాయాల ముందు భిక్షాటన చేశారు. నల్లగొండ కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడారు.

పెద్దపల్లిలో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీదేవసేనకు మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, తదితరులు మాట్లాడారు. ఖమ్మంలో మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నా చేసి కలెక్టర్ లోకేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

కరీంనగర్‌లో సీఐటీయూ కరీంనగర్ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేశారు. అనంతరం 'ప్రజావాణి'లో జేసీ బద్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట బైటాయించారు. కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు వినతిపత్రమిచ్చారు.

మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, వనపర్తి, సంగారెడ్డి, జోగులాంబ గద్వాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేసి కలెక్టర్లకు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| సెన్సెక్స్ ▲ 610<br>33,918 | నిఫ్టీ ▲194<br>10,421 | డాలరుకు రూపాయి విలువ<br>65.04 | బంగారం(10గ్రా)<br>రూ. 30,300 | వెండి (కేజీ)<br>రూ. 40,500 | కోడిగుడ్లు<br>హైదరాబాద్ 345 · ఒక్కగుడ్డుకు 4.05 · వరంగల్ 347<br>విజయవాడ 340 · చెన్నై 385 · ముంబయి 390 |






## ఆంధ్రాబ్యాంక్‌లో 'స్కామ్' ప్రకంపనలు!

- 5,000 కోట్ల మోసంలో కొత్త మలుపు
- మాజీ డైరెక్టర్‌పై ఈడీ తాజా చార్జిషీట్
- 15 ఏండ్ల కనిష్టానికి పడిపోయిన స్టాక్
- స్టాక్ ఎక్స్ఛేంజీలకు బ్యాంకు 'కొత్త' వివరణ




**ముంబయి:** ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వెలుగు చూస్తోన్న స్కామ్‌ల ప్రభావంతో ఇప్పటికే కుదేలైన ఆంధ్రాబ్యాంక్ షేర్లు సోమవారం మరింతగా పతనమయ్యాయి. గతంలో స్టెర్లింగ్ బయోటెక్‌లో రూపంలో వెలుగు చూసిన దాదాపు రూ.5,000 కోట్ల కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరెక్టర్ అనూప్ ప్రకాశ్ గార్గ్‌పై తాజాగా మరో చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ వార్తల నేపథ్యంలో ఈ బ్యాంక్ స్టాక్ 15 ఏండ్ల కనిష్టానికి పడిపోయింది. మనీ లాండరింగ్ ఆరోపణలతో గార్గ్‌పై ఈ కేసు నమోదు అయింది. దీంతో ఇన్వెస్టర్లు ఆంధ్రా బ్యాంకు షేర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఈడీ చార్జ్‌షీట్ నేపథ్యంలో ఆంధ్రాబ్యాంక్ షేర్లు సోమవారం ఒక్కరోజే దాదాపు 6.7 శాతం మేర కుంగి రూ.35.95కు పడిపోయాయి. 2003 తరువాత ఆంధ్రాబ్యాంక్ షేరు ఇంత తక్కువ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. మొత్తం 2018 ఏడాదిలో ఇప్పటి దాకా 41 శాతానికి పైగానే పతనమవడం విశేషం.

**గతేడాదిలోనే కేసు నమోదు: సీబీఐ**

ఆంధ్రా బ్యాంక్‌తో సహా వివిధ బ్యాంకింగ్ సంస్థల నుంచి నుంచి వేలాది కోట్ల రుణాలను అక్రమ పద్ధతుల్లో స్వీకరించిన స్టెర్లింగ్ బయోటెక్ వాటిని తిరిగి చెల్లించడంలో విఫలం కావడంతో గత ఏడాది సీబీఐ ఈ విషయమై కేసు నమోదు చేసింది. వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్‌ైన గార్గ్ 2009 అక్టోబరు వరకు దాదాపు మూడేండ్ల పాటు బ్యాంకు బోర్డులో డైరెక్టర్‌గా కొనసాగారు. 2008-09 మధ్య కాలంలో ఆయన స్టెర్లింగ్ సంస్థ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి భారీ మొత్తంలో లంచాలను స్వీకరించి బ్యాంకు నుంచి వారికి రుణాలు మంజూరయ్యేందుకు పని చేసినట్టుగా విచారణ సంస్థలు గుర్తించాయి. స్టెర్లింగ్ గ్రూపునకు రుణ లబ్ది చేకూర్చేందుకు వీలుగా అనూప్ వారి నుంచి రూ.2కోట్లను స్వీకరించినట్లు ఈడీ తాజాగా పేర్కొంది. తాజా ఈడీ విచారణలో షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి. 2011లో ఇన్ కంట్యాక్స్ అధికారులు సీజ్ చేసిన డైరెక్టర్ డైరీలో చేతన్ జయంతిలాల్ సందేశారా, నితిన జయంతిలాల్ సందేశారా అనే స్టెర్లింగ్ బయోటెక్ డైరక్టర్లు ఇతనికి 15.2 మిలియన్ల మేర డబ్బు చెల్లించినట్లు ఎంట్రీలు ఉన్నాయని తేలింది. దీంతో ఆయనపై మరో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. 2016 ముగింపు నాటికి స్టెర్లింగ్ గ్రూపు కంపెనీలు బ్యాంకుల నుంచి రూ.5383 కోట్ల మేర రుణాలను స్వీకరించాయని.. ఆ తరువాత సదరు రుణాలన్నీ నిరర్థక ఆస్తులుగా మారిపోయినట్టుగా సీబీఐ తన దర్యాప్తు నివేదికలో పేర్కొంది. మరోవైపు ఇదే విషయమై హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్రాబ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇస్తూ.. స్టెర్లింగ్ గ్రూపు కంపెనీలు తీసుకున్న రూ.1,150 కోట్ల రుణాలకు మాత్రమే తాము లీడ్ బ్యాంక్‌గా వ్యవహరించినట్టుగా పేర్కొంది. 2015 నుంచి ఈ సంస్థలకు ఇచ్చిన రుణాలను తాము నిరర్థక ఆస్తులుగా పరిగణిస్తూ తగిన సర్దుబాట్లు చేశామని బ్యాంక్ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ మోసాన్ని గత డిసెంబరులోనే గుర్తించిన తాము భారతీయ రిజర్వు బ్యాంకునకు, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్టు పేర్కొంది.

# కుమ్మేసిన 'బుల్'!

- 610.80 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్
- 10,421 పాయింట్ల ఎగువకు నిఫ్టీ
- అనూహ్యంగా పెరిగిన స్టాక్ మార్కెట్లు
- ప్రభుత్వ బ్యాంకింగ్ రంగ స్క్రిప్‌లు బేజారు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం మదుపరులకు అనూహ్య ఆనందాన్ని పంచాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన అనుకూల పవనాలకు తోడు, దేశీయ సానుకూలతల మధ్య స్టాక్ మార్కెట్లు సోమవారం పరుగులు పెట్టాయి. రానున్న ఏడేండ్ల కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ సాయికి చేరనుందంటూ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభూ చేసిన విశ్లేషణాత్మక వ్యాఖ్యలు కూడా మార్కెట్ సెంట్‌మెంట్‌ను పెంచాయి. జనవరి మాసంలో నమోదైన మార్కెట్ల రికార్డు స్థాయులతో పోలిస్తే బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సూచీలు గత నెలన్నర కాలంలో దాదాపు 8% మేర పడిపోయాయి. ఈ నేపథ్యంలో చాలా స్టాక్స్ అందుబాటు ధరల్లోకి వచ్చాయి. దీంతో మార్కెట్లలోని అన్ని కౌంటర్లలో తాజా కొనుగోళ్లు నమోదవడం కనిపించింది. ఉదయం నుంచే లాభాల్లో పయనించిన స్టాక్ మార్కెట్లు ట్రేడింగ్ ముగిసే వరకు అదే జోరును కనబరిచాయి. బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ దాదాపు 1.83 శాతం పెరిగి 610.80 పాయింట్ల లాభంతో 33,917.94 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ నిఫ్టీ 1.9 శాతం మేర పెరిగి 194.55 పాయింట్లు లాభపడి 10,421 పాయింట్ల వద్ద స్థిరపడింది. సోమవారం మార్కెట్ ర్యాలీలో ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ స్టాక్‌లు కీలక భూమిక పోషించాయి. కాగా, ప్రభుత్వ రంగ బ్యాంకుల స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. మరోవైపు ప్రయివేటు రంగ బ్యాంకింగ్ స్టాక్స్ లాభాల్లో నడిచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.76%, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.56% లాభపడ్డాయి. మార్కెట్ విస్తృతి అనుకూలంగా కనిపించింది. బీఎస్ఈలో 1,370 స్టాక్స్ లాభాల్లో నిలవగా.. 1,344 షేర్లు నష్టాల బాట పట్టాయి. బీఎస్ఈ టర్నోవర్ రూ.4118.57 కోట్లుగా నమోదు అయింది.

**అత్యధికంగా లాభపడిన టెలికాం..**

రంగాల వారీగా విశ్లేషిస్తే బీఎస్ఈలో టెలికాం సూచీ అత్యధికంగా (2.57%) లాభపడింది. లాభపడిన ఇతర సూచీల్లో బీఎస్ఈ ఎఫ్ఎంసీజీ (2.13%), చమురు-సహజ వాయువు (2.13%), బీఎస్ఈ ఐటీ (1.45%), బీఎస్ఈ ఆటో (1.38%) ఉన్నాయి. ఐటీసీ స్టాక్ అత్యధికంగా 4.09%, భారతీ ఎయిర్‌టెల్ 4.68%, టాటా మోటార్స్ 3.07 శాతం, రిలయన్స్ 1.09 శాతం మేర ఎగిశాయి. అత్యధికంగా నష్టపోయిన బ్యాంక్ స్టాక్స్‌లో ఐడీబీఐ (8.49%), బ్యాంక్ ఆఫ్ ఇండియా (2.51%), పీఎన్‌బీ (0.94%) ఉన్నాయి.

## మార్కెట్ పరుగుకు కారణాలివే..



- జీఎస్టీ మండలి తన తాజా సమావేశంలో ఎగుమతి దారులకు మరింత వెసులు బాటును కలిగిస్తూ దిగుమతి వస్తు వులపై పన్ను మినహాయింపులను అక్టోబరు నెలాఖరు వరకు (ఆరో నెలల పాటు) పొడిగించాలని నిర్ణయించడం పరిశ్రమ వర్గాలకు దన్నునిచ్చాయి. ఈ నేపథ్యంలో దిగుమతి ఆధారిత పరిశ్రమ స్టాక్స్ పరుగులు పెట్టాయి.
- జనవరి మాసపు పారిశ్రామిక ఉత్పత్తి సూచీ ప్రోత్సాహకర వృద్ధిని నమోదు చేయనుందని.. ఫిబ్రవరి మాసపు వినియోగదారు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం తగ్గనుందన్న ముందస్తు లీక్‌లు మదుపరుల సెంటిమెంట్‌ను మరింత బలోపేతం చేశాయి. ఈ నేపథ్యంలో మార్కెట్లలో తాజా కొనుగోళ్లు నమోదు అయ్యాయి.
- ఫిబ్రవరి మాసంలో అమెరికాలోని వ్యవసాయేతర రంగాల్లో ఉద్యోగిత అనుకున్న స్థాయి కంటే కూడా అద్భుతంగా నమోదైందన్న వార్తలు స్థానిక మార్కెట్లతో పాటు ప్రపంచ మార్కెట్లకు కొత్త ఊపిర్లనూదాయి. దీనికి తోడు అగ్రరాజ్యంలో ద్రవ్యోల్బణం తగ్గనుందని, ఈ నేపథ్యంలో అక్కడి పెద్ద బ్యాంకు వడ్డీరేట్లను మరింతగా సవరించే అవకాశం ఉందన్న వార్తలతో అమెరికా మార్కెట్లు అంతకు ముందు సెషన్లో మెరుగైన లాభాలను నమోదు చేశాయి. ఈ నేపథ్యంలో హాంగ్‌సెంగ్, నిక్కీ, షాంఘై తదితర ఆసియా మార్కెట్లు ర్యాలీని నమోదు చేశాయి.
- రానున్న ఏడేండ్ల కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ సాయికి చేరనుందంటూ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభూ చేసిన విశ్లేషణాత్మక వ్యాఖ్యలు కూడా మార్కెట్ సెంట్‌మెంట్‌ను పెంచాయి.

## దిగివచ్చిన ద్రవ్యోల్బణం.. పెరిగిన పారిశ్రామికం



**న్యూఢిల్లీ:** దేశ ప్రజల్లో ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందన్న భావన కల్పించేలా కేంద్ర ప్రభుత్వం సోమవారం, పారిశ్రామికోత్పత్తి, రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలను విడుదల చేసింది. జనవరిలో దేశ పారిశ్రామికోత్పత్తి పెరిగి 7.5 శాతానికి చేరినట్టుగా కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) తెలిపింది. అంతకు ముందు మాసంలో (డిసెంబరు) పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 7.1 శాతంగా ఉన్నట్టుగా సీఎస్‌వో వెల్లడించింది. మరోవైపు ఏప్రిల్-జనవరి మాసాల మధ్య కాలానికి గాను సమీకృత పారిశ్రామిక ప్రగతి 4.1 శాతంగా నిలిచినట్టుగా సర్కారు తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో సమీకృత పారిశ్రామిక ప్రగతి 5 శాతం దరిదాపుల్లో నిలిచినట్టుగా సర్కారు తెలిపింది. జనవరిలో తయారీ రంగం అత్యధికంగా 8.7 శాతం మేర వృద్ధి చెందగా.. విద్యుత్తు రంగంలో 7.6 శాతం వృద్ధిని నమోదు చేసినట్టుగా సర్కారు గణాంకాలు వెల్లడించాయి. కాగా మైనింగ్ రంగం మాత్రం అత్యల్పంగా కేవలం 0.1 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేయడం విశేషం.

**నాలుగు నెలల కనిష్టానికి ద్రవ్యోల్బణం...**

రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం గత ఫిబ్రవరి మాసంలో దిగివచ్చినట్టుగా సర్కారు తెలిపింది. ఫిబ్రవరి మాసంలో ఈ ద్రవ్యోల్బణం దాదాపు నాలుగు నెలల కనిష్టానికి చేరి 4.4 శాతంగా నమోదు అయినట్టుగా వెల్లడించింది. అంతకు ముందు జనవరి మాసంలో వినియోగదారు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 5.07 శాతంగా రికార్డు అయింది. గత ఏడాది ఫిబ్రవరి మాసంలో సీపీఐ ద్రవ్యోల్బణం 3.65 శాతంగా నమోదు అయింది. ఆహార ద్రవ్యోల్బణం అత్యధికంగా 3.26 శాతంగా నమోదు అయినట్టుగా సర్కారు లెక్కలు వెల్లడించింది. ఆహార వస్తువులు, చమురు ధరలు తక్కువ స్థాయిల వద్దే తచ్చాడడం ద్రవ్యోల్బణం దిగివచ్చేందుకు దోహదం చేసిందని సీఎస్‌వో తెలిపింది. కాగా పాలు, తృణ ధాన్యాలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు గత మాసంలో పెరిగాయని సర్కారు తెలిపింది. ద్రవ్యోల్బణ దిగి వచ్చిన నేపథ్యంలో కేంద్ర బ్యాంకు త్వరలోనే వడ్డీరేట్లను తగ్గించే అవకాశం ఉందన్న వార్తలు షికార్లు చేయడం మొదలుపెట్టాయి.

## పెద్దల సభకు జైట్లీ నామినేషన్



**లక్నో:** కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం ఉత్తర్ ప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలోకి దిగారు. ఉత్తర ప్రదేశ్‌లో అసెంబ్లీలోని టాండన్ హాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తన సన్నిహితులు, పార్టీ వర్గాల వారితో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఆయన గుజరాత్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాజ్యసభ సభ్యుడిగా జైట్లీ పదవి కాలం ముగియడానికి వస్తుండడంతో మోడీ సర్కారు అరుణ్ జైట్లీని తాజాగా ఉత్తర్ ప్రదేశ్ నుంచి పెద్దల సభకు పంపాలని నిర్ణయించింది. యూపీలో భాజపాకు మంచి మెజార్టీ ఉండడంతో జైట్లీ ఎన్నిక దాదాపు ఖరారు అయినట్టేనని పార్టీ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఒకవేళ ఎన్నిక నిర్వహించాల్సి వస్తే మాత్రం ఈ నెల 23న ఎన్నికలు ఉంటాయని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

## వీఆర్ఏలకిచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించాలి

- సంఘం రాష్ట్ర కార్యదర్శి వంగూరి రాములు
- రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు
- కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ



**నవతెలంగాణ-విలేకరులు**

వీఆర్ఏలకు టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అసెంబ్లీ సమావేశాలో చర్చించి పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం(సీఐటీయు) రాష్ట్ర కార్యదర్శి వంగూరి రాములు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట సోమవారం వీఆర్ఏలు తమ సమస్యలపై ధర్నాలు చేశారు. నెలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నాలో రాములు ప్రసంగించారు. రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే ఎక్కువగా వీఆర్ఏలుగా చేస్తున్నారన్నారు. వీరంతా రాష్ట్రం వస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. టీఆర్ఎస్ అధికారం చేపట్టి నాలుగేండ్లు గడిచినా సమస్యలకు పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ కిరణ్మయికి అందజేశారు.కుమురం భీం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటెల్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ రెవెన్యూ సహాయకుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏలు జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసుల సంఘం గౌరవాధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్‌కు వినతిపత్రం అందజేశారు. వరంగల్ రూరల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట కూడా ధర్నా చేశారు.ట్రెజరీ ద్వారానే వీఆర్ఏల వేతనాలు చెల్లించాలని మెదక్, సిద్దిపేట కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. సిద్దిపేటలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అమ్ముల బాల్‌నర్సయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రేవంత్, మెదక్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం పాల్గొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ రజత్‌కుమార్‌సైనీకి వినతిపత్రం అందజేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు.

## 'వక్ఫ్ బోర్డ్ భూములను పరిరక్షించాలి'

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలోని వక్ఫ్‌బోర్డ్ భూములను పరిరక్షించాలని ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాదాపూర్‌లోని గుట్టలబేగంపేట్ లోని 91 ఎకరాల వక్ఫ్ భూములను గతంలోనే వక్ఫ్‌బోర్డ్ గుర్తించి అవి వక్ఫ్ బోర్డ్ భూములన్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా గుట్టలబేగంపేట్ మసీద్‌ను సందర్శించినప్పుడు కేసీఆర్ వక్ఫ్ బోర్డ్ భూములను పరిరక్షించాలని చెప్పిన అంశాన్ని ఉపముఖ్యమంత్రి గుర్తు చేశారు.

# కాళేశ్వరం జాతీయహోదాకు 'సాంకేతిక' అడ్డు

- 'సాంకేతిక సలహా కమిటీ' ప్రతిపాదించాలన్న కేంద్రం : రాజ్యసభలో జలవనరుల శాఖ సహాయ మంత్రి
- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన
- మరోసారి ఉభయసభలు వాయిదా



**నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు 'జాతీయ హోదా' కల్పించేందుకు కేంద్రం 'సాంకేతిక' అడ్డంకులు చూపుతోంది. సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) ప్రతిపాదనతో పాటు కేంద్ర జలవనరుల శాఖ 'పెట్టుబడి క్లియరెన్స్' తెలిపిన తరువాత హోదా ప్రకటనను 'పరిశీలిస్తాం'అని చెబుతోంది. 'కట్టె విరగొద్దు.. పాము చావొద్దు' అన్న చందంగా 'ఇవ్వబోం' అని తెగేసి చెప్పకుండా.. సాంకేతిక సాకులు చూపుతోంది. ఈ మేరకు రాజ్యసభలో జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ సోమవారం ఓ రాతపూర్వక సమాధానంలో తెలిపారు. మరోవైపు పార్లమెంట్ ఉభయసభలు మరోసారి వాయిదా పడ్డాయి. రిజర్వేషన్ కోటాతోపాటు ప్రత్యేక హోదా, కావేరీ నదీ నిర్వహణ బోర్డుపై టీఆర్ఎస్, టీడీపీ- వైసీపీ, అన్నాడీఎంకే ఎంపీలు వరుసగా ఆరో రోజూ పార్లమెంట్ ఉభయసభలను కుదిపేశారు. దీంతో ఎలాంటి సభా కార్యక్రమాలు చేపట్టకుండా లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడ్డాయి.

**లోక్‌సభలో విపక్షాల ఆందోళన ఉధృతం...**

లోక్‌సభలో విపక్షాలు ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఆందోళన హోరు పెరిగింది. రెండు రోజుల విరామం అనంతరం సోమవారం ప్రారంభమైన లోక్‌సభ నిమిషాల వ్యవధిలోనే మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. సభ ప్రారంభమైన తరువాత ప్రశ్నోత్తరాలను ప్రారంభించేందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రయత్నించారు. అయితే అప్పటికే టీఆర్ఎస్ ఎంపీలు వినోద్, కవిత తదితరులతో పాటు టీడీపీ, వైఎస్సీపీ ఎంపీలు, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ డిమాండ్లపై నినాదాలు చేశారు. ఇదే సమయంలో పీఎన్‌బీ కుంభకోణంపై ప్రధాని నోరు విప్పాలంటూ కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. దీంతో సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ఎంపీల ఆందోళన యథావిధిగా కొనసాగింది. దీంతో సభను మంగళవారానికి స్పీకర్ వాయిదా వేశారు.

**రాజ్యసభలోనూ ఇదే తీరు...**

రాజ్యసభలోనూ విపక్షాల ఆందోళన కొనసాగింది. ఉదయం సభ ప్రారంభమవగానే విపక్ష సభ్యులు తమ డిమాండ్లపై నినదిస్తూ వెల్‌లోకి దూసుకొచ్చారు. అయితే ఆందోళనలపై ఛైర్మన్ వెంకయ్యనాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అంశాన్నీ సభలో లేవనెత్తేందుకు అవకాశం కల్పిస్తున్నానని, వెల్‌లోకి వచ్చి ఆందోళన చేయడంలో అర్థం లేదని అన్నారు. కేవలం సభను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అయితే విపక్షాల ఆందోళన కొనసాగడంతో సభను మొదట మధ్యాహ్నం 2.30 నిమిషాలకు వాయిదా వేశారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంతో మంగళవారానికి వాయిదా పడింది.

**కాళేశ్వరం ప్రాజెక్టుకు 'సాంకేతిక' అడ్డు**

కాళేశ్వరం జాతీయ హోదాపై టీఆర్ఎస్ ఎంపీ డీ శ్రీనివాస్ రాజ్యసభలో ప్రశ్నించారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రాంతీయ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించమని మరోసారి అడిగిందా.. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏంటి అని రాతపూర్వకంగా ప్రశ్నించారు. దీనిపై జలవనరుల శాఖ సహాయమంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ సమాధానం ఇచ్చారు. 'జలవనరుల శాఖ దక్షిణ రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో జరిగింది. దక్షిణ రాష్ట్రాల నీటికి సంబంధించిన అంశాలపై చర్చించాం. ఈ సమావేశంలో తెలంగాణ, ఏపీ, కేరళ, తమిళనాడు, కర్నాటక, పుదుచ్చేరి రాష్ట్రాలు పాల్గొన్నాయి. ప్రాణహిత-కాళేశ్వరం ప్రాజెక్టు జాతీయ హోదా అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశంలో మరోసారి లేవనెత్తింది. అయితే కాళేశ్వరం డీపీఆర్ సమీక్షించిన అనంతరం జలవనరుల కమిషన్(సీడబ్ల్యూసీ) తన వ్యాఖ్యానాలను, పరిశీలనలను కాళేశ్వరం ప్రాజెక్టు అథార్టీకి పంపింది. సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) ప్రతిపాదనతో పాటు కేంద్ర జలవనరుల శాఖ ఈ ప్రాజెక్టుకు ఇచ్చే 'పెట్టుబడి క్లియరెన్స్' తరువాత సంబంధిత మార్గదర్శకాలకు అనుగుణంగా జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించే అంశాన్ని పరిశీలిస్తాం' అని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరింది. అప్పటి జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతిని స్వయంగా సీఎం కేసీఆర్ పలు మార్లు విజ్ఞప్తి చేశారు. అయితే మహారాష్ట్రలో ముంపును ప్రధానంగా కేంద్రం ముందుకు తెచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ఆకృతిని మార్చి 'కాళేశ్వరం' చేపట్టింది. అయినప్పటికీ జాతీయహోదాపై కేంద్రం కుంటిసాకులు చెబుతూ కాలయాపన చేస్తోంది.

## లోక్‌సభకు ఆర్థిక నేరగాళ్ల-2018 బిల్లు

పీఎన్‌బీ స్కాం తెరపైకి వచ్చిన తరువాత కేంద్రం తీసుకొచ్చిన ఆర్థికనేరగాళ్ల బిల్లు... మంగళవారం లోక్‌సభ ముందుకు వచ్చింది. విపక్షాల ఆందోళన నడుమ ఆర్థికశాఖ సహాయ మంత్రి శివప్రతాప్‌శుక్లా బిల్లును సభలో ప్రవేశపెట్టారు. వాయిదా అనంతరం సభ మధ్యాహ్నం ప్రారంభమయ్యాక ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు స్పీకర్‌సుమిత్రా మహాజన్ అవకాశమిచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తరపున ఆ శాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా మొదట చిట్ ఫండ్స్ చట్టం(సవరణ)-1982 బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం ఆర్థిక నేరగాళ్ల బిల్లు-2018ని ప్రవేశపెట్టారు. అయితే బిల్లు ప్రవేశపెట్టడాన్ని బీజేడీ ఎంపీ భర్తృహరి మెహతాబ్ వ్యతిరేకించారు. నిందితులను కోర్టులు దోషులుగా తేల్చకుండానే ఎవరినైనా విచారించొచ్చని, ఆస్తులు జప్తు చేయొచ్చని బిల్లులో నిబంధనలు పొందుపరిచారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానంగా బిల్లులో రెండు నిబంధనలు ప్రాథమిక హక్కులకు విరుద్ధమని చెప్పారు. న్యాయం కోసం కోర్టులకు వెళ్లే వ్యక్తులను ప్రభుత్వం నిలువరించలేదని ఆయన అన్నారు. వైట్‌కాలర్ నేరాలకు పీఎంఎల్, ఐబీసీ తదితర చట్టాలున్నాయని గుర్తు చేశారు. అయితే గత చట్టాల్లో దోషిగా తేలిన అనంతరం శిక్షలు ఉంటే... ప్రస్తుత బిల్లులో దోషిగా తేలకముందే ప్రాథమిక సమాచారం ప్రకారం ఆస్తులు జప్తు చేసేలా నిబంధనలు పొందుపరిచారని చెప్పారు. అయితే ఈ అంశాలన్నింటినీ బిల్లుపై చర్చించే సమయంలో ప్రస్తావించాలని కేంద్రమంత్రి సూచించారు. బిల్లునుసభలో ప్రవేశపెట్టారు.

## 13వ సంస్థలపై కేంద్రం చర్చలు

- తెలంగాణ భవన్ ఆర్‌సీ, ఏఆర్‌సీ హాజరు




**నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో**

ఏపీ పునర్విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థలపై కేంద్రం చర్చలు జరిపింది. నార్త్‌బ్లాక్‌లోని హోంశాఖ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్, అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి హాజరయ్యారు. రాష్ట్రానికి సంబంధించి బయ్యారం స్టీల్‌ప్లాంట్, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఉద్యానవన యూనివర్శిటీ, గిరిజన యూనివర్శిటీ, వెనుకబడిన ప్రాంతాల రహదారుల అనుసంధానంపై చర్చ జరిగినట్టు అధికారులు తెలిపారు. గిరిజన యూనివర్శిటీ కోసం రెండు వందల ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. అయితే రైల్వేకోచ్ ఫ్యాక్టరీ బదులు వ్యాగన్ పిరియాడిక్ ఫ్యాక్టరీని కేంద్రం ప్రతిపాదించిందని తెలిపారు. ఏపీ నుంచి ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ హాజరయ్యారు. ఏపీలో గిరిజన, కేంద్రీయ యూనివర్శిటీలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరినట్టు చెప్పారు. దీనిపై కేబినెట్ నోట్ పూర్తయ్యిందని ఏపీ ప్రధాన కార్యదర్శి తెలిపారు.

## నల్లగొండ ఎస్పీగా రంగనాథ్

**నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి**

నల్లగొండ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావుపై బదిలీ వేటు పడింది. సోమవారం ఆయనను హఠాత్తుగా బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయమని ప్రభుత్వం ఆదేశించింది. ఆయన స్థానంలో నల్లగొండ ఎస్పీ బాధ్యతలను హైదరాబాద్ నగర ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు(డీసీపీ) ఎవి రంగనాథ్‌ను నియమించారు. వెంటనే నూతన బాధ్యతలను స్వీకరించాలని ఆయనను ప్రభుత్వం ఆదేశించింది. ఇటీవలన నల్లగొండలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటి రెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అనుచరుడు శ్రీనివాస్ దారుణ హత్యకు గురి కాగా ఈ కేసు దర్యాప్తులో జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు సరిగా వ్యవహరించలేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా దర్యాప్తు జరుపుతున్న ఇన్‌స్పెక్టర్ సైతం తన ఆయుధం, సెల్‌ఫోన్ ఇచ్చేసి అజ్ఞాతంలోకి వెళ్లి పోవడం తో విపక్షాల ను ంచి వస్తున్న ఆరోపణలు తుట్టకోవడం ఆ సమయంలో పోలీసు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలోనే శ్రీనివాస్‌రావును తాజాగా బదిలీ చేయడానికి కారణమని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

## అతి సంస్కృతి

అనుభవంలో ఉన్న లౌకికమైన మానవ వ్యవస్థలను, సంబంధాలను, ప్రవర్తనను 'లౌకిక సంస్కృతి' (ఎంపిరికల్ కల్చర్) అని పిలిస్తే, వీటికి దూరంగా వీటి నుంచి విడివడి సర్వసత్తాక ప్రతిపత్తితో మనగలిగిన సార్వత్రిక సంస్కృతిని 'అతి సంస్కృతి' (ట్రాన్స్ కల్చర్) అనీ, దీని సత్తా స్వభావాలను 'అతి సాంస్కృతిక సత్య" మనీ (ట్రాన్స్ కల్చరల్ రియాలిటీ) అని అంటారు. అతి సాంస్కృతిక సత్యాన్ని బ్రహ్మ పదార్థంతో పోల్చవచ్చు. బ్రహ్మపదార్థం తన వ్యక్తీకరణ కోసం ఈ మాయా ప్రపంచం (ఐహిక ప్రపంచం) మీద ఆధారపడినట్లు 'అతి సాంస్కృతిక సత్యం లౌకిక సంస్కృతి ద్వారా అభివ్యక్తిని పొందవలసిందే.

అతి సంస్కృతి గురించి కొన్ని ప్రశ్నలు తలెత్తాయి. దాని స్వరూప స్వభావాలేమిటి? అది ఔద్దేశికమా? దాని అభ్యుపగమాలు ఏమిటి? అది నియతమా? దానికి దిశానిర్దేశాలు ఉన్నాయా? అది స్వయం నిర్ణాయకమా?

ఈ ప్రశ్నలకు అనేకమంది దార్శనికులు సమాధానాలు చెప్పడానికి ప్రయత్నిం చారు. వీరంతా తత్వ శాస్త్రంలోని 'కేవల' (ఆబ్సొల్యూట్) భావాలను 'అంటగట్టి 'ఆ 'అంటు'లను సంస్కృతి వనంలో నాటారు. అవి పుష్పించి తమ సౌరభాలను వెదజల్లాయి. ఆ వాసనలు పీల్చి మనం సంస్కృతి సిద్ధాంతాలను వివరించ వలసి ఉంటుంది. ఆ వాసనలు ఏవైనా మొత్తంమీద అవి సంస్కృతిని నిర్ణయిం చాయి. దానిని ఒక విధికి లోబడ జేశాయి. ఆ భావాలు మనిషికి సంబంధం లేని భౌగోళిక, రాజకీయ, ఆర్థికపరమైనవి కావచ్చు లేదా ఒక పారమార్థిక అంతిమ ప్రయోజనాన్ని ఆశించి, ముందుగా ఏర్పరచుకొన్న ప్రణాళిక ప్రకారం దానివైపు చేసే పురోగమనం కావచ్చు.

ఈ భావాలు సంస్కృతికి అన్వయించి 17వ శతాబ్దంలోని దార్శనికులలో కొందరు ప్రగతి గతితార్కికమని, మరికొందరు రేఖీయ (లైనియర్) మనీ కొందరు చెప్పారు. చక్రికమని ఇంకొందరు చెప్పారు. 18వ శతాబ్దంలోని తాత్వికులలో కొందరు చరిత్ర యాంత్రిక పద్ధతిలో గమిస్తుందని, చర్విత చరణ విధానాన్ని అనుసరిస్తుందని చెప్పారు. అట్లాగే హెగెల్ చరిత్ర గతితార్కికమన్నాడు. ప్రకృతి రహస్యోద్దేశాన్ని బహిర్గతం చేశాడు కాంట్. స్పెంగ్లర్ సంస్కృతిని 'చక్రీయగతి' పాలు చేశాడు. ఉద్దీపన 'ప్రతిస్పందన' సిద్ధాంతాన్ని సంస్కృతిలో దర్శించాడు టాయన్బీ. ఈ సిద్ధాంతాలన్నీ సంస్కృతి సత్యాన్ని తమ తమ మూసల్లో ఘనీభవింపజేశాయి.

## అలనాటి 'విషయం'లో ఊర్లు

ఉమ్మడి పశ్చిమాంధ్ర... అంటే ఇప్పటి తెలంగాణ, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలు, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు తొలి చాళుక్య రాజుల ప్రత్యక్ష పాలనలో ఉండేవి. వారి పాలనా కాలంలో అంటే క్రీ.శ.ఏడు, ఎనిమిది శతాబ్దాలలో ఉన్న పాలనా విభాగాలను నాడు, వాడి, విషయ అనేవారు. వీటిలో 'విషయం' అనే విభాగం కింద ఉన్న ఇప్పటి ప్రాంతాలేమిటో చూద్దాం.

చాళుక్య విషయం అనేది శాసనాల్లో కనిపిస్తుంది. ఈ విషయంలో తుంగభద్ర, కృష్ణా నదులు; వాటి ఉపనదులు- భవనాశి, చింతేరులకు అటు ఇటూ ఉన్న భూ ప్రాంతాలు ఉంటాయి. తుంగభద్ర, చింతేరు, భవనాశిలు కృష్ణా సంగమం వల్ల కొన్ని ప్రాంతాల భూములు సారవంతమయ్యాయి. రాళ్ల ఉన్న నేలలు, చిన్న చిన్న కొండలు



వాటికి అందమైన రూపాన్ని ఇచ్చాయి. విషయం అనే పదం రెండవ పులకేశి శాసనంలో కనిపిస్తుంది.

'వంగూరు నాటి విషయం'లో కృష్ణా నది ఎగువ భూములు ఉన్నాయి. పాత మహబూబ్‌నగర్ జిల్లాలోని వీపనగండ్ల, పానగల్, కొల్హాపూర్, నాగర్‌కర్నూల్, బిజ్నెపల్లి, వనపర్తి, కోడేరు మండలాలు ఈ విషయంలోకి వస్తాయి. దక్షిణాన కృష్ణా నది, ఈశాన్యాన దిండి నది దీనికి చెప్పుకోదగిన జలవనరులు. ఆముదాలపాడు, తామ్రశాసనంలో పేర్కొన్న గ్రామాలు - వడ్డమాన్, పనియాలు, పల్లిపాడు, బమన్‌కల్ నగర పానగల్, కృష్ణా నది ఒడ్డున ఉన్న మానూరు, చిన్న మర్రూర్/పెద్దమర్రూర్, ఇపరుంకల్, వీపనగండ్ల, వంగూరు. ఈ విభాగానికి బహుశా వంగూరు కేంద్ర స్థానం అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

మరో మధ్య యుగ పాలనా విభాగం 'కన్నె విషయం'. మొదటి విక్రమాదిత్యుని శాసనం ఒకటి కన్నె-విషయంలోని చింతకుంట గ్రామ దానాన్ని ప్రస్తావిస్తున్నది. కృష్ణా-తుంగభద్రానదుల మధ్య దోబ్‌లోని పంచలింగాల నుండి సిద్ధేశ్వరం వరకు గల భూ ప్రాంతాలు; కర్నూలు జిల్లాలోని భవనాశీ నదిని ఆనుకొని ఉన్న ప్రాంతాలు, కర్నూలు జిల్లాలోని కొత్తపల్లె, నందికొట్కూరు మండలాలు; మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపురం మండలం ఉండి ఉంటాయని పరిశోధకులు భావిస్తున్నారు. ఆ తర్వాత ఈ విభాగాన్ని కన్నె-300 అనీ, కన్నె-నాడు అనీ ప్రస్తావించేవారు కాని, విషయం అనే వారు కాదు. తెలంగాణ లోని ఉత్తర, తూర్పు ప్రాంతాలు చాళుక్య శాసనాల్లో చోటు చేసుకోనప్పటికీ ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల ప్రాంతాలు 'సపాద-లక్ష' విభాగం, కోశవలదేశం మరో భూ విభాగమని భావించవచ్చంటున్నారు చరిత్రకారులు.




**మానవ చరిత్ర, సంస్కృతులను ముందు తరాలకు అందించడంలో శిల్ప కారుల పాత్ర చాలా ఉంది. శిల్పులు సమకాలీన సమాజాన్ని తమ కళద్వారా నిక్షిప్తంచేసే శిల్పులు అనేక రకాలవారు ఉన్నట్లు మన శాసనాలు, సాహిత్యం చెబుతున్నాయి. శిల్పులు కేవలం రాళ్లమీదే కాక మట్టి, కొయ్య, లోహం, ధాతువుతో అద్భుత కళా ఖండాలను సృష్టించారు. అటువంటి ప్రాచీన శిల్పుల జీవనం పూర్వం ఎట్లా ఉండేదో చెబుతున్న ప్రత్యేక వ్యాసం ఇది.**





# శిల్పులను అందలం ఎక్కించిన రోజులవి

ప్రాచీన శాసనాలు, గ్రంథాల్లో శిల్పుల గురించిన వివరాలు చూసినప్పుడు వారు ఎంతటి గౌరవ మర్యాదలు పొందారో అర్థమవుతుంది. శిలలపై రాతలు గండరించేవారిని శాసన శిల్పులంటారని శాసనాలను బట్టి తెలుస్తున్నది. అట్లాగే శిల్పి అనగానే పురుషులే గుర్తుకువస్తారు. నిజానికి పూర్వం స్త్రీలు కూడా మిగతా వృత్తిపనుల్లో లాగే ఆలయ నిర్మాణం, శిలా శిల్పాలు చెక్కటంలో మగవారికి సహకరించేవారు. కృష్ణా జిల్లా గణపవరంలోక్రీ.శ.12వ శతాబ్దంలో గణపేశ్వర మహాదేవుని ఆలయ నిర్మాణంలో మాగుటూరి మల్లికార్జునుడనే శిల్పికి అతని కొడుకు అక్కా బత్తునితోపాటు భార్య వీరమ్మ కూడా సహకరించినట్లు లిఖితమై ఉంది. అసలు శిల్పి అని ఎవరినంటారు అనే విషయంలో ఒక వివరణ గుంటూరు జిల్లా మల్కాపురం లోని క్రీ.శ.1261 నాటి శాసనంలో ఉంది. బంగారం, రాగి, రాయి, దారు, ఇనుము ధాతువులతో పాటు, మట్టితో కుండలు చేసే కుమ్మరులను కూడా శిల్పులుగానూ, స్థపతులుగాను పేర్కొనడం ఈ శాసనంలో కనిపిస్తున్నది.



పూర్వం శిల్పులు మత, భాషా భేదాలను పాటించేవారు కాదు. క్రీ.శ.1418 సంవత్సరం నాటి తెల్లాపూర్ శాసనంలో స్థానిక శిల్పులైన మైలోజు, అయిలోజులు బహమనీ సుల్తాను ఫిరోజ్ షా భార్యకు తాము బంగారు పూలు, గాజు పూసలతో చేసిన కంఠాభరణాన్ని బహూకరించినట్లుంది. ఈ శాసనంలో తెలంగాణాపురం అనే పేరు కనిపిస్తుంది. ఈ తెలంగాణాపురమే నేటి తెల్లాపూర్. తెలంగాణ అన్న పదాన్ని అందించిన తొలి శాసనం ఇదే.

కేవలం విశ్వకర్మలే కాక ఇతర కులాలవారు కూడా ఆలయ నిర్మాణాన్ని చేపట్టిన ఆధారాలు ఉన్నాయి. క్రీ.శ.1529 నాటి వరికుంట శాసనంలో ఉప్పర తిప్పన బోయ అనే శిల్పి స్థానిక శివాలయం నిర్మాణానికి 120 రూపాయలను కట్టు గుత్తగా పొందినట్లు ఉంది. ప్రకాశం జిల్లా పురుషోత్తమ పట్నం, చీమకుర్తి, గుంటూరు జిల్లా తురకపాలెంలో ముస్లింలు ఆలయ నిర్మాణంలో ఇప్పటికీ పాల్గొనడం గమనించాల్సిన సంగతి.

వివిధ లోహాలతో కళాఖండాలను తయారుచేసేవాళ్లను లోహకార శిల్పులంటారు. కరీంనగర్ జిల్లా ధూళికట్ట వద్ద బయల్పడిన క్రీ.పూ.2వ శతాబ్దం నాటి హారీతి కంచుబొమ్మ, అమరావతి, బుద్ధాం, నాగార్జునకొండ, నేలకొండపల్లి, వద్ద బయటపడిన బుద్ధుని కంచు బొమ్మలను కాసకారులనే లోహకారులు తయారుచేశారు. ప్రాకృత శాసనాల్లోని 'కాసకార' పదమే తెలుగు, సంస్కృతం శాసనాల్లో 'కాంస్యకార'గా మారింది. కంచర, కంసాలిగా కూడా పిలుస్తున్నారు. మధ్యయుగ శాసనాలు స్వర్ణకారుల్ని అగసాలి, అక్కసాలి అని పేర్కొంటు న్నాయి. ఇక దేవాలయ రథాలను తయారుచేసేవారిని రథకార శిల్పులని అనేవారు.

### శిల్పులు-సంఘాలు

తెలుగు గడ్డపై ఆలయ, గోపుర నిర్మాణాలను శిల్పులు వ్యక్తిగతంగానే కాకుండా సంఘాలుగా ఏర్పడి చేపట్టినట్లు తెలుస్తున్నది.వీటిలో సరస్వతీగణం, పంచాణం వారు సంఘాలు ముఖ్యమైనవి. ఇనుము, ఇత్తడి, బంగారం, కొయ్య, రాయి అనే ధాతువులతో కళాత్మక వస్తువులను తయారుచేసే శిల్పుల్ని పంచాణం వారు అంటారు. వీరినే పంచాదులు, పంచాది, పంచాణులు, పంచకర్ములు, అని పిలిచారు. రాజ్యాలేలిన రాజులకే కాక వివిధ కళల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన పంచాణంవారి గుణగణాలను వెల్లడించే ప్రశస్తి శాసనాలు కూడా ఉన్నాయి. అమరావతి, బెడదకోట, నందేలంపేట ప్రశస్తి శాసనాలను పరిశీలిస్తే వీరు త్రిభువనాలను నిర్మించినవారని, అనన్త శబ్దశాస్త్ర, పురాణాలను బాగా చదివినవారని, సప్తసాగర నిర్మాతలని, అష్టదిక్పాల, అష్ట దిగ్గజ ప్రతిమలకు రూపశిల్పులని, గంభీర ధైర్య ధారుణులని, జగద్ధిత కారులని ప్రస్తుతి పొందారు.



ఎంతోమంది దేవుళ్లను చిత్రించి, శిల్పాలుగా తీర్చిదిద్దిన శిల్పులకు ప్రత్యేకంగా



దువుళ్ల ఉన్నట్లు శాసనాలు, సాహిత్యాలను పరిశీలిస్తే తెలుస్తుంది. శిల్పులు లేక పంచాణంవారికి కమ్మరేశ్వరుడు, కాళికాదేవి లేక కమ్మరేశ్వరదేవి, ఆరాధ్య దేవతలు.

### ఉన్నత పదవులు

అన్ని వర్గాల ప్రజల అవసరాలను తీర్చిన శిల్పుల్ని సమాజం ఎంతగానో గౌరవించింది. అర్హతలను బట్టి అత్యున్నత పదవులు కట్టబెట్టింది. కొండపడమటి రాజైన ఎర్రమంద కొలువులో ఉన్న విశ్వకర్మ కుల భూషణుడైన సూరడు, బెజవాడ యుద్ధంలో వీరోచితంగా పోరాడి, మహాప్రధాని పదవిని పొందినట్లు 1118 నాటి చేబ్రోలు శాసనం చెబుతున్నది. అట్లాగే కులోత్తుంగ గొంకరాజు కొలువులో ప్రసిద్ధ పౌరుష నిరతుడైన, విశ్వకర్మ కులానికి చెందిన నూకాండి దండనాయక పదవిని పొందినట్లు నాదిండ్ల శాసనం చెబుతున్నది.



ఆలయనిర్మాణం, శిల్పాల తయారీ, యాన, శయన, వ్యవసాయ పనిముట్ల తయారి చేపట్టిన శిల్పులు సమాజంలో మంచి హోదానే పొందారు. ఆలయాల్లో ప్రసాదాల పంపిణీలో వారికి ప్రత్యేక స్థానం ఉండేది. అట్లాగే రథోత్సవాల సమయంలో ఉచిత రీతిన సత్కారాలను అందుకున్నారు. ఉదయగిరిలోని రఘునాథనాయకుల రథోత్సవ సమయంలో ఉలులు చేతబూనిన శిల్పులు రథానికి ముందు భాగంలో నడిచే హోదాని పొందినట్లు16వ శతాబ్దపు ఉదయ గిరి శాసనంలో ఉంది. కడప జిల్లా సిద్ధవటం శాసనంలో రథోత్సవ సందర్భంగా శిల్పులు రథంపై ఎక్కి ఊరేగే పాత సంప్రదాయాన్ని బ్రాహ్మణులు వ్యతిరేకించినట్లు, శిల్పుల విన్నపం మేరకు ప్రభువైన అనంతభూపాలుడు వారికి రథంపై ఎక్కి ఊరేగే అర్హత ఉందని తీర్పు చెప్పి వారిగౌరవాన్ని ఇనుమడింపచేసినట్లు ఉన్నది.

శిల్పులు తమ తమ నైపుణ్యాలను బట్టి కొన్ని బిరుదులను కూడా పొందారు. కల్గారాభరణాచార్య, పంచరథప్రియ, విశ్వకర్మ కుల భూషణుడు, వైరి నరేంద్రభూషణుడు, నూకాండిని కర్మరాభరణుడు, సర్వోత్తమ శిల్పి వంటి బిరుదులు శాసనాల్లో కనిపిస్తాయి. శిల్పులు ధాతులక్షణం, వస్తుగుణం, గణితం, చిత్రలేఖనం, చరిత్ర, పురాణాలు, భౌగోళిక విషయాలతో పాటు సాంస్కృతిక విషయాలైన వేష భూషణాలు, నాట్యం, వాద్యపరికరాలు వంటి చాలా విషయాల్లో పరిజ్ఞానం కలిగి ఉండేవారు. అందుకనే అప్పట్లో శిల్పులకు సంఘంలో మంచి గౌరవ మర్యాదలు ఉండేవి.

**-డా॥ఈమని శివనాగిరెడ్డి**

---

ఆఫ్రికావారు చాలామంది మధ్యయుగంలోను, ఆధునిక యుగ ప్రారంభంలోను భారత దేశానికి వచ్చి స్థిరపడ్డారు.ఇట్లా వచ్చిన వీరిని సిద్దిగోమాలు లేక సిద్దీలు అని మన తెలంగాణలో పిలుస్తారు. వీరు అహమ్మదాబాద్, గోవా, ముంబై, ఎల్లాపూర్, హబ్సికోట్, హైదరాబాదు వంటి ప్రాంతాల్లో అధికంగా కనిపిస్తారు. ఇక్కడ వీరు ప్రత్యేక చరిత్ర కలిగి ఉన్నారు. కొంతమంది పాలకులుగా, కొంతమంది సైనికాధికారులుగా, సైనికులుగా, నావికులుగా, గుమస్తాలుగా రకరకాల వృత్తుల్లో ఉన్నారు. వీరు ఆఫ్రికాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడ్డవారు. రాజులు, జమిందార్లు వీళ్ళను సైనిక దళాల్లోనూ, రక్షకదళాల్లోనూ నియమించుకున్నారు. ఎప్పుడో వాళ్ళ వాళ్ళ దేశాలను వదిలిపెట్టి వచ్చినందువల్ల భారత దేశాన్నే మాతృదేశంగా భావించి మమేకమయ్యారు. కొంతమంది ముస్లింలుగా మారి మహమ్మదీయ పాలకుల దగ్గర సైనికులుగా స్థిరపడిపోయారు. కొంతమంది బానిసలుగా ఉంటూ ఉన్నత పదవులనూ అధిష్టించారు. 17వ శతాబ్దంలో బెంగాలులో ఉన్న పోర్చుగీసువారు ఆఫ్రికావారిని బానిసలుగా, పనివారుగా తీసుకొచ్చారు. అలాగే కర్నాటకలోనూ సిద్దీలు అధికసంఖ్యలో ఉన్నారు. సిద్దీలు క్రైస్తవ, హిందు, ముస్లిం మతాలను అనుసరిస్తున్నారు.



# రెండు సంస్కృతుల మేలు కలయిక సిద్దీలు

**తెలంగాణ సిద్దీలు :** సుమారు నూట యాభై ఏండ్ల క్రితం నిజాం రాజ్యంలో ప్రవేశించారు సిద్దీలు. 313 మంది ఆఫ్రికా జాతీయులను వనపర్తి రాజా నిజాం మహబూబ్ ఆలీ బాద్షాకు కానుకగా ఇచ్చాడు. వాళ్ళలో హసన్ బిన్ మహబూబ్, మహబూబ్ బిన్ ముబారక్, అబ్దుల్ బసత్ బిన్ హసన్, సులేమాన్ బిన్ సయీద్ మొదలైన వారున్నారు. అసఫ్‌జాహీ పాలనలో సిద్దీలు మరికొందరు వచ్చారు. వీరు నిజాంకు ప్రత్యేకమైన రక్షకులుగా కానీ, సైన్యంలో సైనికులుగా కానీ పనిచేశారు. అలాగే నిజాం జనానాలోనూ పనిచేశారు. వీరు ఎంతో ఓర్పువంతులు. సిద్దీలు నీగ్రో జాతికి చెందినవారు. వారిని 'హబ్సీలు' అని మహారాష్ట్రలో పిలుస్తారు. గోవా, డయ్యూల్లో వీరిని 'కాఫ్రీలు' అంటారు.గుజరాత్‌లో సిద్దీలను 'బాద్షా'లు అంటారు. అంతే కాదు 'భిల్లాల'నీ పిలుస్తారు. మన హైదరాబాదులో ఉన్న సిద్దీలను ఛాష్ లేక హబ్సీలు అంటారు.

అరబ్బులు ఆఫ్రికా బానిసలను బెంగాల్ పశ్చిమ ప్రాంతాలకు తీసుకువచ్చి అమ్ముతుండేవారు. ఆ రకంగా కచ్, కథియవార్, సింధు, పోర్‌బందర్ ప్రాంతాలకు సిద్దీలు వ్యాపించారు. ఆ తరువాత బొంబాయి వైపుకు వచ్చారు. సిద్దీల్లో ఇంకా ప్రాచీన ఆచార వ్యవహారాలు ఉన్నాయి. సన్యాసుల్లా దర్గాల్లో కొందరు కాలం గడుపుతారు. వీరు తమ పూర్వీకులను గౌరవిస్తారు. నృత్యంలో వారి ఆధ్యాత్మిక, దైనందిన జీవితాలు ప్రతిఫలిస్తాయి. వీరి నృత్యాల్లో ఒక్కోసారి ఆటవిక చాయలు కనిపిస్తాయి. మత సంబంధ కార్యక్రమాల్లో వారి నృత్య ప్రదర్శనలు సంప్రదాయబద్ధంగా ఉంటాయి. నృత్యం ఆ జాతి ప్రజ్ఞాపాటవాలకు సంబంధించినది. వారి భూమి, వ్యవసాయం, పండుగలు-పబ్బాలకు సంబంధించిన అనేక విషయాలు ఈ ప్రదర్శనల్లో ఇమిడి ఉంటాయి. నృత్యాల్లో జాతి జనులంతా అరమరికలు లేకుండా పాల్గొంటారు. ప్రకృతి వాళ్ళకు స్ఫూర్తి. రంగురంగుల దుస్తులను ధరించి ఆనందంగా జీవించడం కోసం డ్యాన్స్ చేస్తారు. కొత్త కొత్త ఫక్కీల్లో డ్యాన్స్ చెయ్యడం, పాటలు పాడటం, వాయిద్యాలను వాయించడంలో ఆసక్తి ప్రదర్శిస్తారు. వీరి ప్రదర్శనల్లో ఆటవిక జీవితం, సంతోషం, దు:ఖం, భయం, ఆశ్చర్యం వంటివి ప్రతిఫలిస్తాయి.ప్రకృతి సిద్ధంగా పక్షులను, జంతువులను అనుకరిస్తూ ప్రదర్శనలివ్వడం వాళ్ళకు వెన్నతో పెట్టిన విద్య.హస్త ముద్రికలు కూడా ప్రత్యేకంగా ఉంటాయి.అడవిలో ఉండే మృగాలు, పక్షుల అరుపులను వాళ్ళు అనుకరిస్తారు.హిందీ, స్వాహిలీ భాషలను కలిపి పాటలు పాడతారు.

గుజరాత్ సిద్దీల నృత్యం హైదరాబాదు సిద్దీల డ్యాన్సకన్నా ఎక్కువ సంప్రదాయబద్ధంగా ఉంటుంది. వాళ్ళ వస్త్ర ధారణలో కూడా తేడా ఉంది. తెల్ల కుర్తా, పైజమా గుజరాతీ సిద్దీలు ధరిస్తే హైదరాబాదీలు లుంగీలు ధరించి వాటికి ఎరుపు, ఆకుపచ్చ బెల్టులు పెట్టుకుంటారు. తలకు తలపాగా చుడతారు. ఇరు ప్రాంతాల వారు వాడే సంగీత వాయిద్యాల్లో కూడా తేడా ఉంది. గుజరాతీలు ఎక్కువ వాయిద్యాలు వాడతారు. వీరి వాయిద్యాల్లో 'మాలుంగా' చాలా ప్రధానమైంది. 'ముర్ఫి'కూడా తరచుగా వాడే వాయిద్యమే.

స్థానిక భారతీయ జీవనానికి అలవాటుపడినా... తమ నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఆఫ్రికా సాంస్కృతిక నేపథ్యాన్ని మాత్రం వారు వదులుకోకుండా ఓ ప్రత్యేక సంస్కృతిని సృష్టించిన సిద్దీలను ప్రభుత్వాలు ఆర్థికంగా ఆదుకోవలసి ఉంది.

**-మౌక్తిక్**



# అగ్రస్థానం మనదే

● షూటింగ్ ప్రపంచ కప్‌లో భారత్‌కు తొమ్మిది పతకాలు

న్యూఢిల్లీ : షూటింగ్ ప్రపంచ కప్‌లో భారత్ షూటర్లు సత్తా చాటారు. దీంతో తొలి సారిగా ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచ కప్ పతకాల పట్టికలో భారత్‌కు అగ్రస్థానం దక్కింది. ఆఖరు రోజున పతకాలేమీ సాధించకపోయినా అంతకుముందే భారత షూటర్ల గురి ఫలితంగా భారత్‌కు నాల్గు స్వర్ణాలు, ఒక రజతం, నాల్గు కాంస్య పతకాలు దక్కాయి. షాజర్ రిజ్వీ, మను భాకర్, అఖిల్ షెరాన్, ఓం ప్రకాశ్‌లు పసిడి పతకాలు సాధించగా అంజుమ్ మౌద్గిల్‌కు రజతం నెగ్గింది. సీనియర్ షూటర్లు జితు రాయ్, రవి కుమార్‌లకు కాంస్యాలు దక్కాయి. ఊహించినట్టుగానే భారత్ పతకాల పట్టికలో తొలి స్థానంలో నిలవటం పట్ల పతక విజేతలు హర్షం వ్యక్తం చేశారు.

# బోల్టన్ అజేయ శతకం



● ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో భారత్ ఓటమి

**వదోదర:** సఫారీ గడ్డపై విరుచుకుపడిన భారత మహిళల జట్టు సొంతగడ్డపై బోల్తా పడింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య భారత్ ఓడింది. ప్రత్యర్థి స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయిన భారత బ్యాట్స్‌వుమెన్ చెప్పుకోదగ్గ స్కోరు చేయలేకపోయారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన హర్మన్‌ప్రీత్ సేన.. కంగారూ బౌలర్లు జోనసెన్ (4/30), వెల్లింగ్టన్ (3/24) ధాటికి నిర్ణీత 50 ఓవర్లలో భారత్ 200 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ పూనమ్ రౌత్ (37) మినహా టాప్, మిడిలార్డర్ ఘోరంగా విఫలమైంది. వికెట్ కీపర్ సుష్మ వర్మ (41), పూజ వస్త్రాకర్ (51)లు ఆఖర్లో రాణించటంతో భారత్ ఓ మోస్తరు స్కోరు చేయగల్గింది. నికోల కేరే వికెట్లేమీ తీయకపోయినా చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులేసి భారత బ్యాట్స్‌వుమెన్‌ను ఇబ్బంది పెట్టింది.

కష్టతరమేమీ కాని విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్‌కు ఓపెనర్ బోల్టన్ ఒంటి చేత్తో విజయాన్ని అందించింది. దీటుగా ఇన్నింగ్స్ ప్రారంభించిన బోల్టన్ (100 నాటౌట్, 101 బంతుల్లో ) డజను బౌండరీలతో భారత బౌలర్లపై విరుచుకుపడింది. వికెట్ కీపర్, ఓపెనర్ అలిసా హీలి (38), కంగారూ సారథి మెగ్ లానింగ్ (33)లు బోల్టన్‌కు సహకారం అందించారు. హీలి, లానింగ్‌లు వెనుదిరిగినా ఎలౌస్ పెర్రీ (25 నాటౌట్)తోడుగా బోల్టన్ పని పూర్తి చేసింది. దీంతో 32.1ఓవర్లలో కేవలం రెండు వికెట్ల నష్టానికి ఆసీస్ లక్ష్యాన్ని అందుకుంది. ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించిన ఆసీస్ అమ్మాయిలు మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ముందంజ వేశారు. భారత్, ఆస్ట్రేలియాల మధ్య రెండో వన్డే గురువారం జరుగనున్నది.

**సంక్షిప్త స్కోరు : భారత్ ఇన్నింగ్స్ :** 200/10 (పూనమ్ రౌత్ 37, సుష్మ వర్మ 41, పూజ వస్త్రాకర్ 51, జోనసెన్ 4/30, వెల్లింగ్టన్ 3/24).

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ :** 202/2 (నికోల్ బోల్టన్ 100, అలిసా హీలి 38, మెగ్ లానింగ్ 33, శిఖా పాండే 1/38).

# పట్టిందల్లా బంగారమే!



కోహ్లి భవిష్యత్‌పై నరేంద్ర బుందే జోస్యం

**న్యూఢిల్లీ:** పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ పట్టిందల్లా బంగారమే అవుతందని క్రికెట్ జ్యోతిష్కుడిగా పేరుగాంచిన నరేంద్ర బుందే అన్నాడు. క్రికెట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రికార్డులు అతడి సొంతమవుతాయని, ఇదివరకెవరూ చేసుకోని భారీ ఒప్పందాన్ని కోహ్లీ చేసుకుంటాడని అంచనా వేశాడు. టీ20, వన్డే ప్రపంచకప్‌లను కోహ్లి సాధిస్తాడని, సచిన్ టెండూల్కర్ వంద శతకాల రికార్డును సైతం తిరగరాస్తాడని నరేంద్ర జోస్యం చెప్పారు. 'నా గత అంచనాలన్నీ నిజమయ్యాయి. విరాట్ టీ20, వన్డే ప్రపంచకప్‌లు కైవసం చేసుకుంటాడు. 2025 కల్లా సచిన్ రికార్డు బద్దలు కొడతాడు. అంతేకాదు అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటి వరకు ఎవ్వరూ చేసుకోని ఒప్పందాన్ని 2018లో కోహ్లి చేసుకుంటాడు. అది మార్క్ మస్కరెన్హాస్ వర్ల్‌టెల్‌తో సచిన్ చేసుకున్న ఒప్పందం లాంటిదే. కానీ ఈ ఒప్పందం విలువ ఎవరూ ఊహించనంత ఎక్కువగా ఉంటుంది' అని నరేంద్ర తెలిపారు.

# శార్దూల్ శభాష్

## శ్రీలంకతో టీ20 సమరంలో ఆరు వికెట్ల తేడాతో భారత్ విజయం

● మనీశ్, దినేశ్ మెరుపులు
● కుశాల్ అర్థ శతకం వృథా
● ముక్కోణపు టీ20 సిరీస్

నవతెలంగాణ-కొలంబో

ప్రేమదాస మైదానంలో యువ భారత్ జోరు కొనసాగించింది. ఆతిథ్య శ్రీలంకతో టీ20 పోరులో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' శార్దూల్ ఠాకూర్ (4/27) నాల్గు వికెట్ల ప్రదర్శనకు మిగతా బౌలర్లు సమిష్టి కృషి తోడైంది. దీంతో భారత్ లంకను ఓ మోస్తరు స్కోరుకే పరిమితం చేసింది. కుశాల్ మెండిస్ అర్థ శతకంతో లంకేయులు తొమ్మిది వికెట్ల నష్టానికి నిర్ణీత ఓవర్లలో 152 పరుగులు చేశారు. ఛేదనలో టీమ్ ఇండియా టాప్ ఆర్డర్ విఫలమైనా మనీశ్ పాండే (42 నాటౌట్), దినేశ్ కార్తీక్ (39 నాటౌట్)లు కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. లంక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. తాజా విజయంతో భారత్ ఫైనల్ అవకాశాలు పటిష్ఠం అయ్యాయి. టోర్నీలో ఐదో మ్యాచ్ భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య బుధవారం జరుగుతుంది.

**శార్దూల్ శభాష్ :** టీమిండియా బౌలర్ శార్దూల్ ఠాకూర్ లంకతో భారత్ రెండో పొట్టి పోరులో అద్భుతంగా రాణించాడు. ఓపెనర్ గుణతిలక వికెట్ సహా మొత్తం నాల్గు వికెట్లు కూల్చాడు. వాషింగ్టన్ సుందర్ సైతం రెండు వికెట్లతో మెరిశాడు. వర్షం కారణంగా ఆలస్యంగా ఆరంభమైన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన భారత్ తొలుత శ్రీలంకు బ్యాటింగ్‌కు పిలిచింది. శ్రీలంక ఓపెనర్లు దనుష్క గుణతిలక (17), కుశాల్ మెండిస్ (55, 38 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు )లు మెరిశారు. శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో మూడో ఓవర్ తొలి బంతికే ఓపెనర్ గుణతిలక ఔటయ్యాడు. స్లిప్స్‌లో సురేశ్ రైనాకు క్యాచ్ ఇచ్చి క్రీజును వీడాడు. వన్‌డౌన్ బ్యాట్స్‌మన్, వికెట్ కీపర్ కుశాల్ పెరీరా (3)ను వాషింగ్టన్ సుందర్ సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితం చేశాడు. ఈ దశలో ఉపుల్ తరంగ (22) కాసేపు భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. కానీ విజయ్ శంకర్ ఆ పరీక్షకు తెరదించాడు. చండీమాల్ లేని వేళ సారథ్య బాధ్యతలు స్వీకరించిన తిసారా పెరీరా (15), దసున్ శనక (19)లు దాటిగా ఆడటానికి ప్రయత్నించి శార్దూల్ బంతికి వికెట్ సమర్పించుకున్నారు. అర్థ శతకంతో దూసుకొచ్చిన కుశాల్ మెండిస్‌ను యుజ్వేంద్ర చాహల్ ఔట్ చేశాడు. మిగిలిన బ్యాట్స్‌మెన్ అంతా రెండంకెల స్కోరు అందుకోలేకపోయారు. దీంతో నిర్ణీత 19 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి లంకేయులు 152 పరుగులు చేశారు.



శార్దూల్ ఠాకూర్ (4/27)

**మనీశ్, దినేశ్ మెరుపులు :** ఛేదనలో టీమ్ ఇండియా ఓపెనర్లు రోహిత్ శర్మ (11) శిఖర్ ధావన్ (8) నిరాశ పరిచారు. వన్‌డౌన్‌లో లోకేష్ రాహుల్ (18) అవసరమైన రాణించలేదు. సురేశ్ రైనా (27) మరోసారి ధాటిగా ఆడే ప్రయత్నంలో వికెట్ చేజార్చుకున్నాడు. టాప్ ఆర్డర్ చేతులెత్తేసిన తరుణంలో మనీశ్ పాండే (42 నాటౌట్, 31 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్స్), దినేశ్ కార్తీక్ (39, 25 బంతుల్లో 5 ఫోర్లు) నిలకడగా ఆడారు. అనవసరమైన బౌండరీలను ప్రయత్నించకుండా చక్కగా బ్యాటింగ్ చేశారు. అజేయంగా భారత్‌కు ఘన విజయాన్నిచ్చారు. లంక బౌలర్లలో అఖిల ధనంజయకు రెండు.. నువాన్ ప్రదీప్, జీవన్ మెండిస్‌లకు చెరో వికెట్ దక్కాయి.

**ఓవర్ల కుదింపు :** కొలంబోలో కురిసిన వర్షం కారణంగా టాస్ వేయడానికి ఆలస్యమైంది. తొలుత చిరుజల్లులతో మొదలైన వర్షం కాస్తా పెద్దదిగా మారింది. దీంతో ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. మైదాన సిబ్బంది పిచ్‌పై కవర్లు కప్పేశారు. కాసేపటి తర్వాత వాన తెరపినివ్వడంతో ఓవర్లను 19కి కుదించి మ్యాచ్ ప్రారంభించారు.

**శ్రీలంక ఇన్నింగ్స్ :** దనుష్క గుణతిలక (సి) రైనా (బి) శార్దూల్ 17, కుశాల్ మెండిస్ (సి) రోహిత్ (బి) చాహల్ 55, కుశాల్ పెరీరా (బి) సుందర్ 3, ఉపుల్ తరంగ (బి) విజయ్ శంకర్ 22, తిసారా పెరీరా (సి) చాహల్ (బి) శార్దూల్ 15, జీవన్ మెండిస్ (బి) సుందర్ 1, దసున్ శనక (సి) కార్తీక్ (బి) శార్దూల్ 19, అఖిల ధనంజయ (సి) రాహుల్ (బి) ఉనద్కత్ 5, సురంగ లక్మల్ నాటౌట్ 5, దుశ్మంత చమీరా (సి) ఉనద్కత్ (బి) శార్దూల్ 0, నువాన్ ప్రదీప్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 10, **మొత్తం :(19 ఓవర్లలో 9 వికెట్లకు) 152.**

**వికెట్ల పతనం :** 1-25, 2-34, 3-96, 4-113, 5-118, 6-120, 7-146, 8-151, 9-151.

**బౌలింగ్ :** జైదేవ్ ఉనద్కత్ 3-0-33-1, వాషింగ్టన్ సుందర్ 4-0-21-2, శార్దూల్ ఠాకూర్ 4-0-27-4, యుజ్వేంద్ర చాహల్ 4-0-34-1, విజయ్ శంకర్ 3-0-30-1, సురేశ్ రైనా 1-0-6-0.

**భారత్ ఇన్నింగ్స్ :** రోహిత్ శర్మ (సి) కుశాల్ మెండిస్ (బి) ధనంజయ 11, శిఖర్ ధావన్ (సి) తిసార పెరీరా (బి) ధనంజయ 8, లోకేష్ రాహుల్ హిట్ వికెట్ (బి) జీవన్ మెండిస్ 18, సురైశ్ రైనా (సి) తిసార పెరీరా (బి) ప్రదీప్ 27, మనీశ్ పాండే 42 నాటౌట్, దినేశ్ కార్తీక్ 39 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 8, **మొత్తం :(17.3 ఓవర్లలో 4 వికెట్లకు) 153.**

**వికెట్ల పతనం :** 1-13, 2-22, 3-62, 4-85.

**బౌలింగ్ :** సురంగ లక్మల్ 2-0-19-0, అఖిల ధనంజయ 4-0-19-2, దుశ్మంత చమీరా 3-0-33-0, నువాన్ ప్రదీప్ 2.3-0-30-1, జీవన్ మెండిస్ 4-0-34-1, తిసార పెరీరా 2-0-17-0.

# రబాడా చెడుగుడు

ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా విజయం



**పోర్ట్ ఎలిజబెత్ :** ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడా (6/54) విజృంభించటంతో ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో దక్షిణా ఫ్రికా జట్టు ఆరు వికెట్ల తేడాతో గెలు పొందింది. నాల్గు రోజుల్లోనే ఫలితం తేలిన పోరులో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' రబాడా మెరుపులతో పర్యాటక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 239 పరుగులకే ఆలౌటయింది. ఉస్మాన్ ఖవాజా (75), మిచెల్ మార్ష్ (45) మినహా అందరూ సఫారీ బౌలర్లకు బలయ్యారు. రబాడా ఆరు వికెట్లతో చెలరేగగా.. కేశవ్ మహరాజ్, లుంగిసాని ఎంగిడి చెరో రెండు వికెట్లతో తమ వంతు బాధ్యత నెరవేర్చారు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో 139 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన సఫారీలు విజయానికి అవసరమైన 101 పరుగులను 22.5 ఓవర్లలోనే బాదేశారు. గెలుపుపై ధీమాతో బరిలోకి దిగిన సఫారీలు ఓ పక్క వికెట్లు కూలుతున్నా నిదానంగా ఆడారు. ఏడెన్ మార్క్‌రం (21), హషీమ్ ఆమ్లా (27), ఏబీ డివిలియర్స్ (28)లను ఆసీస్ స్వల్ప స్కోర్లకే పరిమితం చేసినా లాభం లేకపోయింది. ఆరు వికెట్ల తేడాతో రెండో టెస్టు నెగ్గిన దక్షిణాఫ్రికా నాల్గు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాల మధ్య మూడో టెస్టు ఈ నెల 22 నుంచి కేప్ టౌన్‌లో జరుగుతుంది.

**రబాడా రగడ:** మైదానంలో ఆవేశాన్ని తగ్గించుకోలేక ఇదివరకే పరుమార్లు క్రమశిక్షణ చర్యలను ఎదుర్కొన్న రబాడా తాజా టెస్టులోనూ చేసిన లెవల్ తప్పి దానికి రెండు టెస్టు మ్యాచుల నిషేధానికి గురయ్యాడు. దీంతో ఆస్ట్రేలియాతో జరుగనున్న తదుపరి రెండు టెస్టులకు అతడు జట్టుకు దూరం కానున్నాడు.

భారత్‌తో లార్డ్స్ టెస్టుకు

# స్టోక్స్ దూరం

**న్యూఢిల్లీ :** ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ లార్డ్స్ వేదికగా ఆగస్టులో భారత్‌తో జరిగే రెండోటెస్టుకు దూరం కానున్నాడు. బ్రిస్టల్‌లోని ఓనైట్ క్లబ్‌లో జరిగిన గొడవ కేసులో స్టోక్స్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతితెలిసిందే. ఆ కారణంగా అతడు ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లోనూ జట్టులో స్థానం కోల్పోయాడు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో చోటు దక్కించుకున్నాడు. సోమవారం సాయంత్రం స్టోక్స్ లైవ్‌వీడియో ద్వారా కోర్టు విచారణకు హాజరయ్యాడు. తాను నిర్దోషినని కోర్టుకు విన్న వించుకున్నాడు. ఆగస్టు 6వ తేదీకి అతడి కేసు విచారణ వాయిదా పడింది. సుమారుగా వారం రోజుల పాటు విచారణ సాగే వీలుంది. దీంతో స్టోక్స్ భారత్‌తో జరిగే రెండో టెస్టుకు అందుబాటులో ఉండటం లేదు. భారత క్రికెట్ జట్టు జులై3 నుంచి ఇంగ్లాండ్‌లో పర్యటించ నుంది. ఇందులో భాగంగా ఐదు టెస్టులు సహా మూడు వన్డేలు, మూడు టీ 20 మ్యాచులు ఆడనున్నది.



# యుకీ దూకుడు

## లూకాస్‌పై 2-0తో సునాయస విజయం

● జకోవిచ్, జ్వెరెవ్‌లకు నిరాశ
● ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టెన్నిస్



**ఇండియన్ వెల్స్ (అమెరికా) :** భారత అగ్ర శ్రేణి ఆటగాడు యుకీ బాంబ్రీ ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో సత్తా చాటుతున్నాడు. ప్రపంచ 12వ ర్యాంకర్ లూకాస్ పౌలీను 6-4, 6-4తో వరుస సెట్లలో చిత్తు చేసి కెరీర్‌లోనే అతి పెద్ద విజయాన్ని నమోదు చేశాడు. అర్హత పోరుల్లో సహచర భారత ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్‌ను ఓడించి ప్రధాన సమరంలోకి ప్రవేశించిన యుకీ మంగళవారం జరిగిన రెండో రౌండ్‌లో తొమ్మిది సీడ్ లూకాస్ పౌలీ (ఫ్రాన్స్)ను మట్టికరిపించి ఔరా! అనిపించాడు. ఈఒక్క విజయంతో యుకీ 45 ర్యాంకింగ్ పాయింట్లు ఆర్జించాడు. 79 నిమిషాల పోరును యుకీ రెండు సెట్లలోనే ముగించాడు. తదుపరి రౌండ్లో యుకీ అమెరికా పొడగరి, 21వ సీడ్ శామ్‌ఖుర్రేతో తలపడనున్నాడు.

ఇక సీనియర్ ఆటగాళ్లు అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), నొవాక్ జకొవిచ్ (సెర్బియా)లు మూడో రౌండ్ ముంగిట తడబడ్డారు. అన్‌సీడెడ్ ఆటగాళ్లతో మూడు సెట్ల పాటు పోరాడి ఓడి ఇంటి ముఖం పట్టారు. నాల్గో సీడ్ జ్వెరెవ్ 5-7, 7-5, 4-6తో జోవో సౌసా (పోర్చుగల్) చేతిలో ఓడాడు. 10వ సీడ్ నొవాక్ జకొవిచ్ 6(3)-7(7), 6-4, 1-6తో జపాన్ కుర్రాడు టారో డానియెల్ చేతిలో పరాజయం చవిచూశాడు. మారిన్ సిలిచ్, డెల్ పొట్రో, జాక్ సాక్‌లు తదుపరి రౌండ్లలో అడుగుపెట్టారు. మహిళల సింగిల్స్ సర్క్యూట్‌లో లాట్వియా భామ జెలెనా ఒస్టపెంకొకు షాక్. ఆరో సీడ్ జెలెనా 3-6, 3-6తో అన్‌సీడెడ్ క్రొయేషియా అమ్మాయి పెట్రా మార్టిక్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. సిమోన హాలెప్, కరోలిన ప్లిస్కోవాలు ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.